



భక్తవరదే వరలక్ష్మై నమః

9

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ ఆలయాలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఉదయం నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.


నారాయణ.. నారాయణ

వెంకటాచలం మండలం గొలగమూడిలోని వెంకయ్యస్వామి ఆలయంలో శుక్రవారం ఆరాధనోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఉదయం ప్రత్యేక పూజలనంతరం స్వామివారు సర్వభూపాల వాహనంపై ఊరేగారు. సాయంత్రం కల్పవృక్షవాహనంపై వెంకయ్య దర్శనమిచ్చారు. అవదూతను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

2

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



16

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

శనివారం 19 ఆగస్టు 2017



కిలో ఉల్లి రూ.23

రైతు బజార్‌లో విక్రయం

14



ఒక చిత్రం.. ఒక ఆలోచన!

- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

16

నంద్యాల పోరులో

మనోళ్లు!

నెల రోజులుగా అక్కడే మకాం

ఇంటింట ప్రచారంలో ఇన్‌చార్జి మంత్రి

సోమిరెడ్డి కౌంటర్ అటాక్


టెక్నాలజీ సాయంతో నారాయణ వ్యూహాలు

వైసీపీ నేతలకు ప్రచార బాధ్యతలు

చివరి మూడు రోజులే కీలకం

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న నంద్యాల ఉప ఎన్నికల పోరులో సింహపురి నేతలు కీలక పాత్ర పోషిస్తున్నారు. నెల రోజులుగా నంద్యాలలో మకాం వేసిన ఇరు పార్టీల నేతలు ఎవరికి వారు ప్రచారాల్లో పాల్గొంటున్నారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో ముఖ్య నేతలెవరూ కనిపించడం లేదు.





తమ అభ్యర్థి గెలుపు కోసం వ్యూహ, ప్రతివ్యూహాలతో రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాజకీయ సమీకరణలతోపాటు జగన్ చేసే ఆరోపణలకు కౌంటర్ ఎటాక్ ఇస్తూ ఆ పార్టీ నేతలను ఉత్సాహపరుస్తున్నారు. మరో మంత్రి పొంగూరు నారాయణ సాంకేతికత సహకారంతో ప్రచారాలు హోరెత్తిస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమరనాథ్‌రెడ్డి ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఇక వైసీపీ ఎమ్మెల్యేలంతా నంద్యాలలోనే మకాం వేసి వారికి అప్పచెప్పిన బాధ్యతలను నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడ్డారు. మిగిలిన 3 రోజులే కీలకం కావడంతో అందరూ బిజీగా ఉన్నారు. పేరుకు అది నంద్యాల ఉప ఎన్నిక అయినా అక్కడ జిల్లా నేతల హడావుడి చూస్తుంటే నెల్లూరు ఎన్నిక అన్నట్టుంది.

7 లో..





కింద పడదోసి.. కొరికేసి

కావలిలోని కలుగోళమ్మపేటలో వృద్ధురాలు బీబిజాన్‌ను కిందపడదోసి కొరుకుతున్న పందులు

పందులున్నాయ్.. పారాహుషార్!

పక్కకెళ్తే పిక్కలు పీకేస్తాయ్!

వీధుల్లో వరాహాల స్వైరవిహారం

చెత్తకుప్పలు, డ్రైనేజీ కాలువల్లో నివాసం

వ్యాధుల వ్యాప్తి.. ఆపై మనుషులపై దాడి

కాగితాల్లోనే జనావాసాలకు దూరంగా..

పెంపకందారులకు ప్రత్యామ్నాయ ఉపాధి ఏదీ!?

చొరవ చూపని పాలకులు, అధికారులు

పందులే కదా... అదిలిస్తే పక్కకు వెళతాయి అనుకుంటే మీరు పొరబడ్డట్టే. వాటి కంట పడితేచాలు.. కొరికి పడేస్తున్నాయి. మొన్న నెల్లూరు.. ఇప్పుడు కావలి. శుక్రవారం పట్టణంలోని కలుగోళమ్మపేటలో ఓ వృద్ధురాలిపై రెండు పందులు విచక్షణారహితంగా దాడి చేశాయి. కిందపడేసి, కోరపళ్లతో కొరికేశాయి. అటుగా వెళుతున్న వారు గుంపులుగా ఏర్పడి రాళ్లు, కర్రలతో తరిమితే వృద్ధురాలిని వదిలేసి పక్కకు వెళ్లాయి. లేదంటే ప్రాణాలు పోయేవే. అంతకుముందు ఇవే పందులు బైక్‌పై వెళుతున్న ఓ యువకుడి పిక్క కొరికాయి. ఇలా రాకాసి పందులు జనంపై విరుచుకుపడుతున్నాయి. జనావాసాలకు దూరంగా వాటిని తరలించాలన్న ప్రతిపాదన ఆచరణలో అమలు కావడంలేదు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పురపాలక సంఘాల్లో నెలకొన్న పరిస్థితులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- వివరాలు 8లో



నెల్లూరు : ఐటీ, సిట్ అధికారులు సోదాలు నిర్వహించిన రామలింగయ్య ఇల్లు ఇదే!

విశాఖ భూ కుంభకోణంలో

నెల్లూరు రైస్‌మిల్లర్లు?

- రూ.20 కోట్లకుపైగా పెట్టుబడులు
- బ్రోకర్‌గా వ్యవహరించిన వేణుగోపాల్
- కన్సల్టెంట్‌గా వ్యవహారాలు సర్దుబాటు
- సిట్, ఐటీ అధికారుల దాడుల పరంపర
- కీలక రికార్డులు స్వాధీనం

- 6లో..

ఆందోళన



ఏబీవీపీ విద్యార్థులు శుక్రవారం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది ప్రధాన ద్వారం వద్దే పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని, లాఠీచార్జి చేశారు.

- 7లో..



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

పాడి పంటలను పశుపక్ష్యాదులను, పసి బిడ్డలను కంటికి రెప్పలా చూసే వేయికళ్ల చల్లని తల్లి, శక్తి స్వరూపిణి అమ్మలగన్న అమ్మ దగదర్తి పోలేరమ్మ. దుష్టశక్తులు భక్తుల దరిచేరకుండా కాపాడడమే కాకుండా, వారి కోర్కెలు తీర్చే కరుణామయిగా పేరుపొందింది.

\- దగదర్తి



అమ్మవారి దేవస్థానం

పిలిస్తే పలికే తల్లి దగదర్తి పోలేరమ్మ

అమ్మవారి ఉద్భవం

దగదర్తి గ్రామానికి పైభాగంలో పడమరవైపున భూ అంతర్భాగంలో ఏకశిలా రూపంలో నిక్షిప్తమై ఉన్న అమ్మవారు గ్రామానికి చెందిన వడ్డే వంశానికి చెందిన ఒకరికి స్వప్నంలో కనిపించి



అంకమ్మ ఆలయం

భూమి లోపల ఉన్న తనను వెలికి తీసి గుడి నిర్మించాలని ఆదేశించారు. దాంతో వారు ఆ ప్రాంతంలో తవ్వగా బీజాక్షరాలు లిఖించిన శిల ఒకటి బయటపడింది. ఆ ప్రదేశంలోనే 2004లో అమ్మవారికి ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి అమ్మవారు నిత్య పూజలందుకుంటూ భక్తుల కోరికలు తీరుస్తున్నారు.

ఆలయ ప్రత్యేకత

అమ్మవారి ఆలయానికి ద్వారపాలకులుగా వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉండటం విశేషం. ఆలయానికి ఎడమవైపున సోదరి నాగమ్మ, ఈశాన్యం వైపున మరో సోదరి రేణుకమ్మ, ఆలయానికి ఎదురుగా అమ్మవారి సోదరుడు పోతురాజు. ఆలయానికి కుడి వైపున కొంత దూరంలో అంకమ్మ అమ్మవారు వెలిశారు. అమ్మవారి గర్భగుడిపైన రుద్రగణాలు ఉండటం ఈ ఆలయం ప్రత్యేకత. సంతానం లేని వారు స్నానం చేసి తడి దుస్తులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి వరపడితే ఏడాదికి సంతానం కలుగుతుందని భక్తుల అపార నమ్మకం.

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి

తమ బాధలు తొలగిపోవాలని, కోర్కెలు తీరాలని ఆలయానికి వచ్చి మొక్కుకుంటే, తప్పక



పోతురాజు ఆలయం

నెరవేరుతాయనేది భక్తుల నమ్మకం. కోర్కెలను అమ్మవారు ఎంత త్వరగా తీరుస్తారో, అంతే త్వరగా మొక్కులు చెల్లించకుంటే అమ్మవారు ఆగ్రహిస్తుందనే భయంతో, కోర్కెలు తీరిన తర్వాత జరిగే జాతరలోనే మొక్కులు చెల్లించుకుంటారు.

విశిష్ట పూజలు

అమ్మవారికి నిత్యపూజలు జరుగుతుంటాయి మంగళవారం, ఆది, శుక్ర వారాలలో కూడా విశిష్ట పూజలు, పల్లకి సేవలు జరుగుతాయి. దశరా సందర్భంగా నవరాత్రి ఉత్సవాలు, ఇతర పర్వదినాలలో సాంప్రదాయ పూజలు ఉంటాయి. అమ్మవారికి కోటి కుంకుమార్చన అంటే ఎంతో ప్రీతి. కనుక తరచు కుంకుమార్చన జరుగుతుంటుంది.

వైభవంగా జాతర

ప్రతి ఏడాది ఫిబ్రవరిలో వచ్చే తొలి మంగళవారం నాడు అత్యంత వైభవంగా జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు జిల్లా నుంచే కాకుండా చుట్టు పక్కల జిల్లాల నుంచి కూడా భక్తులు తండోపతండాలుగా తరలి వస్తారు. కోర్కెలు తీరిన భక్తులు తలనీలాలు సమర్పించడంతోపాటు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి మూడు విస్తర్లలో అమ్మవారికి నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లించుకుంటారు. జాతరలో అమ్మవారిని దర్శించుకునేందుకు రాజకీయ నేతలు, పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖులు క్యూ కడతారు. జాతర సందర్భంగా భారీ ఎత్తున ఎడ్ల పందాలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రాచీక కళల ప్రదర్శనలు నిర్వహిస్తారు.

కరువు నివారణ చర్యలు చేపట్టాలి

నెల్లూరు (కలెక్టరేట్) : జిల్లాలోని కరువు మండలాల్లో కరువు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంటల సాగుకు చేసిన అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కొన్ని ప్రాంతాల్లో పంట చేతికి వచ్చినా గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వెంటనే కరువు నివారణ చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దామా అంకయ్య, ప్రభాకర్, కరిముల్లా, పీ లీలామోహన్, ఎస్కే అన్వర్, ఎస్కే షానవాజ్, సీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

గొలగమూడిలో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

- తొలిరోజు సర్వభూపాల వాహనసేవ
- రాత్రి కల్పవృక్ష వాహనంపై వెంకయ్య
- మొదలైన భక్తుల సందడి



వెంకయ్య విగ్రహానికి అభిషేకం

వెంకటాచలం: గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువ జామున గోపూజ, సుప్రభాత సేవ, అభిషేకం, అనంతరం పూజ, హారతి ప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తికి అభిషేకం జరిగింది. గణపతి పూజ, స్వస్తివాచనం, అంకురార్పణ, దీక్షావస్త్రధారణ, కంకణధారణ, కలశస్థాపన, శిఖర కలశ సంప్రోక్షణలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి సమాధి మందిరాన్ని పూలతో



సర్వభూపాల వాహనం ముందు ఈవో, ఇతర అధికారులు, భక్తులు

అత్యంత రమణీయంగా అలంకరించారు. ఉదయం పది గంటలకు గొలగమూడి గ్రామస్తులచే సర్వభూపాల వాహన సేవ కనుల పండువగా నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామివారికి గ్రామస్థులు కొబ్బరికాయలు కొట్టారు. కర్పూర హారతులు పట్టారు. ఊరేగింపు ముందు భక్తుల కోలాటాలు, పండరి భజనలు విశేషంగా అలరించాయి. ఆరాధన మొదటి రోజు కావడంతో ఉభయకర్తలతో పాటు భారీసంఖ్యలో భక్తులు స్వామి వారి సమాధి మందిరాన్ని దర్శించుకున్నారు. భక్తులకు గ్రామస్థులు శుక్రవారం అన్నదానం నిర్వహించారు.



చిన్నారుల కోలాటం

● కల్పవృక్ష వాహనంపై

ఆరాధనోత్సవాల్లో మొదటి రోజైన శుక్రవారం రాత్రి వెంకయ్యస్వామి వారు కల్పవృక్ష వాహనంపై కొలువై గ్రామంలో పర్యటించారు. భజన బృందాలు ముందు వైపు సాగుతుండగా, నాదస్వర వాయిద్యాలు స్వామిని కీర్తిస్తుండగా, పూలతో రమణీయంగా అలంకరించిన కల్పవృక్షవాహనంపై స్వామివారు గ్రామ వీధుల్లో విహరించారు. ఈ ఉత్సవం ఆద్యంతం కనుల పండువగా జరిగింది. ఈ సేవకు గొలగమూడి గ్రామస్థులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

● గొలగమూడిలో నేడు..

ఆరాధనోత్సవాల్లో రెండో రోజైన శనివారం ఉదయం నిత్య పూజలతో పాటు ఉదయం 10 గంట లకు వెంకయ్యస్వామికి హనుమంతవాహన సేవ జరుగుతుందని ఆశ్రమ ఈవో బాల సుబ్రహ్మణ్యం చెప్పారు. ఈ సేవకు సూదలగుంట నాగార్జునరావు, ప్రేమలత ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని వెల్లడించారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవ జరుగుతుందని ఈ సేవకు ఆల్తూరి ఆదినారాయణరెడ్డి, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఆల్తూరు మహేష్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవ హరిస్తారని వివరించారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీరామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర నాటకాలు ప్రదర్శితమవుతాయని తెలియజేశారు.



విద్యుద్దీపాలంకరణలో వెంకయ్యస్వామి ఆలయం

216 మంది మిగులు ఉపాధ్యాయులు

నెల్లూరు (క్యాంపస్) : జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ముగియడంతో విద్యాశాఖ అధికారులు రేషనలైజేషన్‌లో మిగిలిన టీచర్ల జాబితాపై దృష్టి సారించారు. మొత్తం 216 మంది టీచర్లు మిగిలి ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. వీరిలో 129 మంది ఎస్‌జీటీలు, ఎస్ఏ ఇంగ్లీష్ ఆరుగురు, ఎస్ఏ ఫిజిక్స్ 29 మంది, ఎల్పీ తెలుగు 49 మంది, పీఈటీలు ముగ్గురు ఉన్నారు. వీరిని డీఈవో జిల్లాలో ఉన్న ప్రభుత్వ, జడ్పీ, మున్సిపాలిటీ, ఎయిడెడ్, సోషల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో, ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట నియమించనున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక 216 మంది భవితవ్యం తేలు తుందని అధికారుల చెబుతున్నారు. మిగులు టీచర్లు మండలాల్లోని ఎంఈవోలకు శనివారం రిపోర్టు చేయాలని డీఈవో ఓ ప్రకటనలో ఆదేశించారు.

సంస్కృతం విజ్ఞాన భాండాగారం

● ప్రముఖ గాయకుడు గోరటి వెంకన్న

వెంకటాచలం: సంస్కృతం గొప్ప విజ్ఞాన భాండాగారమని ప్రముఖ గాయకుడు గోరటి వెంకన్న తెలిపారు. గొలగమూడి విశాలాక్షి వృద్ధుల ఆశ్రమ ఆవరణలో ఏర్పాటు చేయనున్న వేద సంస్కృత పాఠశాలకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ పురాతన భాష అయిన సంస్కృతంలో వెలకట్టలేని విజ్ఞాన గ్రంథాలు ఉన్నాయన్నారు. అందువల్లనే ప్రపంచ దేశాలు సంస్కృత భాష అంటే ఎనలేని గౌరవం చూపు తాయన్నారు. అటువంటి సంస్కృత భాష నేర్పించడానికి పాఠశాలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. అందుకు కృషిచేస్తున్న విశాలాక్షి సంస్థ నిర్వాహకులు కోసూరు రత్నంను ఆయన అభినందించారు. ఒక్క కుటుంబాన్నే పోషించుకోలేక అందరూ సతమతమవుతుంటే విశాలాక్షి సంస్థ నిర్వాహకులు 126 మంది వృద్ధుల బాగోగులను చూడడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ఈ పరిణామం సమసమాజ స్థాపనకు బాటలు వేస్తుందని వెంకన్న విశ్వాసం వ్యక్తం చేశారు. చిన్న పిల్లలను, మహిళలను గౌరవించేది గొప్ప సమాజమన్నారు.



సంస్కృత పాఠశాలకు శంకుస్థాపన చేస్తున్న వెంకన్న

పాశ్చాత్య ప్రభావం వల్ల ఈ సంస్కృతికి మన వారు దూరమవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత ప్రభాకర్ జైన్, సాహితీవేత్త దుక్కి కృష్ణ, విశాలాక్షి సంస్థ నిర్వాహకులు కోసూరు రత్నం తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ఇన్‌చార్జి జేసీ వెంకటసుబ్బారెడ్డి



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి జేసీ వెంకటసుబ్బారెడ్డి

నెల్లూరు (కలెక్టరేట్) : ఏపీ సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖలలో అవుట్ సోర్సింగ్ విధానంలో లెక్చరర్ల భర్తీకి ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ వెంకట సుబ్బారెడ్డి శుక్రవారం తన చాంబర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మ్యాథ్స్, మైక్రోబ యాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ తదితర సబ్జెక్టుల బోధనకు లెక్చరర్ల నియామక ప్రక్రియను ఆ శాఖలు ప్రారంభించాయి. మొత్తం 62 అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలలో గతంలో 18 ఖాళీలు భర్తీ చేశారు. మిగిలిన వాటికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 70 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు.

ఆక్వా కల్చర్ కోర్సు ప్రారంభం

నెల్లూరు (క్యాంపస్) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని కావలి పీజీసెంటర్‌లో ఈ విద్యాసంవత్సరం నుంచి ఎంఎస్సీ ఆక్వా కల్చర్ కోర్సును ప్రారంభిస్తున్నామని పీజీ సెట్ కన్వీనర్ జవహర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఆక్వా కల్చర్ పరిశ్రమకు నిపుణులైన అభ్యర్థులను అందించి ఎరిశ్రమ వృద్ధి కోసం దోహద పడేందుకు ఈ కోర్సును ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆక్వా పరిశ్రమకు అవసరమైన విద్య, ప్రయోగ అంశాలతో కూడిన శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. అపారమైన ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బీఎస్సీలో కనీసం బయాలజీ సబ్జెక్టు చదివిన వారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు. 2017లో జరిగిన వీఎస్‌యూ పీజీ సెట్, ఎస్వీయూ పీజీ సెట్‌తో పాటు ఇతర యూనివర్సిటీకి సంబంధించిన సబ్జెక్ట్ పరీక్ష రాసిన వారు కోర్సులో చేరవచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉన్న వీఎస్‌యూ పీజీ సెట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బొట్లగుంట ఆక్రమణల తొలగింపు

సుందరీకరణకు రూ. కోటి కోసం ప్రతిపాదనలు



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

కావలి: కావలిపట్టణ కావలి- ఉదయగిరి రోడ్డును ఆనుకొని ఉన్న బొట్లగుంట అభివృద్ధిలో భాగంగా శుక్రవారం దాని చుట్టూ ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించారు. బొట్లగుంటను అభవృద్ధి చేసి దానిని అందంగా తీర్చిదిద్దేందుకు సుమారు కోటి రూపాయలతో ప్రతిపాదనలు పంపారు. బొట్లగుంట చుట్టూ రోజురోజుకూ ఆక్రమణలు జరుగుతుండడంతో ఇటీవల వాటిని తొలగించారు. తొలగించినా మళ్లీ కొందరు గుడిసెలు వేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో భక్తవత్సలరెడ్డి, తహసీల్దార్ కృష్ణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పి. అలేఖ్య, కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది అక్కడికి వెళికల అక్కడున్న ఆక్రమణలు పూర్తిగా తొలగించారు. అనంతరం జేసీబీతో బొట్లగుంట చుట్టూ చదును చేసి గుంటలోపల ఉన్న ముళ్లపొదలు, చెట్లను తొలగించారు.

బ్యూటిఫికేషన్‌కు శ్రీకారం

బొట్లగుంటను బ్యూటీఫికేషన్‌లో భాగంగా దాని చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి గ్రీనరీని చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. గుంటలో నీరు నిల్వ ఉండేలా అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆ గుంట మున్సిపాలిటీ పరిధిలో ఉండడంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో దాని అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

పట్టణంలో ఎక్కడ ఆక్రమణలు ఉన్నా తొలగిస్తామని తహసీల్దార్ కృష్ణారావు తెలిపారు. పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఆక్రమణలకు రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో ట్రంకు రోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించి రోడ్డు విస్తరణ కార్యక్రమం చేపడుతామని తెలిపారు.

షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అఫీజ్

కావలి: షుగర్‌వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాని డాక్టర్ అఫీజ్ తెలియజేశారు. కావలి పట్టణ 26వ వార్డులో క్రాంతి స్కూల్‌లో ఎస్ఎస్‌కె గ్లోబల్ డయాబెటీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్‌వ్యాధి పరీక్షలు, అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో 125 మందికి షుగర్ పరీక్షలు చేసి వారికి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అఫీజ్ మాట్లాడుతూ షుగర్ ఉన్న వారు వైద్యపరీక్షలతో పాటు క్రమం తప్పకుండా మందులు వాడుతూ ఆహార నియమాలు పాటించాలని తెలిపారు. వ్యాయామం, యోగా చేయడం ద్వారా షుగర్ వ్యాధిని నివారించవచ్చున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నగళ్ల శ్రీనివాస కిరణ్ మాట్లాడుతూ షుగర్‌వ్యాధి గ్రస్తులు రోజురోజుకూ పెరుగుతున్నారని శారీరక వ్యాయామం ద్వారా ఈ వ్యాధిని కొంత వరకు అదుపులో ఉంచుకోవచ్చున్నారు. అందువల్ల బాధితులు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీ. వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సిబ్బంది, ప్రసాద్, బాష, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్యాకేంద్రాలకు పుస్తకాల పంపిణీ



ప్రశ్నా పత్రాలను అందజేస్తున్న సాక్షరభారత్ ఏపీవో డేనియల్, ఎంపీడీవో ఎల్. జ్యోతి

కావలిరూరల్: కావలి రూరల్ మండలంలోని సాక్షరభారత్ విలేజ్‌కో-ఆర్డినేటర్‌లకు శుక్రవారం పుస్తకాలు, పెన్నులు, ప్రశ్నా పత్రాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాక్షరభారత్ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ డ్యానియల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి మండలంలోని వయోజన విద్యాకేంద్రాల్లో 696 మంది అభ్యాసకులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వయోజన విద్యాకేంద్రాల్లో విద్యను అభ్యసిస్తు సీ గ్రేడు పొందిన వారికి ఆగస్టు 20వ తేదీన ఎంఈవో పర్యవేక్షణలో ఆయా వయోజన కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్. జ్యోతి, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, మండల కో-ఆర్డినేటర్ ప్రభాకర్, విలేజ్ కో-ఆర్డినేటర్‌లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి రూ. 65 వేల సాయం

కావలి: కావలి పట్టణ మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విద్యార్థి బచ్చు శ్రీహరి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆ కుటుంబానికి డీబీఎస్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పోగుచేసిన రూ. 65 వేల నగదును ఆర్థిక సహాయం కింద ఆయన తల్లిదండ్రులకు శుక్రవారం డీబీఎస్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దామిశెట్టి శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ డీబీఎస్ కళాశాల మానవత్వానికి మారుపేరుగా నిలిచారని సహ విద్యార్థి మృతి చెందడడంతో వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు ఆర్థిక సహాయం అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ బాలసురేష్‌బాబు, ఈఈఈ విభాగాధిపతి సుజల, ఏవో జి. రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న డీబీఎస్ యాజమాన్యం తదితరులు

ఎమ్మార్ వ్యాక్సిన్ పనితీరు పరిశీలన



ఎమ్మార్ వ్యాక్సిన్‌ను పరిశీలిస్తున్న పరిశీలకులు

కావలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎమ్మార్ వ్యాక్సిన్ టీకాల కార్యక్రమం పనితీరును శుక్రవారం పరిశీలకులు డాక్టర్ లోకేష్, డాక్టర్ సుధీర్‌నాయక్‌లు పరిశీలించారు. కావలి పట్టణ, కావలి రూరల్ మండలంలో వారు పర్యటించి ఎమ్మార్ వ్యాక్సిన్ టీకాల కార్యక్రమం ఎలా జరుగుతుంది దీనిపై ప్రజలకు ఎంతవరకు అవగాహన కల్పించారు, దీని ఆవశ్యకత గురించి ఏ మేరకు విచారణ జరిగింది తదితర వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కావలి పట్టణంలో భాష్యం, శ్రీచైతన్య పాఠశాలలో వ్యాక్సిన్ టీకాల కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. రూరల్ మండలంలోని పెదరామునిపాలెం, కొత్తసత్రం, పెద్దపట్టపుపాలెం గ్రామాల్లో పర్యటించి పిల్లలకు ఈ వ్యాక్సిన్ సక్రమంగా వేస్తున్నారో లేదా అని తెలుసుకున్నారు. అలాగే ఈ వ్యాక్సిన్‌పై ప్రజలకు ఎంత వరకు అవగాహన కల్పించారో తెలుసుకున్నారు. తుమ్మలపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న వ్యాక్సిన్ నిల్వలను వారు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వై. వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు,

ఆర్డీవోకి టీడీపీ నేతల సత్కారం



ఆర్డీవో భక్తవత్సలరెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు

కావలిటౌన్: ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న కావలి ఆర్డీవో భక్తవత్సలరెడ్డిని శుక్రవారం టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. పట్టణ కమిటీ అధ్యక్షుడు అమరా వేదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు శాలువాలు, పూలమాలతో ఆర్డీవోను సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అమరా మాట్లాడుతూ ఆర్డీవోకు ఉత్తమ సేవా పురస్కారం లభించడం శుభపరిణామని అంకిత భావంతో పనిచేసే అధికారి ఆర్డీవో భక్తవత్సరెడ్డికి అవార్డు లభించడం సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, ఉపాధ్యక్షులు జెట్టి శేషారెడ్డి, ఊసా వెంకటరావు, గొర్రెపాటి బ్రహ్మయ్య, ద్రోణాదుల వెంకటరావు, కోశాధికారి రవ్వా సుబ్బారావు, ఖమర్‌బాబు, సన్నిబోయిన కమల్, ఏల్చూరి రవి తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో వనం-మనం

కావలిటౌన్: కావలి పట్టణంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో వనం-మనం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ప్రిన్సిపాల్ వై శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీన్ బీవిఎన్ ప్రసాద్, ఏజీఎం భాస్కర్‌రెడ్డి పాల్గొని ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలన్నారు. మొక్క మనిషి ప్రాణం కాపాడుతుందని పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ గ్రేస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎల్ఎల్ఆర్ మేళా

కావలి(క్రైం): ఆటోరిక్షా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు విద్యార్హతతో సంబంధం లేకుండా బ్యాడ్జీలు ఇచ్చేందుకు ఈ నెల 20న బ్యాడ్జీ ఎల్ఎల్ఆర్ మేళా నిర్వహించనున్నట్లు కావలి ఎంవీఐ మురళీమోహన్ తెలిపారు. రాష్ట్ర రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు కావలి మోటార్‌వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో ఈ మేళా నిర్వహించనున్నారు. ఈ మేళాలో బ్యాడ్జీ ఎల్ఎల్ఆర్ పొందదలుచుకున్న ఆటోడ్రైవింగ్ లైసెన్స్ కలిగిని డ్రైవర్లు ఫారం-1, ఫారం-1ఎ, మెడికల్ సర్టిఫికేట్, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు నకలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, సెల్ఫ్ అఫిడవిట్‌తో హాజరుకావాలని ఆయన తెలిపారు. ఇందుకోసం రూ. 260 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఆర్టీసీ డీఎం కృషి అభినందనీయం



ఆర్టీసీ డీఎం సుష్మను అభినందిస్తున్న వ్యాపారులు

కావలిటౌన్: కావలి పట్టణంలోని పెదపవని బస్టాండ్ పునఃప్రారంభానికి కావలి ఆర్టీసీ డీఎం వై. సుష్మ కృషి అభినందనీయమని జనరల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు జెట్టి శేషారెడ్డి కొనియాడారు. శుక్రవారం డీఎం కార్యాలయంలో వ్యాపారులు, టీడీపీ నేతలు ఆమెను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షులు అమరా వేదగిరి మాట్లాడుతూ ప్రయాణీకులకు ఎంతో సౌకర్యంగా ఉండే పెదపవని బస్టాండ్‌లో బస్సులు నిలిచేందుకు డీఎం తన వంతు సహకారం అందించారన్నారు. వ్యాపారులు, ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రవ్వా సుబ్బారావు, ఖమర్‌బాబు, అక్కిలిగుంట సూర్యప్రకాష్, వ్యాపారులు ఉన్నారు.

దగదర్తిలో శ్రావణలక్ష్మీ కుంకుమ పూజలు

దగదర్తి: దగదర్తిలోని దుర్గా సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని చివరి శుక్రవారం శ్రావణలక్ష్మీ కుంకుమ పూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. దుర్గాభవానీ అమ్మవారికి పెద్ద ఎత్తున మహిళలు కుంకుమ పూజ చేసేందుకు తరలివచ్చారు. అర్చకులు ఈ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు.



అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్

అల్లూరు : ఇస్కపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శేషమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని నార్తుమోపూరు, బీరంగుంట, నార్తుఆములూరు గ్రామాల్లోని 9 పాఠశాలల్లోని విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. మొత్తం 1662 మందికిగాను 1655 మందికి వేసి 99.5 శాతం పూర్తి చేసినట్టు శేషమ్మ తెలిపారు. మిగిలిన విద్యార్థులకు మరో దశలో పూర్తిచేస్తామని ఆమె వెల్లడించారు. ఈ వ్యాక్సిన్ ద్వారా వ్యాధినిరోధక శక్తి పెరిగి తట్టు వ్యాధి దరిచేరదని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పరమేశ్వరి, సూపర్‌వైజర్లు పద్మజ, పి.కృష్ణయ్య, ఆశా వాలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి భవన నిర్మాణం జరిగేనా..?!

అల్లూరు : మండల కేంద్రమైన అల్లూరులో స్త్రీశక్తి భవనం నిర్మాణం కలగా మిగిలిపోయింది. అసలు భవన నిర్మాణం జరిగేనా అని మహిళలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. స్త్రీశక్తి భవన నిర్మాణానికి కాంగ్రెస్ హయాంలో రూ25 లక్షల నిధులు విడుదలయ్యాయి. నేటికీ నిర్మాణం చేపట్టలేదు. స్త్రీశక్తి భవనం లేకపోవడంతో మహిళల కోసం కొనసాగే పథకాలు, లావాదేవీలు, మహిళా బ్యాంకు, ఉపాధిహామీ కూలీలు తదితర వాటిల్లో కొనసాగే వారికి ఒక స్థిరత్వం లేకపోయిందంటూ మహిళలు విచారం వ్యక్తం చేస్తున్నారు. స్త్రీశక్తి భవనం నిర్మిస్తే వెలుగు కార్యాలయం, మహిళా బ్యాంకు, ఉపాధిహామీ కార్యాలయం ఒకేచోట అందుబాటులో ఉండి మహిళలకు వెసులుబాటుగా ఉంటుంది. ఈ పరిస్థితి లేక వెలుగు కార్యాలయాన్ని ఇప్పటికే ఐదు చోట్ల మార్చడంతో మహిళలు అసహనానికి గురవుతున్నారు. గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో పాత కార్యాలయాల వద్దకే వెళ్లి వెతుక్కోవలసి వస్తోందని పేర్కొంటున్నారు.

వెనక్కి వెళ్లిన నిధులు..

అల్లూరులో స్త్రీశక్తి భవనాన్ని నిర్మించేందుకు 2011 లో అప్పటి ప్రభుత్వం రూ25 లక్షలు మంజూరు చేసింది. అధికారుల మధ్య సమన్వయ లోపం, నాయకుల మధ్య కుదరని సయోధ్యతో స్థల సేకరణ ఆలస్యమైంది. దీంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. మహిళా బ్యాంకును ఏర్పాటు చేస్తే మహిళలు మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం స్త్రీశక్తి భవనాన్ని ఏర్పాటు చేయాలనుకుంది. ప్రస్తుతం మహిళా బ్యాంకు అనే పదమే వినబడడం లేదు.

స్థల సేకరణలో జాప్యమే కారణం

స్త్రీశక్తి భవనాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలసేకరణ చేపట్టడంలో ఏర్పడిన జాప్యమే భవన నిర్మాణానికి నోచుకోకపోవడానికి ముఖ్య కారణంగా చెప్పవచ్చు. అప్పటి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ఆధ్వర్యంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. నిర్మాణానికి నోచుకోకపోవడం గమనార్హం. ప్రస్తుతం స్థలసేకరణ పూర్తయి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అల్లూరులో స్త్రీశక్తి భవనాన్ని నిర్మించి మహిళలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



స్త్రీ శక్తి భవనం కోసం సేకరించిన స్థలం

ఉపాధి హామీ నిధులతో భవన నిర్మాణం

స్థల సేకరణలో జాప్యం ఏర్పడినప్పటికీ ప్రస్తుతం ప్రతిపాదనలు పంపడం జరిగిపోయింది. స్త్రీశక్తి భవన నిర్మాణానికి ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరు కావాల్సి ఉంది. అయితే ఇవి కేంద్రం నుంచి మంజూరు కావాల్సి ఉండడంతో కొంతమేర జాప్యం ఏర్పడుతోందని అధికారులు భావిస్తున్నారు. ఉన్నతాధికారులకు పంపిన ప్రతిపాదనలు నిధులు మంజూరు చేసే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉందని మండలంలోని మహిళలు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు పంపాం

స్త్రీశక్తి భవన నిర్మాణానికి స్థలసేకరణ పూర్తిచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కావడమే ఆలస్యం వెంటనే భవన నిర్మాణానికి చర్యలు చేపడతాం. త్వరితగతిన మంజూరుకు అవకాశాలు కనిపిస్తున్నాయి.



- ఎంపీడీఓ, కనకదుర్గా భవాని, అల్లూరు మండలం

మా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పండి

● మోడేగుంట ఎస్సీ కాలనీవాసుల వేడుకోలు

కోవూరు: మోడేగుంట ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మూసివేయవద్దని కోరుతూ స్థానికులు ఎంఈవో జగన్నాథశర్మకు శుక్రవారం విన్నవించుకున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని గత ఏడాది పాఠశాలను మూసేందుకు విద్యాధికారులు ప్రయత్నించారు. అప్పట్లో ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి జోక్యం చేసుకొని పాఠశాల కొనసాగే విధంగా ప్రయత్నించారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి పాఠశాల మూసేందుకు విద్యాశాఖాధికారులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. బదిలీల అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం లేకుండా పోయింది. దీంతో దళితకాలనీ వాసులు తమ బిడ్డలకు విద్యాబుద్ధులు చెప్పేందుకు పాఠశాలను కొనసాగించాలని కోరుకొంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల చెంతకు వెళ్తున్నారు.

విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్లు

ఇందుకూరుపేట : మండలంలోని పలుపాఠశాలల్లోని విద్యార్థులకు శుక్రవారం ఎమ్మార్ వ్యాక్సిన్లు వేశారు. జగదేవిపేట, పల్లెపాడు, ఆదెమ్మసత్రం, రాముడుపాళెం, ఇందుకూరుపేట, కొరుటూరు తదితర గ్రామాల్లో ఈ వ్యాక్సిన్లు వేశారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది సంయుక్తంగా కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లెపాడులో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులకే కాకుండా చిన్న పిల్లలను సైతం పాఠశాలలకు తీసుకువచ్చి ఇంజక్షన్లు వేయించారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : మండలంలోని శ్రీరంగరాజపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పి.సునీత బదిలీ సందర్భంగా శుక్రవారం ఆమెకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ సభ్యులు కోరికల పెద్దఏడుకొండలు, గంపా కృష్ణయ్య, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆటో డ్రైవర్ల సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని సీపీఎం కార్యాలయంలో లారీ,వ్యాను,ఆటో డ్రైవర్ల సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకులు నేడొక ప్రకటనలో తెలిపారు.ఆర్టీఏతోపాటు పోలీసు అధికారుల దాడుల నేపథ్యంలో సమావేశం నిర్వహిస్తున్న ఆయన తెలిపారు.ద్విచక్ర వాహన చోదకులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు వయోజనులకు పరీక్షలు

విడవలూరు: నేషనల్ లిటరసీ మిషన్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ వయోజనులకు అక్షరాస్యత పరీక్షనిర్వహిస్తున్నట్లు సాక్షరభారత్ మండలకోఆర్డినేటర్ సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఈ పరీక్షలలో వయోజనులు పాల్గొనాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కొండాపురం: నీరు-చెట్టు పనులలో నాణ్యతా ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని క్వాలిటీ కంట్రోల్ ఏఈ ఎస్.కె.వీ ప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలంలోని పలుగ్రామాలలో ఆ పథకం కింద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2017-18 సంవత్సరానికి సంబంధించి 54 పనులు మంజూరుకాగా అందులో రూ 10 లక్షలుదాటిన 4 పనులకు టెండర్ల ద్వారా, 50 పనులు నామినేషన్ పద్ధతిలో జరుగుతున్నాయన్నారు. ఇప్పటికి 15 పనులు పూర్తయ్యాయని అన్ని నిర్మాణాలలో నాణ్యతా ప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. కొమ్మి, సత్యవోలు, పార్లపల్లి, గానుగపెంట, తూర్పుపాళెం తదితర గ్రామాలలో పూర్తయిన చెక్‌డ్యాములలో 3 నుంచి 4 అడుగుల మేర నీరునిల్వ ఉందని వివరించారు. దీనివల్ల భూగర్భ జల మట్టాన్ని పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అంతేగాక ఆయా గ్రామాలలోని పశువులకు, గొర్రెలకు, మేకలకు తాగు నీటి సమస్య తీరుతుందన్నారు. మండలంలో భూగర్భజల మట్టం 9 మీటర్లకు పడిపోయిందని అన్ని చెక్‌డ్యాములు పూర్తయితే 6 మీటర్లకు రావచ్చని తెలియజేశారు. నిర్మాణంలో పాటించవలసిన పలు అంశాలపై ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈ సి.రవికుమార్, ఏఈ కిరణ్‌కుమార్, మండల తెలుగుయువత అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



చెక్‌డ్యామును పరిశీలిస్తున్న అధికారులు

కేజీబీవీకి ఉపకరణాల వితరణ

కలిగిరి: స్థానిక కస్తూర్బా విద్యాలయానికి మండలంలోని కమ్మవారిపాళానికి చెందిన చేకూరి కొండపనాయుడు శుక్రవారం వాషింగ్ మిషన్, ఇతర పనిముట్లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేకాధికారిణి శ్రీలక్ష్మి మాట్లాడుతూ కస్తూర్బా విద్యాలయం స్థాపించినప్పటి నుంచి కొండపనాయుడు ఇప్పటివరకు ఎంతో సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. అదే విధంగా దాతలు పాఠశాలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



వాషింగ్‌మెషిన్ అందిస్తున్న దాత కొండపనాయుడు

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

దగదర్తి: మండలంలోని దుండిగం గ్రామంలో ఇరుగు పొరుగున ఉండే రెండు కుటుంబాల మధ్య జరిగిన పరస్పర దాడి కేసులో నలుగురిపై దగదర్తి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. దుండిగం గ్రామానికి చెందిన నేటపాటి సురేష్, కొమ్మి శ్రీహరి ఇరుగు, పొరుగు ఇళ్లకు చెందినవారు. వీరికి కొంత కాలం నుంచి చిన్నచిన్న మనస్పర్ధలు ఉన్నాయి. ఈ నెల 11వ తేదీ రాత్రి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో తమ్మినేని మహేష్, నేలపాటి సురేష్‌కు గాయాలయ్యాయి. తమ్మినేని మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేలపాటి సురేష్, కుంకాల శేషయ్యపైన నేలపాటి సురేష్ ఫిర్యాదు మేరకు కొమ్మి శ్రీహరి, కొమ్మి పద్మలపై వేరు వేరుగా కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ విజయశ్రీనివాస్ తెలిపారు. విచారణ జరిపి వాస్తవాలు తెలుసుకుంటామని వివరించారు. ప్రజలు శాంతియుత జీవనం గడపాలని కోరారు.

సమయం పాటించాలి

కలిగిరి: మండలంలోని సాక్షర భారత్ కేంద్రాలు సమయపాలన పాటించాలని ఎంపీడీవో నర్మద ఆదే శించారు. ఎంపీడీవో కార్యాలయంలో సాక్షర భారత్ కో-ఆర్డినేటర్లతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిగ్రామంలో సాక్షర తాభారత్ కేంద్రాలు విధిగా పని చేయా లని సూచించారు. వయో జనులకు విద్య నేర్పించడంతోపాటు విజ్ఞాన విషయాలను తెలియజేయాలని కోరా రు. ప్రభుత్వం రూపొందించిన కార్య క్రమా లను సాక్షరాభారత్ కేంద్రంలో అమలయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అదేవిధంగా ఆదివారం జరుగు పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాక్షర భారత్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

రేపు గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పొదలకూరు: పదో తరగతిలో ప్రతిభ కనబరచిన గౌడ విద్యార్థులకు ఆదివారం ఉదయం 9గంటలకు నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగే అభినందనసభలో ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు జిల్లా గౌడ సేవాసమితి అధ్యక్షులు కోసూరు గోవిందయ్య గౌడ్ శుక్రవారం తెలిపారు. ఐదేళ్లగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదవ తరగతి పరీక్షల్లో 8.5జీపీఏ పైన సాధించిన గౌడ విద్యార్థులందరికీ రూ.5వేలు నగదు, నోటుపుస్తకాలు, క్యాలిక్యులేటర్‌తో పాటు జ్ఞాపికలను ప్రోత్సహకంగా అందజేస్తున్నామని గుర్తుచేశారు. గౌడ సేవా సమితి, కల్లుగీత పారిశ్రామికుల సంఘం ఆధ్వర్యంలో జరిగే అభినందన సభలో ఏపీ కార్మికశాఖ మంత్రి పితాని సత్యనారాయణ, కలెక్టర్ ముత్యాలరాజు పాల్గొంటారన్నారు.

బీఎంఆర్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అల్లూరు : మండలంలోని పురిణి పంచాయతీలో బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. నెల్లూరు మోడ్రన్ కంటి ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో 315 మందికి ఉచితంగా కంటి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 32 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. 82 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. స్థానిక నాయకులు షేక్ కాలేషా, శ్రీనివాసులురెడ్డి, పోలయ్య, ట్రస్ట్ సిబ్బంది ఎన్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లింగ్‌కు
కేంద్ర బిందువు వెంకటగిరి



ఎస్పీ రామకృష్ణ

వెంకటగిరి(టౌన్): జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్‌కు వెంకటగిరి కేంద్ర బిందువుగా మారిందని ఎస్పీ రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన పలు రికార్డులు పరిశీలించారు. సిబ్బంది విధి విధానాలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు నెలలగా 12 ఎర్రచందనం కేసుల్లో 175 మందిని అరెస్ట్ చేశామన్నారు. 75 శాతం వరకు స్మగ్లింగ్ తగ్గుముఖం పట్టిందన్నారు. ఇంకా 25 శాతం వరకు రవాణా జరుగుతుందని, దానిని కూడా కట్టడి చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఎర్రచందనం కేసులలో కూలీలు దొరుకుతున్నారని, నిందితులు తప్పించుకుంటున్నారని, త్వరలో వారిని కూడా పట్టుకుంటామన్నారు. ప్రత్యేక బృందాలు ద్వారా జపాన్, చైనా దేశాలలో ఉన్న స్మగ్లర్లను కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. వెంకటగిరి రూరల్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లలో 120 మందిని అరెస్ట్ చేశామని, అందులో పలువురు రాజకీయ నాయకులు ఉన్నారన్నారు. త్వరలో జరిగే పోలేరమ్మ జాతరను పటిష్టంగా నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కొండపనాయుడు ఉన్నారు.

తెలుగు టెకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం

● ఆందోళనలో తల్లిదండ్రులు, బంధువులు

కావలి: చెన్నైలో ఈ నెల 13న అదృశ్యమైన కావలికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కంచర్ల సాయితేజ కోసం చెన్నై పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సాయితేజ తన మోటార్‌సైకిల్‌ను బీచ్ వద్ద పార్కింగ్ చేసి ఆ తరువాత అదృశ్యం కావడంతో ఆయన కోసం మిత్రు లు, తల్లిదండ్రులు చెన్నై పోలీసులు ఆరు రోజులుగా గాలిస్తున్నారు. చెన్నైకు చెందిన ఏసీబీ పాండ్యన్‌కు ఈ కేసును అప్పగించడంతో ఆయన తీర ప్రాంత పోలీసుస్టేషన్‌లలో అప్రమత్తం చేసి వివరాలు సేకరిస్తున్నారు. అతడి రూం నుంచి బీచ్ వరకు మార్గమధ్యంలో ఉన్న పలు సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం వరకు ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు.


విచారిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాసరావు

కోవూరు కార్యదర్శి అక్రమాలపై విచారణ

కోవూరు: ఇటీవల బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం ఒకరి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్ అక్రమాలపై శుక్రవారం డీఎల్‌పీవో శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. బిల్డింగ్‌ప్లాన్‌లు పొందిన వ్యక్తులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి సమాధానం రాబట్టారు. బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్ పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేసేవారనీ సమాచారం అందడంతో విచారణ చేపట్టారు. పలువురు వ్యక్తులు విచారణకు హాజరై తాము ఎదుర్కొన్న ఇబ్బందుల్ని వివరించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను విచారణలో సేకరించిన సమాచారాన్ని జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. కాగా పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్‌ను ప్రభుత్వ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు ఎంపీడీవో జాలిరెడ్డి తెలిపారు.

జగదేవిపేటలో పిడుగుపాటు

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట మండలం జగదేవిపేట గ్రామంలో పిడుగుపడి ఒక చెట్టు నిలువునా కాలిపోయింది. పరిసర ప్రాంతాల్లో 25 టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయినట్లు తహసీల్దారు కార్యాలయానికి ఫిర్యాదు అందింది. బుధవారం వేకువజామున జరిగిన సంఘటనను గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. దీంతో పంచాయతీ కార్యదర్శి జగదీష్ రెవెన్యూ కార్యదర్శి శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చుట్టు పక్కల నష్టపోయిన బాధితుల పేర్లు, వివరాలను సేకరించారు. ఈ ఘటనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు.

విశాఖ భూ కుంభకోణంలో
నెల్లూరు రైసుమిల్లర్లు?


సుబ్బయ్య ఇల్లు

● రూ.20 కోట్లకుపైగా పెట్టుబడులు

● నగరంలో సిట్, ఐటీ అధికారుల దాడులు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : విశాఖలో జరిగిన భూ కుంభకోణంలో నెల్లూరులోని రైసుమిల్లుల యజమానుల పాత్ర ఉన్నట్లు ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్), ఆదాయ పన్ను శాఖ (ఐటీ) ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని మిల్లర్ల ఇళ్లలో ఉదయం నుంచి సోదాలు నిర్వహించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరుకు చెందిన రైసుమిల్లుల యజమానులు భూముల కొనుగోళ్లలో రూ.20 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టి బినామీ లావాదేవీలు జరిపినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. నెల్లూరులోని శ్రీసత్యసాయి రైసు ఇండస్ట్రీస్ యజమాని ముప్పలశెట్టి వెంకటకృష్ణయ్య, ఎంవీఆర్ రా అండ్ బాయిల్డ్ రైసుమిల్లు యజమాని మునగా రామలింగయ్య, ఇతర రైసుమిల్లు యజమానులు వేమూరు సుబ్బారావు, వేమూరు రాజు, వేమూరు కిషోర్ తదితరులు విశాఖపట్టణంలో వివాదాస్పద భూములు కొనుగోళ్లు చేశారు. అన్నీ తెలిసే వీరు ఆ భూములు కొనుగోలు చేసి లాభాలకు విక్రయించారన్న అభియోగం నమోదైంది. ఈ భూముల అమ్మకాలు, కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) నియమించిన సంగతి తెలిసిందే. ఈ భూములు కొని మోసపోయిన బాధితులు వందల సంఖ్యలో సిట్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. దర్యాప్తు చేపట్టిన సిట్ అధికారులు ఎవరెవరు భూములు కొనుగోలు చేసి అమ్మారన్న దానిపై ఆరా తీయగా, నెల్లూరు రైసుమిల్లర్ల పేర్లు వెలుగులోకి వచ్చాయి. వారు పెట్టుబడులు, బినామీ లావాదేవీలు సాగించడం వెనుక పొల్యూషన్ సర్టిఫికెట్లు అందించే కన్సల్టెంట్ వేణుగోపాల్ సూత్రధారిగా గుర్తించారు. ఆయన ద్వారా రూ.20 కోట్ల వరకు ఆర్థిక లావాదేవీలు ఆ రైసుమిల్లుల యజమానులు సాగించినట్లు తేలడంతో శుక్రవారం ఉదయం విశాఖ నుంచి సిట్, ఐటీ అధికారులు నెల్లూరుకు విచ్చేసి దాడులు కొనసాగిస్తున్నారు. కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్న వేణుగోపాల్ చదివింది బీటెక్ అయినా ఉన్నత స్థాయిలో పరిచయం ఉండటం, పరిశ్రమలకు అవసరమైన పొల్యూషన్ సర్టిఫికెట్లు నిబంధనలు లేకపోయినా చిటికెలో అందిస్తారని సిట్ అధికారులు గుర్తించారు. దీనిపై కూడా సిట్ విచారిస్తుండగా ఇన్ని రూ.కోట్లు వీరికి ఎలా సమకూరాయన్న దానిపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఐటీ, సిట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తుండటంతో నెల్లూరులో కలకలం చోటు చేసుకుంది. సిట్ అధికారులు నెల్లూరుకు రావడం రైసుమిల్లర్లలో వణుకు మొదలైంది.


సుబ్బయ్య ఇంటిలో నుంచి వస్తున్న ఐటి అదికారుల జీపు

ఐటీ దాడులు

నోట్ల రద్దు తరువాత పాత నోట్ల మార్పిడి వంటి వాటిపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ ఆర్థిక లావాదేవీలపై ఎవరెవరు ఎన్ని రూ.కోట్లకు పాత కరెన్సీని మార్చుకున్నారు.. గతంలో ఆదాయ పన్ను చెల్లింపుదారులు ఎవరెవరు అన్న దానిపై ఆరా తీస్తూ గురువారం ఉదయం నెల్లూరులోని పలువురు ఇళ్లపై ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెంలోని వైసీపీ నేత బండి శ్రీకాంత్‌రెడ్డి ఇంటిపై ఐటీ దాడులు జరిగాయి. గతంలో ఆయన ఇసుక రీచ్‌ల్లో సిండికేట్‌గా వ్యవహరిస్తూ ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించలేదని అందుకే ఈ దాడులు జరిగాయి. మరో 12 మందికిపైగా వ్యాపారులు, రియల్టర్ల ఇళ్లపై కూడా ఐటీ అధికారులు దాడులు నిర్వహించి కొన్ని పత్రాలు స్వాధీన పరుచుకున్నారు. ఈ దాడుల వివరాలను అత్యంత గోప్యంగా ఐటీ అధికారులు ఉంచారు.

మా బిడ్డది హత్యే!

● రోడ్డుపై బైఠాయించిన గ్రామస్థులు

● స్తంభించిన ట్రాఫిక్ ● పోలీసుల లాఠీచార్జి

● చిట్టేడులో ఉద్రిక్తత.. ఎట్టకేలకు పోస్టుమార్టం

తమ బిడ్డను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతుడి తల్లిదండ్రులు ఆరోపించారు. గ్రామంలోనే పోస్టుమార్టం నిర్వహించితే వాస్తవాలు నిగ్గుతేలుతాయ ని పట్టుబట్టారు. దీంతో పోలీసులకు, ప్రజ లకు వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో గ్రామస్థులతో కలసి కుటుంబ సభ్యులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేయ డంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం స్థానిక నాయకులు, ప్రజలతో చర్చించిన పోలీసులు ఎట్టకేలకు నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డాక్టర్‌ను పిలిపించి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో పరిస్థితులు సద్దుమణిగాయి. పోలీసుల కథనం మేరకు వివరా లు ఇలా ఉన్నాయి.

\- కోట


వెంకయ్య (ఫైల్)

కోట మండలం చిట్టేడు దళితవాడకు చెందిన కారిచర్ల వెంకయ్య (19) అనే యువకుడు 20 రోజుల క్రితం గ్రామం నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆ యువకుడి కోసం గాలించిన కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఆ యువకుడు చిట్టేడు, వజ్జవారిపాళెం సమీపంలో ఓ చెట్టు కు ఉరి వేసుకుని చనిపోవడాన్ని స్థానికులు గుర్తించిన విషయం విదితమే. దీనిపై సమా చారం అందుకున్న పోలీసులు శుక్రవారం వెంకయ్య మృతదేహాన్ని చెట్టు నుంచి దించి పోస్టుమార్టం చేసేందుకు నెల్లూరుకు తరలిం చడానికి ప్రయత్నం చేశారు. దీంతో వెంకయ్య తండ్రి వెంకటయ్య తన బిడ్డ మృతిపై అనుమానాలు ఉన్నాయని, వారం రోజుల క్రితమే చంపి చెట్టుకు వేలాడదీశారని, నిందితుల ఆచూకీ తెలియాలంటే గ్రామంలోనే తన బిడ్డ మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించాలని పట్టుబట్టారు. అందుకు పోలీసులు అంగీకరించకపోవడంతో వాగ్వివాదానికి దిగాడు. ఈ క్రమంలో గ్రామస్థులు మూకుమ్మడిగా వచ్చి పోలీసులను అడ్డుకున్నారు. వెంకయ్యను హత్యచేసి ఉరి తీశారని, నెల్లూరుకు తీసుకువెళ్లి పోస్టుమార్టం చేస్తే సాక్ష్యాలు తారుమారు అవుతాయన్నారు. ప్రజల సమక్షంలో వెంకయ్య మృతదేహానికి పోస్టుమార్టం చేస్తే వాస్తవాలు తెలు స్తాయని పట్టుబట్టారు. అయినప్పటికీ వాకాడు సీఐ సత్యనారా యణ ఆధ్వర్యంలో చిల్లకూరు ఎస్ఐ అంకమ్మ, కోట పోలీసులు మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు యత్నించడంతో గ్రామస్థులు చిట్టేడు వద్ద ఆర్ అండ్‌బీ రహదారిపై బైఠా యించారు. వెంకయ్యను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఆందోళన కారులను వెళ్లగొట్టేందుకు పోలీసులు ప్రయత్నం చేయడం తో ఆగ్రహించిన ప్రజలు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. సుమారు 4 గంటల పాటు పోలీసులు, గ్రామస్థుల మధ్య వాగ్వివాదం జరగడంతో కోట, గూడూరు, నెల్లూరువైపు వెళ్లే బస్సులు, లారీలు, ద్విచక్ర వాహన రాకపో కలు ఎక్కడికక్కడ ఆగిపోయి ట్రాఫిక్ స్తంభించి ంది. ఈ సమాచారం అందుకున్న గూడూ రు అర్బన్, రూరల్ సీఐలు సుబ్బారావు, అక్కేశ్వరరావు, వాకాడు, ఓజిలి ఎస్ఐలు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నాలు చేశారు. కొందరు పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో ఒక యువకుడిని పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి లాఠీచార్జి చేశారు. అతనికి మద్దతుగా గ్రామస్థులు పోలీసులపై తిరుగుబాటు చేయడంతో ఒక్కసారిగా పోలీసు బలగాలు ఆందోళన కారులపై విరుచుకుపడి లాఠీచార్జి చేశారు. ఈ నేపథ్యం లో వెంకయ్య తల్లి, అవ్వ రోడ్డుపై పడుకుని తమను చంపి మృత దేహాన్ని తీసుకెళ్లాలని భీష్మించుకున్నారు. అతికష్టంపై వీరిని పోలీసులు బయటకు లాగి, ఆందోళన కారులను చెదరగొట్టి వాహన రాకపోకలను పునరద్ధరించారు. అయినప్పటికీ మృతదేహానికి గ్రామం లోనే పోస్టుమార్టం చాయా లని గ్రామస్థులు పట్టుబట్టడంతో మండలా నికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు వీ రాజాచౌదరి ఆందోళనకారులు, పోలీసులతో చర్చలు జరిపారు. ఎట్టకేలకు దిగివచ్చిన పోలీసులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామంలో పోస్టుమార్టం నిర్వహిం చేందుకు అనుమతి తీసుకున్నారు. నెల్లూరు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులతో చర్చించి డాక్టర్ శశికాంత్‌ను చిట్టేడుకు రప్పించి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెంకయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగిం చారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు సర్దుమణిగాయి.


రోడ్డుపై పడుకున్న వెంకయ్య తల్లి




పోలీసులతో గ్రామస్థుల వాగ్వివాదం

దొరికిపోయిన నకిలీ పోలీసు!



పోలీసుల అదుపులో నకిలీ పోలీసు

కలువాయి: దర్జాగా పోలీసు యూనిఫారం ధరించాడు.. దారిన పోయే వాహనాలను ఆపి తనిఖీలు చేస్తూ నగదు వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ పోలీసు శుక్రవారం కలువాయి పోలీసులకు దొరికిపో యాడు. ఎస్‌ఐ ఆవుల సైదులు తమ సిబ్బందితో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కేసు విచారణకు రాజుపాళెం వద్దకు వెళ్లారు. ఆ సమయంలో పొదలకూరు-సోమశిల రహదారిపై వెళ్తుతున్న వాహనాలు ఆపి పోలీసు యూనిఫాంలో తనిఖీ చేస్తున్న వ్యక్తిని చూసి నకిలీ పోలీసుగా గుర్తించి అతనిని అదుపులోని తీసుకొన్నారు. పోలీసు విచారణలో అతను కడప జిల్లా బద్వేలికి చెందిన బొమ్మన రామాంజనేయులుగా తేలింది. తాను ఆటో డ్రైవరునని అతను పోలీసులకు చెప్పాడు. పోలీసు వేషంలో అతను అక్కడక్కడ వాహనాలు తనిఖీలు చేసి నగదు వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. అతన్ని మరింత లోతుగా విచారించేందుకు పోలీసులు పొదలకూరు సీఐ కార్యాలయానికి తరలించారు.

విషపురుగు కుట్టి చిన్నారి మృతి

కలువాయి: పర్లకొండకు చెందిన మంద పూజిత (4) శుక్రవారం విషపురుగు కుట్టి మృతి చెందింది. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మంద వెంకటరమణయ్య, భూలక్ష్మమ్మ దంపతులకు నలుగురు ఆడపిల్లలు. వారిలో మూడవ అమ్మాయి పూజిత. అమ్మమ్మ ఊరైన చేజర్ల మండలం పాడేరుకు పూజిత వెళ్లింది. అక్కడ అటలు ఆడుకుంటుండగా విషపురుగు కుట్టింది. వెంటనే చికిత్స కోసం దగ్గరలోని నాటు వైద్యుడి దగ్గరకు తీసుకుపోయే లోపు చిన్నారి మృతి చెందింది. చిన్నారి పాము కట్టుకు గురై ఉండవచ్చునని నాటు వైద్యుడు చెప్పినట్లు సమాచారం. చిన్నారి పూజత మృతదేహాన్ని పర్లకొండకు తీసుకువచ్చారు. తల్లిదండ్రులు చిన్నారి మృతిని చూసి గుండెలు బాదుకుంటున్నారు.

చిట్టమూరు ఎంపీపీకి అస్వస్థత

చిట్టమూరు : చిట్టమూరు మండల పరిషత్ అధ్యక్షుడు ఉక్కు జనార్ధన్ తీవ్ర అస్వస్థతకు గుర య్యారు. కాకినాడలో జరిగిన ఓ వివాహానికి హాజరైన ఎంపీ పీ శుక్రవారం ఉదయం చిట్ట మూరు చేరుకున్నారు. ఉదయం కారుదిగుతు న్న సమయంలో అస్వస్థ తకు గుర య్యారు. హైబీపీ కారణంగా స్పృహ తప్పడంతో టీడీపీ నేతలు కన్వీనర్ కిషోర్‌నాయుడు, గోపాల్‌రెడ్డి సింహ పురి ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. విషయం తెలుసుకున్న గూడూరు ఎమ్మెల్యే వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

'వీఆర్' ఆస్తులు స్వాధీనం చేసుకోండి

- **కలెక్టరేట్‌ను ముట్టడించిన ఏబీవీపీ**
- **పోలీసుల లాఠీచార్జి, అరెస్ట్**

నెల్లూరు (కలెక్టరేట్) : ఆనం సోదరుల నుంచి వీఆర్ విద్యా సంస్థల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆనం సోదరుల నుంచి వీఆర్ విద్యా సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించి పోస్టులు భర్తీ చేయాలని, వీఎస్ యూకి యూజీసీ 12బీ గుర్తింపు ఇచ్చి రెగ్యులర్ కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు. కావలి జవహర్ భారతి విద్యా సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంటును వెంటనే విడుదల చేయాలన్నారు. రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేత మానుకోవాలని, విద్యాహక్కు చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. కలెక్టర్ లోకి చొచ్చుకుపోయేందుకు యత్నించిన ఆందోళనకారులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ క్రమంలో ఏబీవీపీ జిల్లా నాయకుడు కౌశిక్ తలకు గాయమైంది. అనంతరం నాయకులను అరెస్ట్ చేసి ఒకటో నగర పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా సంఘటన కార్యదర్శి రాజేష్, విభాగ్ నాయకుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏబీవీపీ శ్రేణులు,



పోలీసులతో నిరసనకారుల వాగ్వాదం

త్వరలో ఖాళీ పోస్టుల భర్తీ

- **ఎస్ఈ విజయ్‌కుమార్‌రెడ్డి**

కోట: విద్యుత్ శాఖలో జిల్లా వ్యాస్తంగా ఉన్న ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని ఆ శాఖ ఎస్ఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని చెందోడు, సిద్ధవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు సంబంధించిన పలు సమస్యలను అడిగి తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ట్రాన్స్‌కో ఏఈలు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిలాల్లో లైన్ మెన్ పోస్టులు 350, జూనియర్ లైన్‌మెన్ పోస్టులు 50, 15 ఏఈ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ఆయా ఖాళీలను భర్తీ చేసేందుకు త్వరలో అధికారిక ఉత్తర్వులు రానున్నాయన్నారు. జిల్లాలోని అన్ని సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని చర్యలు చేపట్టాన్నారు. రైతులకు నిరాటంకంగా ఏడుగంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. పలు మండలాల్లో ఆక్వా బకాయిలు, ప్రభుత్వ కార్యాలయాల బిల్లుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. వినియోగదారుడు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారి వద్దకే విద్యుత్ సేవలు అందించే విధంగా ముందుకు వెళతున్నామని తెలిపారు. ఆయన వెంట డీఈ అనిల్‌కుమార్, ఏడీ కృష్ణారెడ్డి, ఏఈలు వరప్రసాద్‌రెడ్డి, మాధవరెడ్డి, పలువురు సబ్‌ఇంజనీర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఈ విజయ్‌కుమార్‌రెడ్డి

నంద్యాల పోరులో నెల్లూరు నేతలు

- **నెల రోజులుగా అక్కడే మకాం**
- **చివరి మూడు రోజులే కీలకం**



నంద్యాలలో ముస్లింలను పార్టీలోకి స్వాగతిస్తున్న మంత్రి సోమిరెడ్డి

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నంద్యాల ఉప ఎన్నికలలో జిల్లా నేతలే కీలకంగా మారుతున్నారు. తెలుగుదేం, వైసీపీలకు చెందిన నాయకులు నెలరోజులుగా అక్కడే మకాం వేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. నంద్యాల ఉప ఎన్నికల షెడ్యూల్ ప్రకటించక ముందే మంత్రి నారాయణ నంద్యాలలో మకాం వేసి నంద్యాల పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నంద్యాలలో రోడ్ల విస్తరణతో సుందరీకరణ, అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభం, గృహ నిర్మాణం వంటి ఎన్నో కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సాంకేతిక సహకారంతో సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. టెలీ కాలర్ ద్వారా నేరుగా ఓటర్లతో ఫోన్‌లో నేతలను మాట్లాడించి తమ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇక ఫేస్‌బుక్, ఎస్ఎంఎస్ సందేశాలు తదితరాలను ప్రణాళిక ప్రకారం నడిపిస్తున్నారు. అటు వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా నెల రోజులుగా నంద్యాలలోనే మకాం వేశారు. సొంత శాఖ పనులు కూడా అధికారులకు అప్పచెప్పి ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. మొదట క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఏమిటన్నది అంచనా వేసి రాజకీయ సమీకరణలపై దృష్టి పెట్టారు. ఇతర పార్టీల్లో ఉన్న నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తూ సామాజిక, రాజకీయంగా సమావేశా లు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా వైసీపీ నేతలు చేసే ఆరోపణలపై టీడీపీ ప్రతినిధిగా కౌంటర్ ఎటాక్‌లు ఇస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ పది రోజులుగా నంద్యాల ప్రచారంలో చేస్తున్న ఆరోపణలకు సోమిరెడ్డి ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తున్నారు. ఇక పార్టీ ప్రచారాలు ఎలా సాగాలన్నది కూడా సోమిరెడ్డి వ్యూహరచనతోనే సాగుతున్నాయి. ఇన్‌చార్జి మంత్రి ఎన్. అమరనాథ్‌రెడ్డి క్షేత్ర స్థాయి పార్టీ శ్రేణులను సమాయత్తం చేసి వారిలో ఉత్తేజం తీసుకువస్తూ ఇంటింటా ప్రచారం సాగిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర కూడా ఈ ప్రచారంలో భాగస్వామ్యులయ్యారు.

● వైసీపీ నేతలూ అక్కడే!

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేలు ఆరుగురు నంద్యాలలోనే ఉంటున్నారు. జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి గౌతంరెడ్డి, కిలివేటి సంజీవయ్యలతోపాటు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు, ముఖ్య నేతలంతా నంద్యాలలోనే బస చేస్తున్నారు. వీరికి వార్డుల వారిగా బాధ్యతలు అప్పగించి ప్రచార బాధ్యత లు అప్పగించడంతో ఆ వార్డులో ఓటర్లను కలిసి వైసీపీ అభ్యర్థి గెలుపుకు సహకరించాలని అభ్యర్థిస్తు న్నారు. జగన్ ప్రచార పర్యట నను విజయవంతం చేసేం దుకు జిల్లా వైసీపీ నేతలు ఎంతో సహకరిస్తు న్నారు. నెల రోజులుగా జిల్లాను వీడి నంద్యాలలోనే మకాం వేశారు. ఈ నెల 21 సాయంత్రం ఐదు గంటలకు ప్రచారాలు సమాప్త మవుతాయి. ఆలోగా బయటి నేతలంతా సొంత జిల్లాలకు పయనమమవ్వాలి. దీంతో కీలకంగా మిగిలిన ఈ మూడు రోజుల్లోనే ఓటర్లను ప్రలోభ పెట్టే కార్యక్రమాలన్నీ మొదలు పెట్టి ప్రచారాలు పూర్తి చేయాల్సి ఉంది. ఫలితంగా చివరి దశలో జిల్లా నేతలంతా మరింత బిజీగా మారిపో యారు.



నంద్యాలలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి, కాకాణి

● ఫలితంపై ఉత్కంఠ

నంద్యాలలో అన్నీ తామై వ్యవహరిస్తున్న ఇరు పార్టీల నేతల్లోనూ గెలుపుపై ఉత్కంఠ నెలకొంది. ఎందుకంటే ఫలితం ఆశాజనకంగా లేకపోతే ఆ నేతలకు అధిష్ఠానంలో పరపతి తగ్గే పరిస్థితులు ఉన్నాయి. బాధ్యతలు అప్పగించిన నేతల పనితీరు కూడా ఆయా పార్టీల అధిష్ఠానాలు అంచనా వేస్తూ ఎన్నికల్లో వచ్చే ఓట్ల మెజారిటీ కూడా పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది.


వృద్ధురాలిపై దాడి చేస్తున్న పందులు

రాకాసి పందులు

● వృద్ధురాలిపై వరాహాల దాడి

● తీవ్రగాయాలు.. ఆసుపత్రికి తరలింపు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీబిజాన్

కావలి (క్రైం) : పట్టణంలో పందుల బెడద ఎక్కువైంది. వీధుల్లో స్వైరవిహారం చేస్తూ ఏకంగా మనుషులపైనే దాడులకు దిగుతున్నాయి. శుక్రవారం కళుగోళమ్మపేటలో ఓ మహిళపై రెండు పందులు దాడి చేశాయి. షేక్ బీబీ జాన్ అనే వృద్ధురాలు ఇళ్లలో పాచిపనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. శుక్రవారం ఉదయం పనులు ముగించుకొని ఇంటికి వెళుతున్న బీబిజాన్‌పై రెండు పందులు దాడిచేశాయి. క్షణాల్లో కింద పడేసి, తమకున్న కోరపళ్లతో అందిన చోటల్లా కరిచి తీవ్రంగా గాయపరిచాయి. అటుగా వెళతున్న వారు గుంపుగా ఏర్పడి రాళ్లతో, కర్రలతో తరుమితే వృద్ధురాలిని వదిలి పక్కకు వెళ్లాయి. అంతకుముందే అదే ప్రాంతానికి చెందిన రాజానరేష్ అనే యువకుడిని పందులు వెంటబడి, పిక్కపై కరచి గాయపరచాయి. యువకుడు కావడంతో పరిగెత్తి వాటి బారి నుంచి తప్పించుకున్నాడు. దానికి ఒకరోజు ముందు వాయునందనప్రెస్ వీధిలో పవన్‌కుమార్ అనే ఉపాధ్యాయుడిపై కూడా పందులు తరిమి గాయపరచాయి. ఇలా కావలి ఏరియా ఆసుపత్రికి సగటున వారానికి నలుగురు పంది కరచిందని వైద్యం కోసం వస్తున్నారంటే పట్టణంలో పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రజలకు రక్షణ కల్పించాలి

పట్టణంలో పందుల దాడులు ఎక్కువయ్యాయి. పాదచారులపై వరుస దాడులు జరగుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్లలోకి రావాలంటేనే భయపడిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు పందులను పట్టణానికి దూరంగా తరలించి, వాటిబారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి.

- జేబీ.మస్తానయ్య నాయుడు

● ఎటు చూసినా పందులే..

కావలిలో ఎటు చూసినా పందులే కనిపిస్తున్నాయి. నివాస ప్రాంతాలకు దూరంగా పందులను పెంచుకోవాలన్న నిబంధనలు ఉన్నా పెంపకందారులు పట్టించుకోవడంలేదు. వాటిని పట్టనానికి దూరంగా తరలించాలన్న మున్సిపల్ అధికారుల ప్రయత్నాలను పందుల పెంపకందారులు తిప్పికొడుతున్నారు. తమ జీవనోపాధిని నాశనం చేస్తున్నారంటూ అధికారులపై కోర్టులకెక్కారు. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌పై పందుల పెంపకం దారులు 4 కేసులు పెట్టారు. పాలకులు కూడా పందుల పెంపకందారులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించి, ఆ తర్వాత పందుల తరలింపు చర్యలు చేపడితే బాగుంటుందన్న వాదన కూడా వినబడుతోంది.

పందుల నివారణకు చర్యలు

కావలిలో పందుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. పెంపకందారులకు నోటీసులు ఇచ్చి పందులను పట్టణానికి దూరంగా తీసుకు వెళ్లాల్సిందిగా సూచించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పందుల పెంపకం కోసం పట్టణానికి దూరంగా ప్రత్యేక స్థలాన్ని త్వరలో కేటాయించనున్నాం. ఆ తరువాత పందులను తరలిస్తాం.

- ఎ.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్


కావలిలో పందుల సమూహం



గూడూరులో ప్రజల మధ్యే..

పందులున్నాయ్.. పారాహుషార్!

● పక్కకెళ్తే పిక్కలు పీకేస్తాయ్!

● కాగితాల్లోనే జనావాసాలకు దూరంగా..

● పెంపకందారులకు ప్రత్యామ్నాయ ఉపాధి ఏదీ!?

● చొరవ చూపని పాలకులు, అధికారులు

నెల్లూరు నగరంలో పందుల బెడద అధికంగా ఉంది. పందులతో ప్రజలు రోగాల బారినపడుతున్నా... ప్రజలపై దాడులు జరుగుతున్నా.. పాలకులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నగరంలో వేల సంఖ్యలో పందులు ఉండగా, 200లకుపైగా కుటుంబాలు పందులపై జీవనం సాగిస్తున్నాయి. వెంకటేశ్వరపురం, ఇస్లాంపేట, వెంగళ్రావునగర్, టైలర్స్‌కాలనీ, కొత్తూరు, అంబాపురం, సుందరయ్యకాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, బీవీనగర్, పొర్లుకట్ట తదితర ప్రాంతాలలో పందులు ఎక్కువగా ఉంటున్నాయి. ప్రత్యేక స్థలాల్లో పందులను పెంచుకోవాల్సి ఉండగా వాటిని వీధుల్లో ఇళ్ల మధ్య వదిలి వేస్తున్నారు. దీంతో చెత్త కుప్పలు, మురుగు కాలువల్లో తిరుగుతూ ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. పందులను కుట్టిన దోమలు ప్రజలను కుడుతుండటంతో స్వైన్‌ఫ్లూ, మెదడువాపు, డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు ప్రబలుతున్నాయి.

- నెల్లూరు (సిటీ)/ఆంధ్రజ్యోతి బృందం

● ప్రజలపైనా దాడి

వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న పందులు ప్రజలపైనా దాడులకు దిగుతున్నాయి జనార్ధన్‌రెడ్డి కాలనీ, ఇస్లాంపేట, ప్రాంతాలలో ఇటీవల పలువురు చిన్నారులపై దాడులు చేశాయి. ఏడాది క్రితం ఇస్లాంపేటలో ముగ్గురు చిన్నారులను గాయపరిచాయి. రెండేళ్ల బాలుడిని నోటికి కరిపించుకుని ఈడ్చుకుంటూ వెళ్లడంతో స్థానికులు రక్షించారు. బాలాజీనగర్ ప్రాంతంలో ఓ మహిళపైన పందులు దాడి చేసి గాయపరిచింది.

● పాలకులు, అధికారుల వైఫల్యం

ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమేగాక దాడులతో ప్రజలను గాయపరుస్తున్న పందులను నగరం బయటకు తరలించడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారు. గతంలో కమిషనరు చక్రధర్‌బాబు పందుల తరలింపునకు శ్రీకారం చుట్టారు. పందుల యజమానులతోనూ మేయర్ అబ్దుల్ అజీజ్ సమావేశం నిర్వహించి 20 రోజుల్లో పందులన్నింటినీ నగరం బయటకు తరలించాలని, వాటి పెంపకానికి దొంతాలి ప్రాంతంలో మూడెకరాల స్థలం కేటాయించి నీటి వసతి కల్పిస్తామని చెప్పారు. అయినా యజమానులు నిరాకరించారు. దీంతో గత హెల్త్ అధికారి వెంకటరమణ పందులను ఇతర జిల్లాలకు తరలించే చర్యలు చేపట్టారు. వాహనాల్లో పందులను తరలించే ప్రయత్నం చేయగా యజమానులు అడ్డుకొని దాడులకు దిగారు. దీంతో పోలీసు రక్షణతో కొన్ని పందులను తరలించారు. మరో వాహనంలో పందులను తరలిస్తుండగా వెంకటాచలం టోల్‌గేట్ వద్ద యజమానులు దాడులు చేసి పందులను విడిపించుకొచ్చారు. దీనిపై కేసు నమోదయింది. అనంతరం పందుల తరలింపునకు పాలకులు, అధికారులు పుల్‌స్టాప్ పెట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల యజమానులను నష్ట పెట్టకుండా వాటిని నగరం బయటకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.


నాయుడుపేటలో వరాహాల సమూహాల సంచారం

● ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి దూరి గందరగోళం సృష్టిస్తున్నాయి. పందుల సంచారాన్ని అరికట్టేందుకు అధికారులు పక్కాప్రణాళికతో చర్యలు చేపడుతున్నా ఫలితం ఉండటంలేదు. పెంపకందారులకు హెచ్చరికలు జారీ చేసినప్పుడు మాత్రం పందులను దూరప్రాంతాలకు తీసుకెళుతున్నారు. ఆ తర్వాత రాత్రి వేళ వీధుల్లో వదులుతున్నారు. ఇటీవల బంగ్లా సెంటర్‌లో పందులను వాహనాల్లో తీసుకొచ్చి వదిలి వెళ్ళడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పందుల పెంపకంపై స్థానిల ఫిర్యాదులు పెరుగుతున్నాయని అన్నారు. దీంతో ఇటీవల పందుల పెంపకందారులతో సమావేశమై హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. పందులసంచారం అరికట్టే దిశగా కఠిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

● గూడూరు పట్టణంలో పందుల బెడద అధికంగా ఉంది. నివాసాల మధ్య పందులు సంచరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఐసీఎస్ రోడ్డు, రాణిపేట, శాంతినగర్, దూడల కాలువ ప్రాంతం, ఆర్టీసీ బస్టాండు, రైతు బజారు సెంటర్, వెంకటేశ్వరస్వామి కోనేరు ప్రాంతం తదితర ప్రాంతాలతోపాటు పట్టణంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలకు ఇబ్బందిగా మారిన పందుల సమస్యను పరిష్కరించడంలో అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయి. పెంపకందారులకు నోటీసులు అందించి చేతులు దులుపుకుంటున్నారేగాని ఆచరణలో చేతులు ఎత్తేస్తున్నారు.

● వెంకటగిరిలో ఇళ్ల మధ్యే పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో పందుల బెడదను తప్పించేందుకు చర్యలు తీసుకోవాలని చేసిన తీర్మానాలు కార్యరూపం దాల్చడం లేదు. దీంతో అధిక సంఖ్యలో సంచరిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలగజేయడంతోపాటు చిన్నారులు, వృద్ధులపై దాడులకు దిగుతున్నాయి.


నెల్లూరు నగరంలో తిరుగుతున్న పందులు

● నాయుడుపేటలో వరాహాల సమూహాలు సంచరిస్తూ ప్రజల రాకపోకలకు ప్రతి బంధకాలుగా ఉన్నాయి. పట్టణంలో దాదాపు 55వేల జనాభా ఉంటే పందులు 3వేలకుపైగా ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పారిశుధ్యంతోపాటు పందుల బీభత్సంతో మరెన్ని అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. గతంలో నగరపంచాయతీ పందుల నివారణపై చర్యలు తీసుకున్నా మళ్లీ మొదటకొచ్చింది.

● సూళ్లూరుపేట మున్సిపాలిటీలో పందుల నివారణ జరగడం లేదు. మున్సిపాలిటీ పరిధిలో 50వేల జనాభా ఉండగా 5వేలు పందులు ఉండటం విశేషం. గతంలో పందులు పెరిగిపోవడంతో, ఓ పక్క పత్రికల్లో ఆరోపణలు రావడంతోపాటు మరో పక్క పందులు సంచారం వీడియోలను సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌కు స్థానికులు పంపడం జరిగింది. దీంతో గత కమిషనర్ రెండు రోజులపాటు పందులను పట్టించారు. కేవలం ఓ 100 పందులు పట్టించి మిగిలినవి వదిలేశారు. బాపూజీకాలనీ, మన్నారుపోలూరు, గవండ్లవీధి, వనంతోపు, సాయినగర్ ప్రాంతాలలో పందులు అధికంగా సంచరిస్తుండటం షరామాములే.

రిజర్వాయర్‌కు చేరుకున్న సోమశిల జలాలు

● అన్నదాతల ఆనందం




ఈస్ట్రన్ ఛానల్‌కు సరఫరా అవుతున్న సోమశిల జలాలు

బుచ్చిరెడ్డిపాళెం: అన్నదాత ఆక్రందనను అధికారులు అర్థం చేసుకున్నారు.. ఎండుతున్న పొలాలకు నీరందించారు. దీంతో రైతుల్లో హర్షాతిరేకలు పెల్లుబికాయి. పంట చేతికొచ్చే దశలో సాగు నీరు లేక నిలువునా ఎండిపోతున్నాయని అన్నదాతల విన్నపాలను కలెక్టర్ ముత్యాలరాజు సానుకూలంగా స్పందించారు. మేఘాలు ఊరిస్తున్నాయే కానీ వర్షం కురవకపోవడంతో సోమశిల జలాలే దిక్కని రిజర్వాయర్ కింద సాగు చేసిన రైతులు తమ గోడును ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పెన్నా డెల్టా చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వీరు మానవతా దృక్పధంతో ఆలోచించి సోమశిల జలాలు అందించి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై గత వారం రోజులుగా చర్చలు ముమ్మరంగా సాగాయి. నీటిపారుదలశాఖ అధికారులు వెయ్యి క్యూసెక్కుల లెక్కన సోమశిల నుంచి కనిగిరి రిజర్వాయర్‌కు వారం రోజులపాటు నీటిని తరలించాలని ఉన్నతాధికారులకు సూచించినట్లు తెలిసింది. అంత నీటిని తరలించడం కష్టమని 300 క్యూసెక్కుల నీటిని రిజర్వాయర్‌కు తరలించేందుకు అధికారులు పచ్చ జెండా ఊపారు. 14వ తేదీన సోమశిల జలాశయం నుంచి కనిగిరి రిజర్వాయర్ మెయిన్ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలో 17వ తేదీ నాటికి సోమశిల జలాలు రిజర్వాయర్‌కు చేరాయి. సాయంత్రానికి పొలాలకు సాగునీరు సరఫరా చేసే ఈస్ట్రన్ చానల్‌లో నీటి ప్రవాహం కనిపించింది. దీంతో వరిపైర్లు సాగు చేసి నష్టపోతామనుకున్న రైతుల్లో ఆనందం నెలకొన్నది.



ఈస్ట్రన్ చానల్ ద్వారా దిగువకు సాగుతున్న సోమశిల జలాలు



నీటి సరఫరాతో కళకళలాడుతున్న వరిపైరు

● సీపీ హేచరీ ఎదుట కార్మికుల ధర్నా

ఉద్యోగ భద్రత కల్పించాలి



సీపీ హేచరీ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

వాకాడు: తూపిలిపాళెంలో ఏర్పాటు చేసిన సీపీ హేచరీలో పని చేస్తున్న 120 మంది కార్మికులకు యాజమాన్యం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ హేచరీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ధర్నా చేశారు. కంపెనీ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంటనే కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ధర్నా ఉధృతం అయ్యే పరిస్థితులు నెలకొనడంతో కోట, వాకాడు, చిట్టమూరు, గూడూరు ప్రాంతాల నుంచి పోలీసులు భారీగా అక్కడకు చేరుకున్నారు. పరిస్థితి తెలుసుకున్న హేచరీ కాంట్రాక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి కూడా అక్కడికి చేరుకుని కార్మికులతో చర్చించారు. కార్మికుల డిమాండ్లను విన్న తరువాత హేచరీ మేనేజర్ మహేష్‌తో మాట్లాడి పనులు చేయించేందుకు ఎవరు కాంట్రాక్ట్ కుదుర్చుకున్నా, ఈ 120 మంది కార్మికులను కంపెనీ కార్మికులుగా గుర్తిస్తామని, ప్రభుత్వ నిబంధనల మేరకు కార్మిక చట్టంలో ఉన్న అన్ని రాయితీలను వర్తించేలా చర్యలు చేపడుతామని భరోసా ఇచ్చారు. దీంతో కార్మికులు సామరస్యంగా నిరసన కార్యక్రమాన్ని విరమించుకోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రరాజగోపాల్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహనరావు, గూడూరు డివిజన్ కార్యదర్శి యాదగిరి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

వరాలతల్లికి వరలక్ష్మీవ్రతం

● చెంగాళమ్మ ఆలయంలో పోటెత్తిన భక్త జనం

సూళ్లూరుపేటలో చెంగాళమ్మ అమ్మవారు



సూళ్లూరుపేట : నమస్తే లోకజనని నమస్తే విష్ణువల్లభే.. పాహిమాం భక్తవరదే వరలక్ష్మ్యై నమః.. శ్రీ వరలక్ష్మి దేవతాయై నమః నమస్కారాన్ సమర్పయామి.... అంటూ వరాలతల్లి చెంగాళమ్మకు భక్తజనం వేడుకున్నారు. శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా చెంగాళమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతం పెద్దఎత్తున నిర్వహించారు. ఆలయ ఆవరణంలోని ఓపెన్ కల్యాణ మండపంలో వేదికపై ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మణ్ణి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. మహిళలు బారులుతీరి కూర్చొని వ్రతం నోచుకున్నారు. ఆలయ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకవర్గ సభ్యులు ఆకుతోట రమేష్, పెరుమాల్, శ్రీనివాసులురెడ్డి, వేనాటి గోపాల్‌రెడ్డి, ఎం. విజయలక్ష్మి, పిట్ల సుహాసిని, అలవల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు. పెంచలకోన ఆలయ చైర్మన్ నానాజీ, నాయుడుపేట నేతలు కలికి మాధవరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి విచ్చేసి అమ్మణ్ణిని దర్శించుకున్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో..

బియ్యపు గింజలపై వరలక్ష్మి నామం

ఈ వరలక్ష్మి వ్రతంలో వినియోగించేందుకు సూళ్లూరుపేటకు చెందిన సూక్ష్మ కళాకారిణి చలువాది మల్లివిష్ణు వందన 519 బియ్యపు గింజలపై వరలక్ష్మి నామాన్ని లిఖించి అమ్మణ్ణికి సమర్పించింది. వాటిని వేద పండితులు అక్షింతలుగా వినియోగింపచేశారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : మండలంలోని జొన్నవాడ ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.



సూళ్లూరుపేట: వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

మహిళల రక్షణ ముఖ్యం

● రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్

నెల్లూరు (కలెక్టరేట్) : ఆటోల్లో ప్రయాణించే మహిళల రక్షణ కోసం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముత్యాలరాజు ఆదేశించారు. కలెక్టర్ బంగ్లాలో శుక్రవారం రహదారి భద్రత సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పోలీసు, రవాణా, ఆర్టీసీ శాఖల సంయుక్త కార్యక్రమాల వల్ల జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాలు గణనీయంగా తగ్గాయని చెప్పారు. ప్రమాదకర జంక్షన్లలో ట్రాఫిక్ సమయంలో వీడియో తీయించాలన్నారు. జాతీయ రహదారి జంక్షన్‌లలో స్పీడు బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయించాలన్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్లలో ప్రమాదకరమైన మలుపులు గుర్తించి జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. ఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు తెలియజేశామని, వాటిని పాటించడానికి వారం రోజులు గడువు ఇచ్చామని చెప్పారు. ఆ గడువు పూర్తయినందున శనివారం నుంచి నిబంధనలు పాటించని ఆటోలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైవేని ఐదు జోన్లుగా విభజించి, జోన్ల వారీగా బృందాలు ఏర్పాటు చేసి 24 గంటలూ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డీటీసీ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ తడ నుంచి కావలి వరకు ఉన్న 180 కి.మీ. జాతీయ రహదారిపై 37 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే అథారిటీ మేనేజర్ విద్యవాణి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ విజయకుమార్, ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ కంట్రోలర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అరవింద్‌కు ఫొటోలోని వ్యక్తి ఏమవుతారు?

మెంటల్ ఎబిలిటి

(1 - 5): ఒక కోడ్ భాషలో NATIONALను 86523867 గాను, VOLUME ను 937401 గాను రాశారు. ఈ కోడ్ భాష ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

1. 'LIMIT' కు సరైన కోడ్?
ఎ) 27052 బి) 72025 సి) 52702 డి) ఏదీకాదు

2. 'ATTENTION' కు సరైన కోడ్?
ఎ) 655185238 బి) 618555832
సి) 688532551 డి) ఏదీకాదు

3. 'LOVE' కు సరైన కోడ్?
ఎ) 1379 బి) 3179 సి) 7391 డి) ఏదీకాదు

4. 'UNIT' కు సరైన కోడ్?
ఎ) 4825 బి) 2458 సి) 8542 డి) ఏదీకాదు

5. MOVE కు సరైన కోడ్?
ఎ) 0391 బి) 3190 సి) 1903 డి) ఏదీకాదు

6. 4, 22, 108, 430, 1288, -----------
ఎ) 2579 బి) 2574 సి) 2457 డి) 2547


7. 8, 3, 2, 3, 10, --------
ఎ) 56 బి) 64 సి) 49 డి) 96

8. 10, 9, 20, 57, 232, ---------
ఎ) 1155 బి) 1165 సి) 1175 డి) 1150

9. 85, 40, 69, 54, 72, 14, 56, ---------
ఎ) 40 బి) 48 సి) 86 డి) 30

10. 13, 18, 31, 49, 80, -------
ఎ) 192 బి) 129 సి) 921 డి) 219

11. కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?



ఎ) 12 బి) 13 సి) 15 డి) 10

12. a - c - cb - ab - cab - ba - ca -
ఎ) bacacbc బి) aabbccc
సి) caabbcc డి) ఏదీకాదు

13. a - c - bc - acda - da - ca - cd
ఎ) dbbdbb బి) bddbbb
సి) bbdbbd డి) ఏదీకాదు

14. UZ, OR, IL, EH, -------
ఎ) AF బి) FA సి) EB డి) BE

15. AAZ, BDX, DIT, HPN, -----------
ఎ) PFY బి) YPF సి) PYF డి) FYP

16. క్యాలెండర్: తేదీలు :: నిఘంటువు: --------
ఎ) అర్థాలు బి) పదాలు సి) వాక్యాలు డి) ఏదీకాదు

17. రెస్టారెంట్ : మెను :: లైబ్రరి : ---------
ఎ) పుస్తకాలు బి) చదువు సి) కేటలాగ్ డి) ఏదీకాదు

(18 - 20) - భిన్నమైనదాన్ని తెలపండి

18. ఎ) తేయాకు బి) పొగాకు సి) చెరకు డి) జొన్న

19. ఎ) 196 బి) 144 సి) 64 డి) 36

20. ఎ) KBPY బి) NRMJ సి) JDQW డి) HTSG

21. ఫొటోలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అరవింద్ ఇలా అంటున్నాడు. 'అతను నా తండ్రి తల్లికి ఏకైక కూతురి భర్త భార్యకు ఏకైక సోదరుడి భార్య భర్త' అయితే అరవింద్‌కు ఫొటోలోని వ్యక్తి ఏమవుతారు?
ఎ) సోదరుడు బి) మేనమామ
సి) తండ్రి డి) కుమారుడు

22. పార్కుకి వెళుతున్న వ్యక్తిని చూపిస్తూ అమృత్ ఇలా అంటున్నాడు. 'అతను నా తల్లి తండ్రికి ఏకైక అల్లుడి భార్య సోదరుని తల్లికి భర్త' అయితే పార్కుకి వెళుతున్న వ్యక్తికి అమృత్ ఏమవుతాడు?
ఎ) మనవడు బి) మేనల్లుడు
సి) కుమారుడు డి) అల్లుడు

(23 - 25): A, B లు సోదరులు. A, C లు వివాహిత జంట. B తల్లి M. C కుమారుడు K. A,



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

B ల సోదరి Q. Z భార్య Q. పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

23. A కి Z ఏమవుతారు?
ఎ) సోదరుడు బి) కుమారుడు
సి) బావ డి) మేనమామ

24. Q కి K ఏమవుతారు?
ఎ) కుమారుడు బి) అల్లుడు
సి) సోదరుడు డి) మేనల్లుడు

25. M కి C ఏమవుతారు?
ఎ) కుమార్తె బి) కోడలు సి) మేనకోడలు డి) వదిన

26. సూర్యోదయం తరవాత వివేక్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలబడ్డాడు. స్తంభం నీడ వివేక్‌కు ఎడమవైపున ఉంది. అయితే వివేక్ ఏ దిశను చూస్తూ నిలబడ్డాడు?
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) పడమర డి) ఏదీకాదు

27. ఉదయం సూర్యునివైపుగా అచ్యుత్ నడకకు బయలుదేరాడు. కొంత దూరం తరవాత ఎడమవైపునకు తిరిగి నడిచాడు. మరల ఎడమవైపునకు తిరిగి నడుస్తున్నాడు. అయితే అచ్యుత్ చివరగా ఏ దిశలో నడుస్తున్నాడు?
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) పడమర డి) తూర్పు


28. వినోద్, వివేక్, విక్రమ్, విశాల్ క్యారమ్స్ ఆడుతున్నారు. వినోద్, విక్రమ్‌లు భాగస్వాములు. విక్రమ్ తూర్పునకు ముఖంతో ఉన్నాడు. విశాల్ దక్షిణానికి ముఖంతో ఉన్నాడనుకొంటే పడమరకు ముఖంతో ఉన్న వ్యక్తి?
ఎ) వినోద్ బి) వివేక్ సి) విశాల్ డి) ఎవరూకాదు

29. ప్రశ్నార్థకం గుర్తు ఉన్న స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

5	8	17
33	63	126
86	171	?


ఎ) 346 బి) 348 సి) 341 డి) 382

30. ప్రశ్నార్థకం గుర్తు ఉన్న స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి



ఎ) 61 బి) 84 సి) 38 డి) 64

(31-35)



పై రేఖాచిత్రాన్ని ఆధారంగా చేసుకొని కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

31. గాయకులు, క్రికెట్ అభిమానులైన గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?
ఎ) K బి) I సి) E డి) B

32. గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?
ఎ) G బి) D సి) F డి) E

33. క్రికెట్ అభిమానులైన గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?
ఎ) L బి) H సి) D డి) K


34. గాయకులైన విద్యార్థులను సూచించే అక్షరం?
ఎ) C బి) A సి) K డి) J

35. కేవలం గాయకులను సూచించే అక్షరం?
ఎ) B బి) D సి) I డి) A

36. P అంటే x. Q అంటే ÷. R అంటే - . S అంటే +. అయితే 4P36Q3R752 విలువను తెలపండి?
ఎ) 48 బి) 43 సి) 52 డి) 54

37. A అంటే +. B అంటే x. C అంటే -. D అంటే ÷ అయితే 40D8A3B7C5 విలువను తెలపండి
ఎ) 21 బి) 26 సి) 24 డి) 23

38.



పై డయాగ్రం ఆధారంగా ఎడమవైపున ఉన్న పాచికకు అడుగు ముఖభాగంలో ఉండే అక్షరం?
ఎ) C బి) A సి) E డి) F

39. FRIENDSHIP పదంలో మొదటి అక్షరం ఆరో స్థానంలోకి, ఆరో అక్షరం మొదటి స్థానంలోకి, రెండో అక్షరం ఏడో స్థానంలోకి, ఏడో అక్షరం రెండో స్థానంలోకి, ఇలా పదంలోని అక్షరాలన్నీ మారాయి. మారిన తరవాత ఏర్పడిన నూతన పదంలో కుడి నుంచి అయిదో అక్షరానికి గల మూడో ఎడమ అక్షరం?
ఎ) H బి) N సి) R డి) F

40. ప్రస్తుతం అనుపమ్ వయసు కంటే అతని తండ్రి వయసు నాలుగు రెట్లు. అయిదేళ్ల తరవాత అతని తండ్రి వయసు అనుపమ్ వయసు కంటే మూడు రెట్లు అయితే ప్రస్తుతం అనుపమ్ తండ్రి వయసు?
ఎ) 40 బి) 30 సి) 35 డి) 45

41. లీపు సంవత్సరంలో జనవరి నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదే వారం వచ్చే తదుపరి నెల?
ఎ) మార్చి బి) జూన్ సి) ఏప్రిల్ డి) జూలై

42. పాట్నాకు ప్రతి 80 నిలకు ఒక రైలు ఉంది. విచారణాధికారి తనను కలిసిన ప్రయాణికుడితో రైలు వెళ్లిపోయి 15నిలు అయింది. తరవాత రైలు గం.10.15లకు అని చెప్పారు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పారు?
ఎ) గం.9.10ని బి) గం.10.20ని
సి) గం.9.30ని డి) ఏదీకాదు

43. కింది సిరీస్‌లో ముందు సరి సంఖ్య ఉండి తరవాత బేసి సంఖ్య గల సరిసంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 8 6 5 9 2 3 6 8 4 2 7 9 2 8 3 9
ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) ఏదీకాదు

44. ఈ రోజు ఆగస్టు 15 గురువారం. కిందటి ఏడాది లీపు సంవత్సరం అయితే మూడేళ్ల క్రితం ఇదే తేదీకి ఏ వారం వస్తుంది?
ఎ) సోమవారం బి) ఆదివారం
సి) శనివారం డి) ఏదీకాదు

సమాధానాలు

1) బి	7) సి	13) బి	21) సి	29) సి	37) ఎ
2) ఎ	8) ఎ	14) ఎ	22) ఎ	30) ఎ	38) డి
3) సి	9) డి	15) సి	23) సి	31) బి	39) ఎ
4) ఎ	10) బి	16) బి	24) డి	32) డి	40) ఎ
5) ఎ	11) బి	17) సి	25) బి	33) ఎ	41) సి
6) బి	12) ఎ	18) డి	26) ఎ	34) సి	42) ఎ
		19) సి	27) సి	35) డి	43) సి
		20) బి	28) ఎ	36) బి	44) బి

ఉద్యోగాలు

ఐఆర్‌డిఏఐ

హైదరాబాద్‌లోని ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డిఏఐ)- **అసిస్టెంట్ మేనేజర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 30
విభాగాలవారీ ఖాళీలు: ఆక్చూరియల్ 4, అకౌంట్స్ 4, లీగల్ 2, జనరల్ 20
అర్హత: 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు విభాగాన్ని అనుసరించి ఐఎఐ/ ఎసిఏ/ ఐసిడబ్ల్యుఏఐ/ ఎసిఎంఏ/ ఎసిఎస్/ సిఎఫ్ఏ/ ఎల్ఎల్‌బి పూర్తిచేసి ఉండాలి.
వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్లు మించకూడదు
ఎంపిక: ఫేజ్ 1 - ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, ఫేజ్ 2 - డిస్క్రిప్టివ్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా
ఫేజ్ 1 - ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్: అక్టోబరు 4న
ఫేజ్ 1 ఎగ్జామ్ సెంటర్లు: విజయవాడ, హైదరాబాద్
ఫేజ్ 2 ఎగ్జామ్ సెంటర్లు: హైదరాబాద్, కోల్‌కతా, ముంబై, న్యూఢిల్లీ
దరఖాస్తు ఫీజు: రూ.650(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.100)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 5
వెబ్‌సైట్: www.irdai.gov.in

ఎన్‌పిసిఐఎల్

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్)- **ట్రేడ్ అప్రెంటిస్**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 80
ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 15, టర్నర్ 5, మెషినిస్ట్ 5, ఎలక్ట్రీషియన్ 20, వెల్డర్ 10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 15, ఎలక్ట్రానిక్ మెకానిక్ 10
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
వయసు: జూలై 31 నాటికి 16 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి
అర్హత: అభ్యర్థులు పదోతరగతితో పాటు సంబంధిత విభాగంలో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి
ఎంపిక: అకడమిక్ మెరిట్, మెడికల్ ఎగ్జామ్ ద్వారా
ఆసక్తిగలవారు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 24
చిరునామా: Manager(HRM), Nuclear Power Corporation of India Limited, Kaiga site, Via Karwar, PO Kaiga ,Dt. Uttara Khand - 581400, Karnataka
వెబ్‌సైట్: www.npcil.nic.in

అడ్మిషన్స్

యుసిఇఒయు

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యుసిఇఒయు)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద **ఎంఇ/ ఎంటెక్** ప్రోగ్రామ్స్‌లో ప్రవేశ ప్రక్రియను నిర్వహిస్తోంది.
ప్రవేశ ప్రక్రియ జరిగే తేదీ: ఆగస్టు 30
వెబ్‌సైట్: www.uceou.edu

ఇఫ్లూ

హైదరాబాద్‌లోని ద ఇంగ్లీష్ & ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ వారి స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ - **ఎమ్మే (ఇంగ్లీష్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది
కోర్సు వ్యవధి: రెండేళ్లు
అర్హత: డిగ్రీ(ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా) పూర్తిచేసి ఉండాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: అక్టోబరు 31
వెబ్‌సైట్: www.efluniversity.ac.in

చిన్నపిల్లల శరీరాన్ని వెచ్చగా ఉంచే కొవ్వు ఏది?

1. తేలు జంతు రాజ్యంలోని ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) కార్డేట బి) అనెలిడా
సి) ఆర్థ్రోపొడా డి) మొలస్కా
2. ఈల్ అనేది ఒక ....
ఎ) చేప బి) క్షీరదం సి) పక్షి డి) అకశేరుకం
3. కర్పరాన్ని కలిగి ఉన్న ప్రోటోజోవన్ ఏది?
ఎ) ఎల్ఫీడియం బి) యూగ్లీనా సి) వర్టిసెల్లా డి) నత్త
4. కింది వాటిలో నిజమైన సర్పం కానిది ఏది?
ఎ) గాజు పాము బి) బ్లైండ్ స్నేక్
సి) సముద్ర సర్పం డి) ట్రీ స్నేక్
5. వ్యాపనం ద్వారా శ్వాసక్రియను జరుపుకొనే జంతువు?
ఎ) తేలు బి) అమీబా సి) వానపాము డి) బి, సి
6. కింది వాటిలో కర్పరం లేని మొలస్కా వర్గపు జీవి ఏది?
ఎ) నత్త బి) డేవిల్ ఫిష్ సి) జలగ డి) ఏదీకాదు
7. కింది వాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి.
1. హైడ్రా నిడేరియా వర్గానికి చెందుతుంది
2. హైడ్రాలో నోరు పాయువుగా కూడా పనిచేస్తుంది.
ఎ) 1 బి) 2 సి) 1 & 2 డి) ఏదీకాదు
8. పురుషుల్లో ఉండే ప్రొస్టేట్ గ్రంథి బరువు సుమారుగా?
ఎ) 20 గ్రాములు బి) 100 గ్రాములు
సి) 85 గ్రాములు డి) 0.5 గ్రాములు
9. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం పుట్టిన శిశువు కనీసం ఎన్ని కిలో గ్రాముల బరువు ఉండాలి?
ఎ) 2 బి) 4.6 సి) 5.2 డి) 3.3
10. 'బ్లూ బేబీ సిండ్రోమ్' ఉన్న శిశువులో ఏ అవయవంలో లోపాలుంటాయి?
ఎ) మెదడు బి) గుండె సి) కన్ను డి) ఊపిరితిత్తులు
11. 'డౌన్స్ సిండ్రోమ్' ఉన్న మానవునిలో ఎన్ని క్రోమోజోములు ఉంటాయి?
ఎ) 46 బి) 45 సి) 23 డి) 47
12. కింది కొన్ని ఎముకలు, అవి ఉండే భాగాల పేర్లు ఉన్నాయి. వాటిలో సరైన జత కానిది?
1. టిబియా - కాలు 2. అట్లాస్ - వెన్నెముక
3. కార్పెల్ - చేయి 4. స్టెపిస్ - ముక్కు
ఎ) 1, 4 బి) 3, 4 సి) 2, 3, 4 డి) కేవలం 4
13. 'కానిబాల్స్' అంటే?
ఎ) రక్తాన్ని పీల్చే జంతువులు
బి) ఫలాలు తినే జంతువులు
సి) మలాన్ని తినే జంతువులు
డి) తమ వంటి జీవులను తినే జంతువులు
14. కింది వాటిలో జలచర క్షీరదం?
ఎ) డుడాంగ్ బి) డాల్ఫిన్
సి) తిమింగలం డి) పైవన్నీ
15. వెంట్రుకల్లో ఉండే ప్రోటీన్?
ఎ) ఎవిడిన్ బి) కెసిన్
సి) కెరాటిన్ డి) కెరోటిన్
16. కింది వాటిలో అవశేష అవయవం?
ఎ) జ్ఞానదంతం బి) రెటీనా
సి) ప్లీహం డి) క్లోమం
17. 'ముస్కులర్ డిస్ట్రోఫి' దేనికి సంబంధించిన వ్యాధి?
ఎ) మెదడు బి) గుండె
సి) ఎముకలు డి) కండరాలు
18. చేప ప్రధాన విసర్జక పదార్థం?
ఎ) అమ్మోనియా బి) యూరియా
సి) యూరికామ్లం డి) క్రియాటిన్
19. కుల్యా వ్యవస్థను కలిగి ఉండటం ఏ జంతువు లక్షణం?
ఎ) వానపాము బి) స్పంజిక
సి) బద్దెపురుగు డి) అమీబా

జనరల్ స్టడీస్ - బయాలజీ



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

20. కింది ఏ జీవిలో ఏక రక్త ప్రసరణ కలదు?
ఎ) కప్ప
బి) పాము
సి) ఏనుగు డి) చేప



21. చేప గుండెలో ఉండే కర్ణికల సంఖ్య?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
22. ఏ జంతువు గుండెలో మిశ్రమ రక్తం ఉంటుంది?
ఎ) చేప బి) కప్ప సి) మొసలి డి) పైవన్నీ
23. కింది వాటిలో చేపల లక్షణం కానిది?
ఎ) ఉష్ణరక్త జీవులు బి) బంధిత రక్త ప్రసరణ
సి) బ్రాంఖియల్ హృదయం డి) బాహ్య ఫలదీకరణ
24. మలంతో పాటు చీము, రక్తం రావడం ఏ వ్యాధి లక్షణం?
ఎ) ఫైలేరియా బి) మలేరియా
సి) అమీబిక్ డిసెంట్రీ డి) టైఫాయిడ్
25. 'ఎంటరిక్ ఫీవర్' అని ఏ వ్యాధిని పిలుస్తారు?
ఎ) టైఫాయిడ్ బి) మలేరియా
సి) ఫైలేరియా డి) క్షయ
26. ఏ రకానికి చెందిన ట్యూమర్‌ను శస్త్ర చికిత్స ద్వారా తొలగించవచ్చు?
ఎ) బినైన్ బి) మాలిగ్నెంట్
సి) బినైన్, మాలిగ్నెంట్ డి) ఏదీకాదు
27. అధిక బరువును కలిగి ఉన్న మానవుని బాడీమాస్ ఇండెక్స్ ఎంత?
ఎ) 18.5 కంటే తక్కువ బి) 18.5 నుంచి 24.9
సి) 25 నుంచి 29.9 డి) 15.5 కంటే తక్కువ
28. కీలు చుట్టూ ఉండే ద్రవాన్ని ఏమంటారు?
ఎ) పెరిప్లూరల్ బి) పెరికార్డియల్
సి) సైనోవియల్ డి) మస్తిష్క మేరు ద్రవం
29. చేతి వేలితో ఒక వ్యక్తి కాలుపై నొక్కినప్పుడు గుంతలు ఏర్పడితే అతడు ఏ వ్యాధితో బాధపడుతున్నట్లు?
ఎ) స్కర్వీ బి) గౌట్ సి) ఫ్లోరోసిస్ డి) ఎడిమా
30. కింది వాటిలో ఎగిరే చేప ఏది?
ఎ) టార్పిడో బి) ఎక్సోసీటస్
సి) డాల్ఫిన్ డి) డెవిల్ ఫిష్
31. పుట్టిన పిల్లల్లో శ్వాసక్రియ రేటు?
ఎ) 32 బి) 16 సి) 25 డి) 70
32. మానవుని శరీరంలో యూరియా సంశ్లేషణ జరిగే ప్రదేశం?
ఎ) కాలేయం బి) క్లోమం
సి) మూత్రపిండం డి) ప్లీహం
33. సీతాకోకచిలుక ఆకారంలో ఉండే వినాళ గ్రంథి?
ఎ) పీయూష బి) అధివృక్క
సి) అవటు డి) పార్శ్వ అవటు(పారా థైరాయిడ్)
34. టిబియా అనే ఎముక ఏ భాగంలో ఉంటుంది?
ఎ) చేయి బి) కాలు సి) చెవి డి) ముక్కు
35. 'పెరికోసిస్' అనేది దేనికి సంబంధించిన వ్యాధి?
ఎ) ధమనులు బి) ఎర్రరక్త కణాలు
సి) కాలేయం డి) సిరలు
36. చిన్నపిల్లల శరీరాన్ని వెచ్చగా ఉంచే కొవ్వు ఏది?
ఎ) బ్రౌన్ ఫ్యాట్ బి) పసుపు ఫ్యాట్
సి) ఎరుపు ఫ్యాట్ డి) బ్లూ ఫ్యాట్
37. పాలలో ఉండే ప్రోటీన్ ఏది?
ఎ) లాక్టోజ్ బి) ఎవిడిన్ సి) కెరాటిన్ డి) కెసిన్
38. కింది వాటిని జతపరచండి.
1. కణ మేధస్సు ఎ. మైటోకాండ్రియా
2. కణ కొలిమి బి. కేంద్రకం
3. కణ భాండాగారం సి. రిక్తిక
4. కణ వంటశాల డి. హరితరేణువు
ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి బి) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
సి) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి డి) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
39. మానవుని రక్త వర్గాలకు సంబంధించి ఎన్ని జన్యు రూపాలు ఉంటాయి?
ఎ) 4 బి) 2 సి) 8 డి) 6
40. 'పెప్సిన్' అనేది ఒక ......
ఎ) హార్మోన్ బి) ఎంజైమ్ సి) విటమిన్ డి) స్టిరాయిడ్
41. కణం ప్రోటీన్ల కర్మాగారం అని దేన్ని పిలుస్తారు?
ఎ) లైసోజోమ్ బి) పెరాక్సిజోమ్
సి) రైబోజోమ్ డి) మైటోకాండ్రియ
42. ఎగిరే క్షీరదం అని దేన్ని పిలుస్తారు?
ఎ) డాల్ఫిన్ బి) తిమింగలం
సి) గబ్బిలం డి) డుడాంగ్
43. పాలలో లభించని పోషక పదార్థం?
ఎ) కాల్షియం బి) ప్రోటీన్లు సి) ఇనుము డి) పైవన్నీ
44. 'హెర్పిస్' అనే వ్యాధిని కలుగజేసింది?
ఎ) బ్యాక్టీరియా బి) శిలీంధ్రం
సి) ప్రోటోజోవన్ డి) వైరస్
45. వైడాల్ : టైఫాయిడ్ :: ఐయాప్సి : ....
ఎ) రేబీస్ బి) క్యాన్సర్ సి) ఎయిడ్స్ డి) సిఫిలిస్
46. ఉసిరిలో పుష్కలంగా లభించే విటమిన్?
ఎ) విటమిన్-సి
బి) విటమిన్-ఇ
సి) విటమిన్-డి
డి) విటమిన్-ఎ



47. మూత్రంలో విసర్జితమయ్యే విటమిన్?
ఎ) విటమిన్-డి బి) విటమిన్-సి
సి) విటమిన్-కె డి) విటమిన్-ఎ
48. ఐటన్, మిల్కి, పాడిగ్రూ అనేవి?
ఎ) పుట్టగొడుగు రకాలు బి) వరి రకాలు
సి) మామిడి రకాలు డి) అరటి రకాలు
49. కింది వాటిలో రక్తనాళాలు లేని జంతువు ఏది?
ఎ) వానపాము బి) బొద్దింక సి) కప్ప డి) పైవన్నీ
50. పట్టుపురుగుల పెంపకాన్ని ఏమంటారు?
ఎ) ఎపికల్చర్ బి) మోరికల్చర్
సి) ఒలేరికల్చర్ డి) సెరికల్చర్

సమాధానాలు

1) సి	9) డి	17) డి	25) ఎ	34) బి	43) సి
2) ఎ	10) బి	18) ఎ	26) ఎ	35) డి	44) డి
3) ఎ	11) డి	19) బి	27) సి	36) ఎ	45) బి
4) ఎ	12) డి	20) డి	28) సి	37) డి	46) ఎ
5) డి	13) డి	21) ఎ	29) డి	38) బి	47) బి
6) బి	14) డి	22) బి	30) బి	39) బి	48) ఎ
7) సి	15) సి	23) ఎ	31) ఎ	40) బి	49) బి
8) ఎ	16) ఎ	24) సి	32) ఎ	41) సి	50) డి
			33) సి	42) సి	

ఉద్యోగాలు

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - మెరైన్ ఇంజనీర్స్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన 'జీఎంఇ'(గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్) కోర్సుకు దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సులో 8 నెలల ప్రీ సీ ట్రైనింగ్, 10 నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది.
మొత్తం ఖాళీలు: 40
కోర్సు ఫీజు: రూ.4,50,000
క్యాంపస్: ఎస్‌సిఐ మారిటైం ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, పొవై, ముంబై
కోర్స్ ప్రారంభం: అక్టోబరు 1 నుంచి
అర్హత: ఆగస్టు 31 నాటికి బిఇ/ బిటెక్(మెకానికల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు. మహిళలకు రెండేళ్ల సడలింపు వర్తిస్తుంది
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 9న
పరీక్ష కేంద్రాలు: ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై
దరఖాస్తు ఫీజు: రూ.1000(ఎస్సీ/ ఎస్టీలకు రూ.500)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 23
దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: www.shipindia.com

ఇఎస్ఐసి

కోల్‌కతాలోని ఇఎస్ఐసి పీజీఐఎంఎస్ఆర్ & ఎంసి - కాంట్రాక్ట్ ప్రాతిపదికన **ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 23
పోస్టుల వారీ ఖాళీలు: ప్రొఫెసర్ 7, అసోసియేట్ ప్రొఫెసర్ 11, అసిస్టెంట్ ప్రొఫెసర్ 5
విభాగాలు: అనెస్థీషియా, బ్లడ్ బ్యాంక్/హెమటాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఇఎన్‌టి, జనరల్ మెడిసిన్, మైక్రో బయాలజీ, ఆప్తల్మాలజీ, పీడియాట్రిక్స్, పాథాలజీ, సైకియాట్రి, రేడియాలజీ, టిబి/ చెస్ట్ మెడిసిన్.
వయసు: ఇంటర్వ్యూ నాటికి 69 ఏళ్లు మించరాదు
ఇంటర్వ్యూలు: సెప్టెంబరు 4 నుంచి 7 వరకు
వేదిక: ESIC - PGIMSR & MC, Joka, Kolkata
వెబ్‌సైట్: www.esic.nic.in

జిటిఆర్ఇ

డిఆర్‌డిఒ ఆధ్వర్యంలోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ - **గ్రాడ్యుయేట్/ డిప్లొమా/ ఐటిఐ అప్రెంటిస్ ట్రైనీల** భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 152
- **గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీస్**

ఖాళీలు: 90
అర్హత: బిఇ/ బిటెక్ / తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
స్టయిపెండ్: నెలకు రూ.4,984
- **డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీస్**

ఖాళీలు: 30
అర్హత: డిప్లొమా / తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
స్టయిపెండ్: నెలకు రూ.3542
- **ఐటిఐ అప్రెంటిస్ ట్రైనీస్** **ఖాళీలు:** 32

అర్హత: రెండేళ్ల ఒకేషనల్ కోర్స్ / తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
స్టయిపెండ్: ప్రభుత్వ నిబంధనల మేరకు
ఎంపిక: అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును పోస్టు ద్వారా పంపుకోవాలి.
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 5
చిరునామా: The Director Gas Turbine Research Establishment, CV Raman Nagar, Bangalore - 560093

ఎంఒఐఎల్

నాగపూర్‌లోని మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఒఐఎల్)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు:** 13
పోస్టులు: మేనేజర్ (మెడికల్ సర్వీసెస్) 8, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ) 3, సీనియర్ మేనేజర్(జియాలజీ) 1, మేనేజర్(సెక్యూరిటీ) 1
అర్హత: పోస్టును అనుసరించి ఎంబిబిఎస్/ పీజీ (జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ)/ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.100
ఇంటర్వ్యూలు: మేనేజర్ పోస్టులకు ఆగస్టు 20న, ఇతర పోస్టులకు సెప్టెంబరు 4న
వేదిక: Moil Bhawan, 1 - A KATOL Road, Nagpur - 440013
వెబ్‌సైట్: www.moil.nic.in

ఆంధ్రజ్యోతి
12
కోవూరు
శనివారం, 19 ఆగస్టు 2017
కోవూరు । బుచ్చిరెడ్డిపాళెం । కొడవలూరు । విడవలూరు । ఇందుకూరుపేట

వైభవంగా పెద్ద వెండి నందిసేవ

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : మండలంలోని జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయివార్లు శ్రావణశుక్రవారం సందర్భంగా గ్రామోత్సవంలో పెద్ద వెండినందిసేవలో భక్తులకు దర్శనమిచ్చారు. నెల్లూరుకు చెందిన మల్లికార్జున, జయలక్ష్మి దంపతులు ఈ నందిసేవ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయానికి అధికసంఖ్యలో వచ్చిన భక్తజనం నడుమ స్వామి, అమ్మవార్లు ప్రత్యేకపుష్పాలంకరణ, మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవంలో వైభవంగా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

నగలు, నగదు చోరీ

కోవూరు: ప్రమీల నగర్‌లోని ఓ ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి మూడు సవర్ల నగలు, రూ.3వేలు నగదు అపహరించుకుని వెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ప్రమీలనగర్‌లో కాపురముంటున్న రాజారెడ్డి ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఆయన భార్య అంగన్‌వాడీ కార్యకర్త. ఇద్దరూ విధి నిర్వహణకు వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగులగొట్టి నగదు, నగలు అపహరించారని ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బెల్టుషాపులపై దాడి

ఇందుకూరుపేట : పల్లెపాడు గ్రామంలోని రెండు బెల్టుదుకాణాలపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. ఎక్సైజ్ ఎస్‌ఐ ఆసీఫ్‌బేగ్ ఆధ్వర్యంలో రెండు షాపుల్లోని దాదాపు 68 మద్యం సీసాలను స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేశారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఇద్దరిని శుక్రవారం కోర్టులో హాజరుపరచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

70 మంది ఉపాధ్యాయుల బదిలీ

కొడవలూరు:కొడవలూరు మండలంలో బదిలీపై 70 మంది ఉపాధ్యాయులు వెళ్ళినట్లు ఎంఈవో వసంతకుమారి శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయుల స్థానంలో ఇరత ప్రాంతాల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చే ఉపాధ్యాయులతో ఏర్పడిన కాళీలు భర్తీ కానున్నాయని ఆమె తెలిపారు.ఈ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆమె తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

విడవలూరు: మండల పరిధిలోని లక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శైలజకు సన్మానం జరిగింది. ఈ పాఠశాల నుంచి బదిలీపై తోటపల్లి గూడూరు మండలానికి వెళుతున్న ఆమెను ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. విద్యార్థుల అభ్యున్నతికి శ్రమించిన శైలజను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నమస్తే లోకజననీ..

● వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు



జొన్నవాడ ఆలయంలో వరలక్ష్మి వ్రతపూజకు కొలువుదీరిన అమ్మవారు



విడవలూరు: రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న సామూహిక కుంకుమార్చన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పూజలో పాల్గొన్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : జొన్నవాడ ఆలయంలో శ్రావణశుక్రవారం సందర్భంగా ఉదయం వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వరలక్ష్మీవ్రతపూజలో పాల్గొన్న భక్తులకు దాతలు, ఆలయం తరపున పూజాసామగ్రి సమకూర్చారు. అమ్మవారి అభిముఖంగా కూర్చున్న భక్తులు వరలక్ష్మీ పూజలు చేశారు. పూజలనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి, అమ్మ వార్లకు భక్తుల నడుమ నిత్యకళ్యాణం జరి గింది. శ్రావణశుక్రవారం ఈ సందర్భంగా సాయంత్రం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకిసేవలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఆలయ నిత్యాన్నదాన సదనంలో భోజనవసతి కల్పించారు. ఆలయ రథమండపం వద్ద శ్రీకాశీఅన్నపూర్ణేశ్వరి అన్నదాన సదనంలో భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాట్లను చైర్మన్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

విడవలూరు:రామతీర్థం గ్రామంలో వెలసివున్న శ్రీ కామాక్షీదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక శ్రావణ శుక్రవారం పూజలు జరిగాయి. సుమారు 200 మంది మహిళలు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. తొలుత ఆలయ పూజారి పేరేపి శ్రీకాంత్ శర్మ గణపతి పూజ చేశారు. అనంతరం దేవాలయం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో వరలక్ష్మీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ నాటూరు విజయకుమార్, ఈవో వేణుగోపాల్, పాలక మండలి సభ్యులు పోలయ్య, హరిప్రసాద్, సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : మండలంలో శ్రావణ చివరి శుక్రవారం సందర్భంగా పలు ఆలయాల్లో విశేష పూజలు, వ్రతాలు జరిగాయి. ఇందుకూరుపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, గంగపట్నం చాముండేశ్వరి ఆలయం, మైపాడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, లేబూరు కుంకాళమ్మ, ఇందుకూరుపేట ఇందుకూరమ్మ ఆలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. పూలాభిషేకాలు, కుంకుమ పూజలతోపాటు ప్రత్యేక వరలక్ష్మి వ్రత పూజలు, సామూహిక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఉదయగిరి శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ మాదాల సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఇందుకూరుపేటలో..

బుచ్చిరెడ్డి పాళెం:బుచ్చిరెడ్డిపాళెంలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని శివాలయం, కోదండ రామస్వామి దేవస్థానాలకు భక్తులు తరలి వచ్చి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తుఫాన్ షెల్టర్ ప్రారంభం

ఇందుకూరుపేట : గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం కృషి చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాముడుపాళెంలో శుక్రవారం దాదాపు రూ. 48 లక్షలతో నిర్మాణం జరుపుకున్న తుఫాన్ షెల్టర్, సిమెంటు రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో రూ. 500 కోట్ల మేర పనులు జరుగుతున్నాయన్నారు. ఒక ఇందుకూరుపేట మండలంలోని రూ. 120 కోట్ల పనులు జరుగుతున్నాయని, రానున్న కాలంలో కోవూరు నియోజకవర్గం సస్యశ్యామలం కానుందని ఆయన తెలిపారు. జిల్లాలోని కోవూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో మొదటి స్థానం పొందుతుందన్నారు. మండలంలోని తీర గ్రామాలలో సిమెంటు రోడ్లు 80 శాతం పూర్తి చేశామన్నారు. తీర వాసులకు అవసరమైన తుఫాన్ షెల్టర్లు, పక్కా నివాస గృహాలు, జాలర్లకు వలలు, బోట్లు విషయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందన్నారు. అలాగే మండలంలో తీర వాసులకు ముఖ్యంగా గిరిజన, దళిత ప్రజలకు ఎక్కడ ఎలాంటి అవసరాలు ఉన్నా తన దృష్టికి తేవాలని ఇప్పటికే ఈ మేరకు మండల అధికారులను ఆదేశించినట్లు కూడా తెలిపారు. అనంతరం గ్రామంలో ప్రజలను కలుసుకుని వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సభలో తహసీల్దారు వెంకటనారాయణమ్మ, ఎంపీడీవో కే వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల వీరేంద్రచౌదరి, నాయకులు బెజవాడ సుధాకర్‌రెడ్డి, దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోలంరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : రెడ్డిపాళెంలో నిర్మాణంపూర్తయిన సిమెంటురోడ్లను ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నేడు ప్రారంభోత్సవం చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బత్తల హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కోవూరు: మండల పరిధిలోని పలు ఎరువుల దుకాణాల్ని ఉదయగిరి సహాయ వ్యవసాయ సంచాలకురాలు సత్యవాణి శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని రికార్డుల్ని పరిశీలించారు. నోటీసు బోర్డుల్ని ఏర్పాటుచేసి ఎరువుల నిల్వ, ధర పొందుపరచాలన్నారు. స్టాకు రిజిష్టరును ఎప్పటికప్పుడు సరిదిద్దాలన్నారు. యజమానులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట వ్యవసాయాధికారిణి కళ్యాణి, ఏఈవో జయలక్ష్మి ఉన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి : రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాల్సిందిగా వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు అనిత కోరారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటైన విస్తరణాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ మండలంలో మిని ల్యాబ్‌లు ఏర్పాటుచేయనున్నట్లు వివరించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల్ని వాడాల్సిందిగా సూచించారు. ఈ సమావేశంలో ఏడీఏ కుప్పయ్య, విస్తరణాధికారులు రాజశేఖర్, అనిల్, నాగలక్ష్మి తదితరులు మాట్లాడారు.



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకురాలు సత్యవాణి

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

వింజమూరు: అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా సాతానువారిపాళెంలో శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, యాగశాల ద్వారతోరణం, ప్రధాన కలశస్థాపన, ఆరాధన బలి నిర్వహించారు. సాయంత్రం సహస్ర నామ పారాయణ, యాగశాల, చతుర్థానార్చాన, గాయత్రీ హోమం, నివేదన, హారతి, అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం సునీల్‌కుమార్‌అచారి ఆధ్వర్యంలో జరగగా, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు

తెలుగువెలుగు లేని పల్లెలు

● రోడ్లున్నా బస్సుల్లేవు ● పొరుగూరెళ్లాలంటే ఆటోలే దిక్కు ● ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం



వింజమూరు: మండలంలోని పల్లెలన్నింటికీ రోడ్లు ఉన్నా ఆర్టీసీ బస్సులకు నోచుకోవడం లేదు. దీంతో ప్రమాదమని తెలిసినా గ్రామీణ ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. మండలంలోని బుక్కాపురం, శంకవరం, వెంకటాద్రిపాళెం, గుండెమడగల, జనార్దనపురం, తక్కెళ్లపాడు, ఇందిరానగర్ కాలనీ, వన్నూరప్పపాళెం తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. పాసులున్న విద్యార్థులు మాత్రమే బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, మిగతా అందరూ ఆటోల్లోనే ప్రయాణిస్తుండడంతో, డీజిల్‌కయ్యే ఖర్చు కూడా రావడం లేదని, దాంతో బస్సులు నడపలేకపోతున్నామని ఆర్టీసీ అధికారులు అంటున్నారు. వ్యవసాయానికి అవసరమైన ఎరువులు తదితరాలు తీసుకెళ్లేందుకు ఆటోలు అనువుగా వుంటాయని, అందువల్లే ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు వాస్తవాలు పరిశీలించి అవసరమైన ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నడపాల్సిన అవసరం ఉంది.

ఆర్టీసీ బస్సులు నడపాలి



గతంలో మా ఊరికి బస్సు సౌకర్యం ఉండేది. ఆ సర్వీసును నిలిపివేయడంతో, గ్రామంలో ఆర్టీసీ బస్సును చూసి చాలా రోజులైంది. మా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

\- కొండస్వామి, సర్పంచు, జనార్దనపురం

పల్లెవాసులకు బస్సు అవసరం



ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో మండలంలోని మారుమూల ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులు గ్రామానికి వస్తే, ప్రజలు తప్పకుండా ఆదరిస్తారు.

-హజరత్‌రెడ్డి, శంకవరం

లగేజీ సౌకర్యం కల్పించాలి



ఆర్టీసీ సర్వీసుల్లో వ్యవసాయ సామగ్రిని తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా పల్లెవాసులకు అనుకూలంగా ఆర్టీసీ సర్వీసులు నడపాలి.

\- రమణారెడ్డి, బుక్కాపురం

● ఇంటర్వ్యూ



చవితి మండపాల ఏర్పాటుకు

అనుమతి తప్పనిసరి

ప్రభాకర్, ఎస్ఐ

?. గణపతి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి అవసరమా.

!. వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

?. విగ్రహాల ఏర్పాటు సమాచారం ఎవరికి తెలియజేయాలి.

!. విగ్రహాల ఏర్పాటు ప్రదేశం, నిమజ్జనం తేదీ, నిమజ్జన ప్రాంతం తదితర విషయాలు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలి.

?. వివాదాలు చోటుచేసుకుంటే.

!. గణపతి ఉత్సవాలకు ముందుగా కమిటీ ఏర్పాటు చేసుకోవాలి. వివాదాలు చోటుచేసుకుంటే కమిటీ సభ్యులే బాధ్యులవుతారు.

?. మైకుల ఏర్పాటుకు అనుమతి ఉందా.

!. మండపాల వద్ద మైకుల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి. ఆ ప్రాంతాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, జెండాలు ఏర్పాటు చేయరాదు.

\- ఉదయగిరి

20న ఎన్ఐవోఎస్ పరీక్ష



పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

వింజమూరు: ఈ నెల 20న ఎన్ఐవోఎస్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.ప్రత్యూష శుక్రవారం తెలిపారు. ఈ పరీక్షకు 334 మంది హాజరవుతారన్నారు.. అన్ని పంచాయతీల పరిధిలోని కేంద్రాల్లో పరీక్షలు సక్రమంగా నిర్వహించి నూరు శాతం అక్షరాస్యతను సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ జీ.కృష్ణకిరణ్ రెడ్డితో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభాకర్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్ బాలకృష్ణారెడ్డి, ఈసీవోలు తదితరులున్నారు.

స్వాభిమాన్ సర్వే పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్

సీతారామపురం: మండలంలో స్వాభిమాన సర్వేను ఈనెల 26వ తేదీ లోపు పూర్తి చేయాలని ఎంపీడీవో కిరణ్‌కుమార్ కోరారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాలయంలో సాక్షరభారత్ కోఆర్డినేటర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామ కోఆర్డినేటర్లు మరుగుదొడ్లు లేని వారిని గుర్తించి, వివరాలను స్వాభిమాన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం సర్వే విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ షేక్ ఖలీల్, గ్రామ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడి: ముగ్గురికి గాయాలు

ఉదయగిరి: పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున పిచ్చికుక్క దాడి చేయడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దేవలాల గడ్డకు చెందిన మరెమ్మ కోన నీటికి వెళుతుండగా కుక్క దాడి చేసింది. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న శకునాలపల్లికి చెందిన వెంకటమ్మ, లక్ష్మమ్మలపై దాడి చేసింది. దీంతో వైద్యశాలలో ఉన్న కొందరు యువకులు పిచ్చికుక్కను కొట్టి చంపారు. గాయపడ్డ వారు వైద్యశాలలో చికిత్స పొందారు.

వసతి గృహాల్లో బయోమెట్రిక్ విధానం అమలు

వరికుంటపాడు/దుత్తలూరు: బీసీ వసతిగృహాల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నట్లు కావలి డివిజన్ బీసీ సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి తెలిపారు. ఆమె శుక్రవారం వరికుంటపాడు, దుత్తలూరు బీసీ బాలుర వసతిగృహాల్లో నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రోజు పాఠశాలకు, వసతిగృహానికి హాజరవుతున్నారో లేదో పరిశీలిస్తుండాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించేలా వార్డెన్‌లు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. వార్డెన్ రామ్మూర్తి, హెచ్‌ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

5,207 మంది చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి బాల నాగేశ్వరరావు


ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లి, మిట్టపల్లి, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఎంఆర్ టీకా వేశారు. ఆత్మకూరు డివిజన్ ప్రోగ్రాం అధికారి వి.బాలనాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్ వ్యాక్సిన్‌తో తట్టు, రూబెల్లా వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. వచ్చేనెల 8వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రక్రియలో పిల్లలందరికీ టీకా వేసేలా తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తయితే ఇంటింటికి వెళ్లి, టీకా వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో 8,157 మంది లక్ష్యం కాగా, ఇప్పటివరకు 5,207 మందికి ఎంఆర్ టీకా వేశామన్నారు. వైద్యాధికారిణి మంజులమ్మ, ప్రధానోపాధ్యాయుడు భిక్షాలు, సీహెచ్‌వో ఐవీ ఆదిలక్ష్మి, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్ అక్బర్‌బాషా, హెల్త్ అసిస్టెంట్ హసనయ్య, ఉపాధ్యాయులు గౌస్‌బాషా, అర్షద్, నరసింహులు పాల్గొన్నారు.

వింజమూరు: శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు టీకా వేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది, వైద్యఆరోగ్య సిబ్బంది అరుణ, రత్నమ్మ, సీహెచ్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: గడ్డంవారిపల్లిలో ఆరోగ్య పర్యవేక్షకుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ రెండు వ్యాధులకు ఒకే టీకా గుర్తించిందన్నారు. ఈ టీకాతో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. రసూల్‌బీ, వేళాంగణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: పం(డ్రం)గి, సీతారామపురం, ఎస్సీ కాలనీ, ఓగూరువాండ్లపల్లి, పబ్బులేటిపల్లి, బోడసిద్ధాయపల్లెల్లో 188 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. హెచ్‌ఈవో ఖాజామస్తాన్, సూపర్‌వైజర్ అలీం, హెచ్‌వీ కృష్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



నవాజ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, మండల అధికారులు

సీతారామపురం: ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందిన సయ్యద్ ఖాజా నవాజ్‌ను శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంపీపీ కల్లూరి జనార్దన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహచర ఉద్యోగులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎంఈవో మస్తాన్‌వలి, పీఆర్ఏ శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శులు, సాక్షరభారత్ కోఆర్డినేటర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

వింజమూరు: శంకవరం పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వెళ్లిన కేవీ నాగలక్ష్మి, ఏ.నాగార్జునాచార్యులను శుక్రవారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యు. ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నాగలక్ష్మి రాపూరు, నాగార్జునాచార్యులు నేరేడుపల్లి పాఠశాలలకు బదిలీ అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని సుమతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ప్రమోద్, బి.నారాయణ, యు.మల్లికార్జున, సుబ్బారావు, ఎంసీహెచ్ ఫత్తేఖాన్, డి.మాల్యాద్రి, పి.స్నేహలత, కె.రవిశంకర్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి రూరల్: ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వ్యవసాయ రంగ విద్యుత్ సరఫరాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఓంకారం వెంకటేశ్వరరాజు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆత్మకూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగాఈ అంతరాయం ఏర్పడుతుందని, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

సంతానలక్ష్మి ఆలయంలో పూజలు

ఉదయగిరి: స్థానిక ఆనకట్ట సమీపంలోని సంతానలక్ష్మి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన, హారతి, సహస్రనామార్చన చేశారు. అమ్మవారిని దర్శనానికి భక్తులు బారులుతీరారు.

జూదరుల అరెస్టు

ఉదయగిరి రూరల్: స్థానిక బండగానిపల్లి మార్గంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై శుక్రవారం ఎస్ఐ ఎన్.ప్రభాకర్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులతో పాటు ఐదు మోటార్ సైకిళ్లు, మూడు సెల్ ఫోన్‌లు, రూ.6,270ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 1,8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. ప్రియతముల వైఖరిలో మార్పు ఆవేదన కలిగిస్తుంది. ఇంట్లో వేడుకలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): సోదరీ, సోదరుల వైఖరిలో మార్పు ఆవేదన కలిగిస్తుంది. విద్యా సంస్థల్లో ప్రవేశానికి అనుకూలం. రవాణా, ఏజెన్సీలు, స్టేషనరీ, బోధన రంగాల వారు చేపట్టిన పనులు పూర్తిచేస్తారు. ఒక వార్త కలవరపెడుతుంది.

మిథునరాశి: (మే21-జూన్21): ఆర్థిక విషయాలకు సంబంధించి ఒక సమాచారం కలవరపెడుతుంది. సన్నిహితులకు డబ్బు సర్దుబాటు చేయాల్సి వస్తుంది. రుణాలు, పెట్టుబడుల కోసం చేసే ప్రయాణాలు, చర్చలు ఫలిస్తాయి.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. ఆర్థిక వ్యవహారాల్లో సంకల్పం నెరవేరుతుంది. అనుకున్న నిధులు సకాలంలో చేతికి అందుతాయి. లక్ష్యాలు సాధిస్తారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో లక్ష్య సాధనకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. గ్రానైట్, ఫొటోగ్రఫీ, టెక్స్‌టైల్స్, బోధన రంగాల వారికి సంకల్పం నెరవేరుతుంది. ఏదో తెలియని వెలితి మనసును బాధిస్తుంది.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఆర్థిక వ్యవహారాలు అశాంతికి కారణం అవుతాయి. సన్నిహితులకు సంబంధించి రహస్య సమాచారం తెలుసుకుంటారు. ప్రదర్శనలు, ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. ఉద్యోగ, వ్యాపారాల్లో సన్నిహితుల సహకారం లోపిస్తుంది. బంధుమిత్రుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. జనసంబంధాలు విస్తరిస్తాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, వ్యాపారాల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది. భవిష్యత్ గురించి వ్యూహరచన చేస్తారు. వృత్తికి సంబంధించిన సమావేశాల్లో పాల్గొంటారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): రుణ ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. ఆర్థిక విషయాల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది. పన్నుల వ్యవహారాలు ఇబ్బంది పెడతాయి. పాత వస్తువుల రవాణాకు అనుకూలం. గత అనుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): పెట్టుబడులు, పందాలు, పోటీల్లో నష్టం సంభవం. ప్రియతముల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): శ్రీవారు, శ్రీమతి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. సన్నిహితుల సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో అనుకున్న పనులు పూర్తి చేస్తారు. విందు, వినోదాల్లో పరిమితి పాటించాలి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం కలవరపెడుతుంది. వృత్తిపరమైన శిక్షణలో పాల్గొనేందుకు అనుకూలం. కృషి రంగంలో కొత్త అనుబంధాలు ఏర్పడతాయి. విద్య, సృజనాత్మకరంగాల వారికి అనుకూలం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

పొదుపు గ్రూపులకు రూ.100 కోట్ల రుణాలు

● పనితీరు సరిగా లేని ఏపీఎంలపై చర్యలు ● కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలోని పొదుపు గ్రూపులకు ఈ నెలాఖరులోగా రూ.100 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయించాలని కలెక్టర్ ముత్యాలరాజు డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ బంగ్లాలో శుక్రవారం వెలుగు కార్యక్రమాలపై మండలాల వారీగా అధికారులతో ఆయన సమీక్షించారు. బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తక్కువ ప్రగతి సాధించిన ఏపీఎంలకు లక్ష్యాన్ని నిర్దేశించి పనులు చేయించాలన్నారు. పనితీరు మార్చుకోని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక పింఛన్ల పంపిణీ ప్రతినెల 5వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ ద్వారా మొక్కల పెంపకాన్ని వేగవంతంగా చేపట్టాలన్నారు. ఈ విషయంలో మండల అధికారులకు లక్ష్యాలు నిర్దేశించాలని సూచించారు. మొబైల్ బుక్ కీపింగ్ 100 శాతం జరగాలన్నారు. స్త్రీనిధి రుణ లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ లావణ్యవేణి మాట్లాడుతూ పొదుపు మహిళలకు ఉపాధినిచ్చే మొక్కల పెంపక కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఒక్కొక్కరికి రూ.8000 నుంచి రూ.10000వేల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. పింఛన్ల పంపిణీని సక్రమంగా చేయిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముత్యాలరాజు

ఉల్లి కిలో రూ.23

● రైతుబజార్‌లో విక్రయాలు

నెల్లూరు (సాంస్కృతికం) : బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధరలు మండిపోతుండడంతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా రైతు బజార్లలో ఉల్లి విక్రయాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో 10టన్నుల ఉల్లిపాయలు గురువారం రాత్రి జిల్లాకు చేరాయి. వీటిని నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేట రైతుబజార్‌కు 2.5టన్నులు, నవాబుపేట రైతుబజారుకు 2.5టన్నులు కేటాయించారు. అలాగే కావలి రైతు బజారుకు ఐదు టన్నులు పంపిణీ చేశారు. వీటి అమ్మకాలు శుక్రవారం మొదలయ్యాయి. రైతు బజారులో ఈ ఉల్లిపాయలను కిలో రూ.23కు విక్రయిస్తున్నారు. అయితే, బహిరంగ మార్కెట్ ధరకు, రైతు బజారు ధరకు కొద్దిగానే వ్యత్యాసం ఉండడంతో రైతు బజార్లో ఉల్లిపాయల కొనుగోలుకు ప్రజల నుంచి ఆశించిన స్పందన లేదని తెలిసింది.



రైతు బజారులో ఉల్లి విక్రయ కేంద్రం

న్యాయ పాలనలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వేదాయపాళెం) : జిల్లాలో ఎస్సీ కులానికి చెంది, న్యాయశాస్త్రంలో పట్టభద్రులైన వారికి న్యాయపాలనలో మూడేళ్ల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబరు 1వ తేదీలోపు నెల్లూరు కొండాయపాళెం గేటు సెంటర్‌లోని డీడీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. దరఖాస్తుతోపాటు కుల ధ్రువీకరణ, న్యాయవాదుల బార్ కౌన్సిల్ సభ్యత్వం ఉన్నట్లు ధ్రువీకరణ, బ్యాంకు ఖాతా పుస్తకం నకలు జతచేయాలని కోరారు.

కవితల పోటీలకు ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం) : అభ్యుదయ సేవా సమితి వార్షికోత్సవం సందర్భంగా కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఒరువూరు కృష్ణయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి కవితలు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు మరో 27 బహుమతులు అందజేస్తామన్నారు. పోటీలో పాల్గొనదలచిన వారు కవితలను పేజీ మేకప్ డీటీపీ చేసి, చిరునామా, ఫొటో, ఫోను నెంబరుతో పంపాలని కోరారు. పూర్తి వివరాలకు 99891 82885 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. వార్షికోత్సవం సెప్టెంబర్ 30న జరుగుతుందని తెలిపారు.

21 నుంచి సబ్సిడీ రుణాలకు ఎంపికలు

● మొదటి వారంలో ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ కోసం.. ● ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అంబేద్కర్

నెల్లూరు (వేదాయపాళెం) : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం అందించే బ్యాంకు లింకేజీ సబ్సిడీ రుణాలకు ఈనెల 21వ తేదీ నుంచి జిల్లాలో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. 21వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాయుడుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాలు, మున్సిపాలిటీలలో ఎంపికలు నిర్వహిస్తారన్నారు. గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 22వ తేదీ, ఆత్మకూరు, కావలి రెవెన్యూ డివిజన్ల పరిధిలో 23వ తేదీ, నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 24వ తేదీన ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎంపికలు నిర్వహించనున్నామన్నారు. గత ఏడాది కమిటీలలో ఎంపికై రుణాలు మంజూరు కాని వారు ఈ ఎంపికలకు హాజరు కావాల్సిన అవసరం లేదని, వారు నేరుగా బ్యాంకులకు వెళ్లవచ్చన్నారు. ఈ ఏడాది అన్ని ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా 16,383 యూనిట్లకుగాను రూ.350.63 కోట్లు ఆర్థిక సాయం అందించనున్నామని చెప్పారు.

ఇందులో రూ. 154.87 కోట్లు సబ్సిడీ కాగా, లబ్ధిదారుల వాటా రూ. 4.01 కోట్లు, బ్యాంకు రుణం రూ. 191.75 కోట్లుగా ఉంటుందన్నారు. లబ్ధిదారులు వారి వద్ద ఉన్న ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంతోపాటు కుల ధ్రువీకరణ, రేషన్, ఆధార్ కార్డులతో ఎంపిలకు హాజరు కావాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాల ఎంపికలు గతంలో వాయిదా పడ్డాయని, వీటిని సెప్టెంబరు తొలి వారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు పింఛనుదారుల సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పింఛనుదారుల సంఘం నెల్లూరు శాఖ సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు, కార్యదర్శి కొండాచారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం నెల్లూరులోని భక్తవత్సలనగర్‌లో ఉన్న పెన్షనర్స్ భవన్‌లో సాయంత్రం నాలుగు గంటలకు జరుగుతుందన్నారు. 10వ వేతన సవరణ బకాయిలు, 70 ఏళ్లు దాటిన వారికి అదనపు పింఛను, 2017 జనవరి నుంచి రావాల్సిన డీఏ బకాయిలు తదితర అంశాలపై చర్చిస్తామని, జిల్లాలోని పింఛనుదారులు అందరూ హాజరు కావాలని కోరారు.

రేపు సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరు (క్యాంపస్) : జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సబ్ జూనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు ఆదివారం జరుగుతాయని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లిరెడ్డి కోటారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యేవారు 2002 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఆదివారం ఉదయం 9గంటలకల్లా వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో స్టేడియంకు చేరుకోవాలని కోరారు. ఎంపికైనవారు సెప్టెంబర్‌లో ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	- 2,804
సవర (8 గ్రాములు)	- 22,432
వెండి కిలో ధర	- 42,500
వెండి గ్రాము ధర	- 42.50

చికెన్ ధరలు

వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	84
లేయర్	82
స్కిన్ చికెన్	139
స్కిన్‌లెస్ చికెన్	163
లేయర్ మాంసం	140

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	94
లేయర్ లైవ్	82
స్కిన్ చికెన్	154
స్కిన్‌లెస్	180
లేయర్	140

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.2,500 నుంచి రూ. 3,200 వరకు

పండ్లు: రూ.1,500 నుంచి రూ.2,000 వరకు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:	78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:	6.283 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :	------------
అవుట్‌ఫ్లో :	200 క్యూసెక్కులు
ఆవిరి :	53 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం :	-------------
కనిగిరికాలువ :	-------------
ఎడమ కాలువ :	-------------
కనుపూరు కాలువ:	-------------
బీపీఆర్ కాలువ :	------------
నెల్లూరుచెరువుకాలువ :	-----------

జంబ్లింగ్ వర్డ్స్

1. LBOD ▶..........
2. SGNI ▶..........
3. FTLI ▶..........
4. CPYO ▶..........

జంతర్‌మంతర్

1. విలయంద్యా ▶..........
2. వేశంమాస ▶..........
3. కాగారారం ▶..........
4. వాదేయంల ▶..........

చెప్పగలరా?

ఆదిలో ఉన్నా
కానీ మదిలో లేను
యుగంలో ఉన్నా
కానీ సగంలో లేను
నీవులో ఉన్నా కానీ నీరులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో
చెప్పగలరా?

సూక్తి

తెలియని విషయం గురించి మాట్లాడటం అంటే - నీ అవివేకాన్ని బయటపెట్టుకోవడమే!

చుక్కలు కలపండి





స్మైల్ ప్లీజ్





ఇంటి పండుగైనా.. బంధువుల ఇంట వేడుకైనా.. నలుగురు కలిసిన ఏ వేళైనా.. ఫొటో క్లిక్‌మంటుంది. అందమైన జ్ఞాపకం కెమెరా కన్నుల్లో మరింత అందంగా ముస్తాబవుతుంది. ఎన్నో భావాలకు, మరెన్నో మధురానుభూతులకు సాక్ష్యంగా నిలిచేది ఫొటో. ప్రకృతి అందాలు, పక్షుల సోయగాలు, సెలయేళ్ల హొయలు, నదీనదాల పరవళ్లు, ఆకాశ అద్భుతాలు, నేలమ్మ ఆనందాలు.. అన్నింటినీ ఇట్టే బంధించేస్తుంది కెమెరా. ఇప్పుడెందుకు ఫొటో ముచ్చట్లు అంటే.. ఈ రోజు 'ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం'!

సెల్ఫీ.. సెన్సేషన్ సృష్టించినా.. గ్రూపీ.. గ్రూపులు కట్టినా.. ఫొటోకు సాటి రావు. మానవ జీవితంలో ఫొటోగ్రఫీకి విడదీయలేని అనుబంధం ఉంది. దానికి శతాబ్దాల చరిత్ర ఉంది. 18వ శతాబ్దంలో పారిస్‌లో నలుపు, తెలుపులతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాలక్రమంలో రంగులు అద్దుకుంటూ కొత్తపుంతలు తొక్కుతోంది.

రెండు గ్రీకు పదాల కలయికే 'ఫొటోగ్రఫీ'. ఫొటో అంటే కాంతి, గ్రఫీ అంటే గీయడం అని అర్థాలు. 'ఫొటోగ్రఫీ' అంటే.. కాంతితో చిత్రాన్ని గీయడం.

ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జె.ఎమ్. డాగ్యూరే, జోసెఫ్ నైస్‌ఫొరెలు 1837లో 'ఫొటోగ్రఫీ ప్రాసెస్'ను ప్రపంచానికి పరిచయం చేశారు. 'ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' డాగ్యూరే రూపొందించిన 'ఫొటోగ్రఫీ ప్రాసెస్'ను అధికారికంగా గుర్తించింది. ఆ తర్వాత 1839, ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం 'ఫొటోగ్రఫీ ప్రాసెస్' పేటెంట్ హక్కులను సొంతం చేసుకుని, ప్రపంచానికి ఉచిత బహుమతిగా అందించింది. అందుకే ప్రతి ఏటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుతున్నారు.

మనదేశంలో 1857 వరకు ఫొటోగ్రఫీ అందుబాటులోకి రాలేదు. 1977 ముందు వరకు బ్రిటీష్ వాళ్లు, జమీందారులు, సిపాయిలు మాత్రమే ఫొటోలు తీసుకునేవారు. ఆ తర్వాత ఇది సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. లాలా దీనదయాళ్ భారత్‌లో తొలిసారిగా 'ఫొటోగ్రఫీ'కి శ్రీకారం చుట్టారు.

1860లో నలుపు, తెలుపు రంగుల ఫొటోలు కాస్త రంగుల్లోకి మారిపోయాయి. జేమ్స్ క్లార్క్ మ్యాక్స్‌వెల్ 'కలర్ ఫొటో'లకు ప్రాచుర్యం తెచ్చాడు.

- ❖ 1988లో మొదటి డిజిటల్ కెమెరా (ఫ్యూజీ డీఎస్-1పీ) అందుబాటులోకి వచ్చింది. ఫొటోను కంప్యూటరైజ్డ్ ఫైల్‌లో నిక్షిప్తం చేసుకునే సౌకర్యం వచ్చింది.
- ❖ మొదటి డిజిటల్ కెమెరాలో 1.4 మెగా పిక్సల్స్ మాత్రమే ఉండేది. ఆ కెమెరా ధర 10 వేల డాలర్లు.

స్మార్ట్ ఫోన్ రాక ముందు... ఎంతోమంది మెడలో కెమెరా వేసుకుని, లెన్స్ జూమ్ చేస్తూ.. తమకు ఇష్టమైన వాటిని ఫొటోలు తీస్తుండేవారు. అదో గొప్ప కళగా భావించేవారు. రాను రాను జనాలు కెమెరాలు కొనడం మానేశారు. కానీ ఆనాటి తరం కెమెరాల నుంచి ఈ నాటి అత్యాధునిక కెమెరాల వరకు అన్నింటికీ చోటు కల్పిస్తూ హర్యానాలోని చక్కర్‌పూర్‌లో 'వింటేజ్ కెమెరా మ్యూజియం' ఇటీవలే ప్రారంభమంది. మనదేశంలోనే ఇది అతి పెద్దది కావడం విశేషం. దాదాపు ఇందులో 700 కెమెరాలు ప్రదర్శనకు ఉంచారు. 100 ఏళ్ల నాటి కెమెరాలను కూడా ఇక్కడ చూడొచ్చు. ఆదిత్యా ఆర్య అనే ఫొటోగ్రాఫర్ వీటిని సేకరించారు.




ప్రపంచంలోనే అతి ఎక్కువ ధర పలికిన కెమెరా 'డాగ్యురే టైప్'. ఇది 168 సంవత్సరాల క్రితం నాటిది. దీని ధర దాదాపు లక్షా ముప్పై రెండు వేల డాలర్లు కావడం విశేషం.

ఔనా!



కాకుల గుంపును 'మర్డర్' అంటారు.

బొమ్మ గీయండి



మీకు తెలుసా?



ఉరుములకు ఆడవారి కన్నా మగవారే 5 రెట్లు ఎక్కువ ఉలిక్కిపడతారు.

టంగ్ ట్విస్టర్స్

1. How many yaks could a yak pack pack if a yak pack could pack yaks?
2. There's a sandwich on the sand which was sent by a sane witch.
3. There was a little witch which switched from Chichester to Ipswich.

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : ఏమ్మా! రాణీ! స్కూలుకు ఇంత ఆలస్యంగా వచ్చావేమిటి?

రాణి : మా నాన్నగారు రోడ్డు చూసుకుంటూ వెళ్లమన్నారు టీచర్! రోడ్డంతా చూస్తూ వచ్చేసరికి ఈ సమయమైంది.


టీచర్ : !!!!!!!!!!

రంగులు వేయండి



క్రాస్ వర్డ్

music, sound, voice, sports, editing, reports, weather, announce



జవాబులు

చెప్పగలరా? : ఆయువు
జంబ్లింగ్ వర్డ్స్ : 1. BOLD 2. SIGN 3. LIFT 4. COPY
జంతర్‌మంతర్ : 1. విద్యాలయం 2. సమావేశం 3. కారాగారం 4. దేవాలయం

● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఒక చిత్రం.. ఒక ఆలోచన!



ఒక చిత్రం... ఎన్నో భావాలను పలికిస్తుంది. హృదయాంతరాళాలను కదిలిస్తుంది. అంతే కాదు.. ఒక చిత్రం గొంతుకలను ఏకం చేసింది. ఒక చిత్రం... ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది. ఒక చిత్రం... ప్రపంచాన్ని ఏకతాటిపై నడిపించింది. ఎన్ని మాటలు చెప్పినా వివరించలేని ఒక విషయాన్ని ఒక్క చిత్రంతో తెలపవచ్చన్నది నగ్నసత్యం. ధ్వని కన్నా దృశ్యం చాలా ప్రభావవంతం. ఒక చిత్రాన్ని చూసి మార్పు చెందిన వారు ఈ ప్రపంచంలో ఎందరో. ఇటీవల స్వదేశం వదలి పారిపోతున్న శరణార్థుల పడవనుంచి సముద్రపు ఒడ్డున జారిపడిన ఓ చిన్నారి మృతదేహం ఫొటో యావత్ ప్రపంచాన్నే కుదిపేసింది. ఇలా ఫొటోగ్రఫీకి ఉన్న ప్రాముఖ్యత రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. అనేక మంది ఫొటోగ్రఫీనే తమ వృత్తిగా, మరికొందరు హాబీగా ఎంచుకొని ముందుకు సాగుతున్నారు. వారందరికీ ఫొటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు.

- ఆంధ్రజ్యోతి, నెల్లూరు

స్వర్ణాల తీరాన పండుగ సంరంభం



ప్రాణదాత కే సుస్తీ చేస్తే!




నటనం.. ఛాయాచిత్ర విన్యాసం



నెల్లూరు తీరాన కోనసీమ అందాలు





వేలాది బిందువులతో మయూర రూపం

అనుమానంతో ఆలిని చంపేశాడు..!

● రోకలిబండతో మోది హత్య ● పోలీసుల అదుపులో నిందితుడు

నాయుడుపేటరూరల్ : అనుమానం పెనుభూతమైంది.. అగ్నిసాక్షిగా తాళికట్టి నిండు నూరేళ్లు తోడూనీడగా ఉంటానని ప్రమాణం చేసిన భర్తే కాలయముడయ్యాడు. భార్యను అత్యంత కిరాతకంగా రోకలిబండతో మోది మానవత్వం మంటకలిసేలా దారుణంగా హత్యచేశాడు. నాయుడుపేట మండలం కోనేటిరాజుపాళెంలో పాలెపు శేఖర్‌కు కోటలోని శ్యామసుందరాపురానికి చెందిన రమణమ్మకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి వీరు కోనేటిరాజుపాళెంలోనే నివాసం ఉంటున్నారు. మేనకూరులోని ఓ పరిశ్రమలో పాలెపు శేఖర్ దినసరి కూలీగా పనిచేస్తుండగా మరో పరిశ్రమలో రమణమ్మ దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఇటీవల భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న శేఖర్ గొడవకు దిగేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న రమణమ్మ (20)తో శేఖర్ వివాదం పెట్టుకొని రోకలిబండతో కొట్టబోతుండగా స్థానికులు వారించారు. దీంతో స్థానికులపై కూడా దాడికి దిగి భార్య రమణమ్మ తలపై రోకలిబండతో కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై రమణమ్మ అక్కడిక్కడే మృతి చెందింది. అక్కడి నుంచి పరారైన శేఖర్ పక్కవీధిలో ఓ చెట్టు కింద కూర్చొని ఉండగా బంధువులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. శేఖర్‌కు ఎటువంటి చెడు వ్యసనాలు లేనప్పటికీ అనుమానం పెనుభూతమై నిండు జీవితాన్ని కాలరాశాడు. ఎస్ఐ రవినాయక్, హెడ్‌కానిస్టేబుల్ సాబ్‌జాన్, సునీల్‌లు సంఘటనాస్థలికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకుని స్థానికులను విచారించారు.



నిందితుడు శేఖర్



రమణమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధుమిత్రులు

కన్నుల పండువగా లక్ష కుంకుమార్చనలు

కిటకిటలాడిన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం



అలివెట్టి మండపంలో కొలువుదీరిన అమ్మవారు

నెల్లూరు (సాంస్కృతికం) : శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా నగరంలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్దఎత్తున లక్ష కుంకుమార్చనలు జరిగాయి. ఆలయంలో అమ్మవారికి ప్రధాన అర్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, విశేష పూజలు, సహస్ర నామార్చనలు జరిగాయి. అనంతరం అలివెట్టి మండపంలో రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అలంకారం చేశారు. ఆమె సమక్షంలో సామూహిక లక్ష కుంకుమార్చనలు జరిగాయి. అలాగే వందలాది మంది మహిళలు రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి నామ స్మరణలతో ఆలయం మారుమోగిపోయింది. సాయంత్రం విశేష పూలంగిసేవ, అర్చనలు, పల్లకీసేవ, కుంభహారతులు కన్నుల పండువగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో కోలాటం, భజనలు, నృత్య ప్రదర్శనలు, భక్తి సంగీత లహరి భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ పూజల్లో కొలపర్తి రమేష్, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ రత్నంజయరామ్, ఈవో పులి కోదండరామిరెడ్డిలు పర్యవేక్షించారు. ప్రసాదం ఉభయదాతలుగా సూర్యనారాయణ దంపతులు వ్యవహరించారు. అమ్మవారికి విశేష అలంకారానికి బాలాజీనగర్ భజన మిత్రమండలి వారు ఉభయదాతలుగా వ్యవహరించారు.



సాంకేతిక నైపుణ్యంపై శిక్షణ పొందాలి

● ఎస్పీ రామకృష్ణ



కమాండెంట్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న ఎస్పీ రామకృష్ణ

వెంకటగిరి(టౌన్): సాంకేతిక నైపుణ్యంపై శిక్షణ పొందాలని ఎస్పీ రామకృష్ణ అన్నారు. శుక్రవారం 9వ బెటాలియన్‌లోని ఏఆర్‌కు చెందిన 252 మంది పోలీసుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ ఏకాగ్రతతో పనిచేయాలన్నారు. ఆలోచన శక్తిని ఆయుధంగా మార్చుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. నేటి ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంతోనే ముందుకు సాగుతుందన్నారు. అందుకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. సెక్షన్లపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, పోలీసులపై ప్రజలకు నమ్మకం ఉన్నపుడే పోలీసుల విలువలను కాపాడుకోవచ్చునన్నారు. 9వ బెటాలియన్ ఎంతో ఆహ్లాదకరమయిందని, కమాండెంట్ ఏల్ఎఫ్ పార్థుడు ఎంతో వ్యక్తిత్వం కలవారన్నారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ ఏల్ఎఫ్ పార్థుడు, ఆడిషనల్ కమాండెంట్ ఎల్‌వీఎస్ రమణ, డీఎస్పీ హరిపుల్లా తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరం వార్షికోత్సవం

అనంతసాగరం: అనంతసాగరంలో వెలసిన సాయిబాబా మందిరం 13వ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో గణపతిపూజ, సుప్రభాతసేవ, ధుని ప్రజ్వలన, సాయి అష్టోత్తర నామపూజ, భజన, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. సాయినాథుని మందిరాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. శని, ఆదివారాల్లో కూడా ప్రత్యేక పూజలు జరగనున్నాయని మందిర కమిటీసభ్యులు తెలిపారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.

మొక్కుబడి పొలంబాట!

● కార్యాలయాలకే పరిమితమవుతున్న అధికారులు ● వాహన సౌకర్యం కల్పించాలని డిమాండ్

ఆత్మకూరు: ప్రభుత్వాలు మారినా, అధికారుల తీరు మారడం లేదు. అన్నదాతకు పెద్ద పీట వేస్తామని చెప్పే పాలకులు, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చి అండగా నిలవాల్సిన వ్యవసాయ శాఖాధికారులకు వాహన సౌకర్యం కల్పించడంపై చేతులెత్తేశారు. దాంతో వ్యవసాయాధికారులు గ్రామాలను సందర్శించడం తగ్గిపోయింది. దీంతో రైతన్న శ్రేయస్సే లక్ష్యంగా చేపట్టిన పొలంపిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా మారింది.

ఆత్మకూరు నియోజకవర్గంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా మారింది. ఇటీవల సోమశిలలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయశాఖాధికారి, విస్తరణాధికారితో పాటు కేవలం ఏడుగురు రైతులు మాత్రమే హాజరు కావడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. వ్యవసాయాధికారులు తమ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించి పంటలను పరిశీలించాల్సి ఉండగా, అందుకు అవసరమైన వాహన సౌకర్యం లేక పోవడంతో గ్రామాలకు వెళ్లడం కష్టంగా మారింది. పొలంపిలుస్తోంది... కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖాధికారులు, విస్తరణాధికారులు వారంలో రెండు రోజులు గ్రామాల్లో పర్యటించాల్సి ఉంది. ఆ రెండు రోజుల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటించి రైతులకు సాగులో సూచనలు, సలహాలు ఇవ్వాలి. రైతుల కోరిక మేర పంట పొలాల్లో పర్యటించి సస్యరక్షణ చర్యలను తెలియజేయాల్సి ఉంది. నెలలో 16 రోజులు తప్పనిసరిగా గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండాలి. కానీ కొందరు వ్యవసాయాధికారులు మండల కేంద్రాల్లోని కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లినా ఐదారుగురు రైతులతో సమావేశాలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు. దాంతో పొలంపిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది.

వాహన సదుపాయం కట్

వ్యవసాయ శాఖాధికారులపై పర్యవేక్షణ, గ్రామాల్లో రైతులతో సమావేశాలు, పంట పొలాల సందర్శన కుఈ శాఖ సహాయ సంచాలకులకు గతంలో ప్రభుత్వం వాహన సదుపాయం కల్పించేది. ఇందుకయ్యే ఖర్చుల నిమిత్తం నెలకు రూ.17 వేలు వరకు చెల్లించేది. అయితే, గత ఏడాది రెండు నెలలు మాత్రమే ఈ బిల్లులు చెల్లించింది. ఆ తరవాత చేతులెత్తేసింది. మండలాభివృద్ధి అధికారికి, తహసీల్దార్లకు, ఎస్ఐకి, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లకు వాహన సదుపాయం కల్పించిన ప్రభుత్వం, రైతులకు సేవలందించే వ్యవసాయశాఖాధికారులకు గానీ, వ్యవసాయ ఉపసంచాలకులకు గానీ వాహన సదుపాయం కల్పించకపోవడం బాధాకరమని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వాహన సదుపాయం కల్పించి ఉంటే మారుమూల గ్రామాల్లో సైతం పర్యటించి రైతులకు మెరుగైన సేవలు అందించే వెసులుబాటు ఉండేదనిఅంటున్నారు. వ్యవసాయ ఉపసంచాలకులకు ఎఫ్‌టీఏ రూ.700, ఫోన్ ఖర్చుల నిమిత్తం రూ.615, క్షేత్రపర్యటన ఖర్చులకు రూ.500 మాత్రమే చెల్లిస్తున్నారు. దాంతో వ్యవసాయ శాఖాధికారులు మొక్కుబడిగా పల్లెగడప తొక్కుతున్నారు. ఫలితంగా పొలంపిలుస్తోంది..

నీరుగారుతున్న లక్ష్యం

ఇప్పటికే రకరకాల ప్రయోగాలు, ఆధునిక పద్ధతులతో వ్యవసాయంలో నూతన అడుగులు వేసేందుకు సన్నద్ధమవుతున్న ప్రభుత్వం... వ్యవసాయశాఖాధికారులకు వాహన సదుపాయంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అప్పుడే పొలంపిలుస్తోంది... లాంటి కార్యక్రమాలు విజయవంతమవుతాయి. రైతులకు సకాలంలో సరైన సూచనలు, సలహాలు అందుతాయి. అధిక దిగుబడులు సాధ్యపడుతాయి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

● ఇంటర్వ్యూ



మెట్ట దుక్కులతో భూమికి ఆరోగ్యం

శైలజాకుమారి, వ్యవసాయాధికారి

?. మెట్ట దుక్కులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా.

!. డెల్టా ప్రాంతాల్లో పంట పంటకు విరామం లేకపోవడంతో మెట్ట దుక్కులను రైతులు మరిచిపోయారు. మెట్ట దుక్కులు మాగాణి పొలాలకు ఎంతో మేలు చేస్తుంది. దీంతో కలుపు అంతరించి భూమి సారవంతమవుతుంది. అడపాదడపా వర్షాలు పడుతుండడంతో మెట్ట దుక్కులు చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నాం.

?. పొలం పిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా మారిందన్న ఆరోపణలున్నాయి.

!. వారానికి రెండు రోజులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నాం. పంట కాలాన్ని బట్టి అవసరమైన సమాచారం అందిస్తున్నాం. కొందరు రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. అవగాహనలేని రైతులు పిలిచినా రావడంలేదు.

?. పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయా. వీటిని పొందేందుకు అర్హత ఏమిటి.

!. పచ్చిరొట్ట విత్తనాలు75 శాతం రాయితీపై రూ. 28.50లకు పిల్లిపెసర, రూ. 10.00 లకు జీలుగలు అందజేస్తున్నాం. ఐదు ఎకరాలలోపు పొలం కలిగిన రైతులు అర్హులు.

? బయో మెట్రిక్‌తో రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయంటున్నారు.

!. భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో సక్రమంగా నమోదు కాకపోవడంతో ఇబ్బందులు వస్తున్న మాట వాస్తవమే. రైతులు రెవెన్యూ రికార్డుల్లో తమ వివరాలు సక్రమంగా నమోదు చేయించుకుని ఆధార్‌తో అనుసంధానం చేయించుకుంటే సమస్యలు ఉండవు.

\- సంగం

రేపు ఎల్ఎల్ఆర్ మేళా



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న వాహనాల తనిఖీ అధికారి షేక్ బాబు

ఆత్మకూరు: రాష్ట్ర రవాణా శాఖ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 20న ఆత్మకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో ఆటో లైసెన్సు కలిగిన వారు బ్యాడ్జి తీసుకునేందుకు ఎల్ఎల్ఆర్ మేళా నిర్వహిస్తున్నట్లు మోటారు వాహనాల తనిఖీ అధికారి షేక్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీవో కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు ఎల్ఎల్ఆర్ మేళాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ ట్రాన్స్‌పోర్టు లైసెన్సు కలిగిన డ్రైవర్లు ఫారం-1, 2, 1ఏ మెడికల్ సర్టిఫికెట్, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్సుతో పాటు రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, సెల్ఫ్ అఫిడవిట్‌తో పాటు రూ.260ల రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. 20వ తేదీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మేళా కొనసాగుతుంది. ఆటోడ్రైవర్లు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ఫీజు రీయింబర్స్ చేయాలని ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని వైసీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ షేక్ వశీం తెలిపారు. శుక్రవారం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ వైసీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ బస్టాండ్‌సెంటర్ నుంచి ఆర్టీవో కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016-17 విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు కనీసం 20 శాతం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యాసంస్థల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇచ్చేందుకు సైతం నిరాకరిస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు వారు ఆర్టీవో బాపిరెడ్డికి వినతిపత్రం అందచేశారు. వైసీపీ విద్యార్థి విభాగం నేతలు ఎన్.ప్రసాద్, పి.నాయబ్, షేక్ మహమ్మద్‌రఫీ, యువరాజ్, చిరంజీవి పాల్గొన్నారు.

సాక్షర భారతి కో- ఆర్డినేటర్లకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సంగం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాక్షర భారతి 8వ విడత అక్షరాస్యత ముందస్తు సభ్యత్వ నమోదు కార్యక్రమంపై శుక్రవారం గ్రామ కో- ఆర్డినేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రఫీఖాన్ మాట్లాడుతూ ఆదివారం జరగబోవు ఎన్ఐఓఎస్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 7వ విడత అక్షరాస్యత కార్యక్రమంలో డి గ్రేడ్ వచ్చిన 100 మంది వయోజనులకు ఆదివారం పరీక్ష నిర్వహించాలని సూచించారు. జండాదిబ్బ, అన్నారెడ్డిపాళెం, దువ్వూరు, సిద్దీపురం, సంగం గ్రామాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 8వ విడత అక్షరాస్యత కార్యక్రమం నిర్వహణకు అవసరమైన అంశాలు వివరించారు. మండల కో- ఆర్డినేటర్ మాట్లాడుతూ అభ్యాసకులందరూ పరీక్షకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత గ్రామ కో- ఆర్డినేటర్లదేనన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అన్నపూర్ణరావు, మండల కో- ఆర్డినేటర్ అశోక్, గ్రామ కో- ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు

మెరుగైన జీవనం కోసం పోరాటం తప్పదు

● జిల్లా వీఆర్ఏల సంఘం నేత శేషయ్య

ఆత్మకూరు: గ్రామ రెవెన్యూ సహాయకులు పార్ట్‌టైమ్ ఉద్యోగులైనా 24 గంటలూ వెట్టిచాకిరీ చేస్తున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనంలో సగం కూడా వేతనంగా పొందలేకపోతున్నారని ఏపీఆర్ఎస్ఏ జిల్లా జాయింట్ సెక్రటరీ డి.వి.శేషయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలు పరిష్కరించి వారికి మెరుగైన జీవనం కల్పించేందుకు ఏపీ గ్రామ సేవకుల సంఘం దశలవారీగా పోరాడుతోందన్నారు. ఈ నెల 20న నెల్లూరు ఎన్‌జీవో హోమ్‌లో జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోరాటాలకు వీఆర్ఏలను సన్నద్ధం చేసి సమస్యను పరిష్కరించడంపై సర్వసభ్య సమావేశంలో సమీక్ష జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలకు నెలకు రూ.10,700లు వేతనం ఇస్తుండగా, రాష్ట్రంలో మాత్రం రూ.6,400 మాత్రమే ఇస్తుండడం బాధాకరమన్నారు. వీఆర్ఏల గౌరవ వేతనం నెలకు కనీసం రూ.13,500కు పెంచాలని, ఏపీపీఎస్‌ఈ ద్వారా నియమించిన వీఆర్ఏలకు టైమ్‌స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలందరూ ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏఎస్‌పేట: వీఆర్ఏలు 24 గంటలూ చాకిరీ చేస్తున్నా వేతనంలో తగిన గౌరవం ఇవ్వడం లేదని వీఆర్ఏల సంఘం డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూవిద్యార్హత ఉన్నా వీఆర్ఏలు ప్రమోషన్లకు నోచుకోవడం లేదని, సెలవులు కూడా కల్పించడం లేదన్నారు. దీంతో శ్రమ దోపిడీకి గురవుతున్నామని తెలిపారు.

దుకాణం పరిశీలన

చేజర్ల: ఆదురుపల్లి గ్రామంలో 2016-17 సంవత్సరానికి సంబంధించి స్థానికంగా నివసించే యనమల పెంచలయ్యకు బీసీ రుణం మంజూరైందని ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదురుపల్లిలోని ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు మంజూరు చేసిన రుణంతో లబ్ధిదారు ఫ్యాన్సీ దుకాణం ఏర్పాటు చేసుకున్నాడన్నారు. బ్యాంక్ మేనేజర్ శివరామయ్యతో కలిసి ఆ దుకాణాన్ని పరిశీలించినట్లు ఆయన తెలియజేశారు.

ఫారంపాండ్స్ ఏర్పాటుకు స్థల పరిశీలన

చేజర్ల: పెరుమళ్ళపాడు, ఓబులాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఫారంపాండ్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లకు ఏర్పాటుకు స్థల సేకరణ కోసం అధికారులు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూగర్భ జలాలు పెంపొందించడం లక్ష్యంగా ఫారంపాండ్స్ ఏర్పాటు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణతో పాటు, పంచాయతీల ఆదాయం పెంచేందుకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమయ్యే స్థలాలను పరిశీలించినట్లు వివరించారు. అనంతరం ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో హరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇసుక కోసం పాట్లు




లోడింగ్ కోసం వేచియున్న ట్రాక్టర్లు

- సమీపంలోనే ఉన్నా ఫలితం పూజ్యం
- ట్రాక్టర్ల యజమానుల ఆందోళన

చేజర్ల: మండలంలో సుమారు 30 కిలోమీటర్లకు పైగా పెన్నానది పరివాహక ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో దాదాపు 15 గ్రామాలకు పైగా ఉండగా, వీటిలో పది గ్రామాల నుంచి ఇసుక తీసుకువెళ్లేందుకు వీలుంటుంది. అయితే భూగర్భ జలవనరుల శాఖ అధికారులు 20 కిలోమీటర్ల దూరం లోని మాముడూరు గ్రామం సమీపంలో మాత్రమే ఇసుక సేకరించేందుకు అనుమతిం చారు. గతంలో కోటితీర్థం, ఉలవపల్లి, పెరుమళ్ళపాడు, కొలపనాయుడుపల్లి సమీ పంలో ఇసుక తవ్వకాలకు అనుమతించే వారు. ప్రస్తుతం ఆప్రాంతంలో అనుమతిం చకపోవడంతో కోటితీర్థం, కాకివాయి, ఆదురుపల్లి, తదితర ప్రాంతాల నుంచి మాముడూరుకు కనీసం 40 కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సి వస్తోంది. అయితే కిలోమీటరు దూరంలో ఇసుక ఉన్నా 40 కిలోమీటర్లు ఎలా వెళ్లాలని ట్రాక్టర్ల యజమానులు విమర్శిస్తున్నారు. పెరుమళ్ళపాడు సమీపం లో పెన్నానదిపై నూతనంగా నిర్మించిన వంతెన సమీపంలోని అప్పారావుపాళెం నుంచి ఇసుక తీసుకునేందుకు వీలుంది. అయితే పొదలకూరు, చేజర్ల మండలాలతో పాటు ఆత్మకూరు, ఏఎస్‌పేట మండలాల నుంచి ట్రాక్టర్లు ఇక్కడికి వస్తుండడంతో ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ లోడింగ్ చేసే కూలీలు తక్కువగా ఉండడంతో, ట్రాక్టర్ల యజమానులు తమ సొంత కూలీలను తీసుకెళ్లినా వారు అనుమతించడం లేదు. ఒక్కోసారి అక్కడి కూలీలు ట్రాక్టర్ డ్రైవర్లపై కూలీలు తిరగబడుతున్నారని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్ల మధ్య గొడవలు చోటుచేసుకోవడంతో ఆత్మకూరు పోలీసుస్టేషన్ అధికారులు ఇరువురితో సంప్రదించి సమస్యను పరిష్కరించారు. అయితే ప్రస్తుతం ఈ సమస్య మళ్లీ మొదలయిందని అంటున్నారు.

ఇద్దరు కూలీలతోనే లోడింగ్



అప్పారావుపాళెం రీచ్‌లో లోడింగ్ చేసే కూలీలు ఇద్దరు మాత్రమే ఉండడంతో క్యూలో వేచివుండాల్సి వస్తోంది. ఇదేమని అడిగితే మా డ్రైవర్లకు ఎదురుతిరుగుతున్నారు. ఉలవపల్లి, పుట్టుపల్లెల్లో ఇసుక ఉన్నా, అనుమతి లేదంటూ అధికారులు దాడులు చేస్తున్నారు. ఇకనైనా కూలీలు సక్రమంగా లోడింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- అశోక్, ట్రాక్టర్ యజమాని, ఆదురుపల్లి

వేచి ఉండాల్సి వస్తోంది



అప్పారావుపాళెం నుంచి చిత్తలూరుకు రోజుకు ఆరు ట్రిప్పుల దాకా తోలవచ్చు. కూలీలు తక్కువ గా ఉండడం, ట్రాక్టర్లు బారులు తీరడంతో, ఒకటి, రెండు ట్రిప్పులతోనే సరిపెట్టాల్సి వస్తోంది. ఇలాగైతే ట్రాక్టర్‌కు కంతులు కూడా కట్టుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. సమీపంలో ఉండే ఇసుక రీచ్‌లకు అనుమతి ఇవ్వాలి.

- శివయ్య, ట్రాక్టర్ యజమాని, చిత్తలూరు

సమాధానం చెప్పలేకపోతున్నాం



రోజుకు ఐదారు ట్రిప్పులు తోలే వాళ్లం. కూలీల సమస్య కారణంగా, రెండు ట్రిప్పులే అవుతున్నాయి. దీంతో యజమానులకు సమాధానం చెప్పలేకపోతున్నాం. ఇదేమని ప్రశ్నిస్తే మీకు ఇష్టం ఉన్న చోట చెప్పుకోండంటూ దబాయిస్తున్నారు. లోడింగ్ పాయింట్‌లో కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలి.

- యువరాజ్, ట్రాక్టర్ డ్రైవర్, చిత్తలూరు

అనుమతించిన రీచ్‌లలో మాత్రమే సేకరించాలి



అనుమతించిన రీచ్‌లలో మాత్రమే తవ్వకాలు జరపాలి. అనధికారిక రీచ్‌లనుంచి ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను కోర్టుకు అప్పగించాం. అప్పారావుపాళెం రీచ్‌లో కూలీలు ఇబ్బందులు కలిగిస్తే ఫిర్యాదు చేయవచ్చు. అధికారులతో మాట్లాడి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- బాచిరెడ్డి, ఎస్ఐ, చేజర్ల

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

మర్రిపాడు: ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే జరిగిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు పనబాక కృష్ణయ్య, చేవూరు దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబుయాదవ్ అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రచార నిమిత్తం వెళుతూ, శుక్రవారం మర్రిపాడులో విలేఖరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆత్మకూరు నియోజకవర్గానికి రూ.2000 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. సాగు, తాగునీరు అందించేందుకు రూ.1500 కోట్లతో సోమశిల హైలెవెల్‌కెనాల్ మంజూరు చేశారన్నారు. అప్పటి ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ప్రతి ఇంటికి ఏదో రకంగా ఉపయోగపడేలా సంక్షేమ పథకాలను అమలు చేసి ఆదుకున్నారని తెలిపారు. బీజేపీ, టీడీపీ, వైసీపీ, వామపక్షాల తీర్మానంతోనే రాష్ట్ర విభజన జరిగిందన్న విషయం ప్రజలు తెలుసుకోలేకపోతున్నారని వాపోయారు. జిల్లాలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీ పురోగతికి సిద్ధపడుతున్నామన్నారు. కేంద్రప్రభుత్వంలో ఉన్న నరేంద్రమోదీ కరెన్సీ కష్టాలతో పాటు, జీఎస్‌టీతో ఎదురవుతున్న సమస్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో పసుపు కుంభకోణంలో స్థానిక ఎమ్మెల్యే చేతివాటం ప్రదర్శించి విమర్శలు ఎదుర్కొన్నారన్నారు. పసుపు కుంభకోణంలో చేతులు తడిపిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.



విలేఖరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

పుస్తకాలు ప్రగతికి సోపానాలు

అనంతసాగరం: పుస్తకాలు ప్రగతికి సోపానాలని, చిన్ననాటి నుంచే విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ నారాయణరావు తెలిపారు. శుక్రవారం ఆయన అనంతసాగరంలోని ఎస్సీ ప్రాథమికపాఠశాలలో గ్రంథాలయాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.సెలవు దినాల్లో గ్రంథాలయానికి రావాలని విద్యార్థులను కోరారు. ప్రధానోపాధ్యాయుడు వేము పెంచలయ్య, ఉపాధ్యాయుడు సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలసాహిత్యంపై అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్

మరుగుదొడ్డితో ఆరోగ్యం

ఏఎస్‌పేట: ప్రతి ఇంటిలోను మరుగుదొడ్డి నిర్మించుకుని వినియోగించుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని రెమెడీ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ జె.జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని రాజవోలు ఎస్టీ కాలనీలో మరుగుదొడ్డి వినియోగంపై అవగాహన కల్పించారు. హైజీన్ ఎడ్యు కేటర్ సుమతి మాట్లాడుతూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

బెల్టు దుకాణాలపై ఆకస్మిక దాడులు!

సంగం: మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ స్పెషల్ పార్టీ సిబ్బంది గురువారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించి, భారీగా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన మద్యం బాటిళ్లతోపాటు ముగ్గురు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని నెల్లూరుకు తరలించారు. ఆ మేరకు స్పెషల్ పార్టీ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



గ్రామోత్సవంలో సీతారాములు

ఏఎస్‌పేట: చౌటబీమవరం గ్రామం యలమవీధి లోని శ్రీరాముల ఆలయంలో గురువారం రాత్రి సీతారాము ల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలను పూలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ కళ్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామ వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఆత్మకూరు: పట్టణంలోని వందూరుగుంట గిరిజనకాలనీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు షేక్ అహమద్‌బాషా ఆధ్వర్యంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పని చేస్తూ బదిలీ అయిన ఆర్.వి.మధుసూదనరావు, అల్లంపాటి వెంకటేశ్వర్లు విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయడంతో పాటు పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. వారి సేవలను అభినందించారు. అనంతరం వారికి పూలమాలలు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు శివరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ సభ్యులు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ

అనంతసాగరం: మండలంలోని పలు పాఠశాలలోని ఉపాధ్యాయులు బదిలీ కావడంతో శుక్రవారం రిలీవ్ ఆర్డర్లు తీసుకున్నారు. సోమశిల ఉన్నత పాఠశాలలో ఏకంగా ఏడుగురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు.

ప్రతి చిన్నారికి ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి

ఆత్మకూరు: ప్రాణాంతకరమైన మీజిల్స్, రూబెల్లా రెండు వ్యాధులను ఒకే టీకాతో నిర్మూలించవచ్చని మహిమలూరు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి షేక్ జావీద్ తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని గురుకుల పాఠశాల, వెస్ట్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, గాయత్రి స్కూల్, కాశీనాయన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యఆరోగ్య సిబ్బంది 11 జట్లుగా 18 రోజులుగా వ్యాక్సినేషన్ చేస్తున్నారన్నారు. 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలందరికీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాల న్నారు. ఏఎన్ఎంలు బషీరా, భూదేవి, రాఘవ రాణి, ఎస్.గీత, అనురాధ, నాగేశ్వరి, జి.గీత, సూపర్‌వైజర్ ఎస్.సుధాకర్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎస్‌పేట: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో హెల్త్ సీహెచ్‌వో సుగుణమ్మ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు.



సంగం: విద్యార్థినులకు టీకా వేస్తున్న సిబ్బంది

సంగం: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకుఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకోండి సారూ..

ఏఎస్‌పేట: తమ స్థలాలతో పాటు, శ్మశానాన్ని సైతం కొందరు ఆక్రమిస్తున్నారని మండలంలోని శ్రీకొలను గ్రామానికి చెందిన దళితులు ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజుకు ఫిర్యాదు చేశారు.

చాలా కాలంగా తమ అనుభవంలో ఉన్న భూమిని బీసీ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని, ఆ స్థలంలో తాము నివాసాలు ఏర్పాటు చేసుకోవాలనుకుంటు న్నామని, వారిని అడ్డుకుని ఆ స్థలాలు తమకు ఇవ్వాలని కోరారు. ఎస్సీ కాలనీలోని శ్మశాన స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని గడ్డివాములు వేసుకున్నారని, దీంతో అంత్యక్రియలు నిర్వహించడం ఇబ్బందిగా మారిందని, అంచెలంచెలుగా శ్మశానాన్ని పూర్తిగా ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ భూమిలో గృహాలు నిర్మించరాదని, ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వారికి తెలియజేశారు. శ్మశానం విషయం విచారించి ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యాసామగ్రి వితరణ

అనంతసాగరం: పాతదేవరాయపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 140 మంది విద్యార్థులకు శుక్రవారం అదే గ్రామానికి చెందిన అక్షయ్ పుట్టినరోజు సందర్భంగా తోరణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేట్లు, గ్లాసులు, పెన్నులు, పెన్సిళ్లు, నోటుపుస్తకాలు అందచేశారు. ఈ సందర్భంగా అక్షయ్‌కు, తల్లిదండ్రులను ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యుడు ఇంద్రాసేనరెడ్డి అభినందించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్థానికులు పి.సుబ్బారెడ్డి, ప్రసాద్, ఖాజామొహిద్దీన్, తోరణం పౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంగం: తిరుమనతిప్ప ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంగం గ్రామానికి చెందిన దాత వేమా మల్లికార్జునరావు విద్యా సామగ్రి వితరణ చేశారు. పాఠశాలలో ఎక్కువ మంది పేద విద్యార్థులున్నారని, ఉపాధ్యాయులు విన్నవించడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐజాక్ దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేంద్ర, సురేఖ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని చేడిమాల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం వేణుంబాకం గ్రామానికి చెందిన కుమార్, సాయికుమార్ మోటారుసైకిల్‌పై వెళుతుండగా చేడిమాల గ్రామం మలుపు వద్ద మోటారుసైకిల్ అదుపు తప్పి పడింది. దీంతో కుమార్, సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 సిబ్బంది గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పోస్టాఫీసులో ఫిలటెలి ఎగ్జిబిషన్



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ రాజు

గూడూరు(టౌన్): స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో శుక్రవారం ఫిలటెలి ఎగ్జిబిషన్ కమ్ సేల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ సూపరింటెండెంట్ వై రాజు మాట్లాడుతూ స్టాంపుల సేకరణ అలవాటునే ఫిలటెలి అంటారన్నారు. అన్ని హాబీలలో కెల్లా ఫిలటెలి కింగ్ ఆఫ్ హాబీస్‌గా పిలుస్తారన్నారు. స్టాంపుల సేకరణ వలన మానవుని మానసిక వికాసం పెరుగుతుందన్నారు. ప్రపంచంలో తొలి పోస్టేజీ స్టాంపును 1840 మే 6వ తేదీన గ్రేట్ బ్రిటన్‌లో పెన్నిబ్లాక్ పేరుతో విడుదల చేశారన్నారు. మన దేశంలో 1852లో సింధ్ ప్రాంతంలో డాక్ పేరుతో విడుదల చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా వినియోగదారులు తమ కిష్టమైన ఫోటోలను తపాల స్టాంపుల రూపంలో పొందే అవకాశాన్ని తపాల శాఖ మై స్టాంపు రూపం లో పొందే అవకాశాన్ని కల్పించిందన్నారు. అనంతరం వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు రవికుమార్, అనిల్‌కుమార్, గురునాథరావు, మధుసూదన్‌రావు, ఆదిశంకర కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు


ప్రత్యేక అలంకారంలో రాజరాజేశ్వరి దేవి

గూడూరు: శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలో అమ్మవార్ల ఆలయాలలో శుక్రవారం ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. మహిళలు వేకువనే లేచి స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని వ్రతాలలో పాల్గొన్నారు. స్థానిక నారాయణమ్మ పేరంటాళ్ల దేవస్థానంలో అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకుని సామూహిక వ్రత పూజలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక రాజ రాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించి సామూహిక కుంకుమ పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరి, గంగమ్మదేవస్థానం, మహాలక్ష్మమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక ఆంధ్రమహిళా మండలి కార్యాలయంలో ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక వ్రత పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, విష్ణువందన, ప్రభారెడ్డి, సౌందర్యమ్మ పాల్గొన్నారు.

చిల్లకూరులో...
మండలంలోని తూర్పుకనుపూరు ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో ఉంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అలంకరణలో ఉంచి వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు.

'బెల్టు'పై ఉక్కుపాదం : ఇన్‌చార్జి ఈఎస్


మాట్లాడుతున్న ఎక్సైజ్ ఇన్‌చార్జి ఈఎస్ కుమరేశ్వరన్

గూడూరు(టౌన్): డివిజన్ పరిధిలో మద్యం బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపామని ఎక్సైజ్ ఇన్‌చార్జి ఈఎస్ కుమరేశ్వరన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ సీఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మద్యం బెల్టుదుకాణాలను ఏరివేస్తున్నామన్నారు. గ్రామాలలో ఎవరైనా మద్యం బెల్టు దుకాణాలు నడిపితే స్థానిక కార్యాలయాలకు సమాచారం అందించాలన్నారు. బెల్టు దుకాణాల మూసివేతకు ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. నూతనంగా అందుబాటులో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అక్రమ మద్యం అమ్మకాలను నిరోధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రసాద్‌రెడ్డి, జలీల్, విజయలక్ష్మి, శ్రీధర్‌బాబు, ఖాజార్ అహ్మద్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన విద్యాశాఖ అధికారులు

గూడూరు(రూరల్): మండలంలోని నెల్లటూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం బదిలీపై వెళుతున్న 8 మంది ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, జీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో 8 ఏళ్ల పనిచేసిన ఉపాధ్యాయులు సుధాకర్, శ్రీనివాసులు, మోహన్, వెంకటేశ్వర్లు, రమణయ్య, ఎలీషాబాబు, ప్రసాద్, కే వెంకటేశ్వర్లులు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడంతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడిందన్నారు. దీంతో తమ క్లబ్ ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న వీరిని సన్మానించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఇస్మాయిల్, ఎంఈవోలు సూర్యనారాయణ, మధుసూదన్‌రావు, క్లబ్ సభ్యులు కడివేటి చంద్రశేఖర్, రమణయ్య, రాజేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో అవగాహన సదస్సు

గూడూరు: స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు వైర్‌లెస్ పవర్ ట్రాన్స్‌ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల మేనేజ్‌మెంటు సెక్రటరీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోర్చుగల్‌లోని పోస్ట్‌డాక్టరల్ రీసెర్చ్ ఫెలో సిస్టెక్ ఆర్‌అండ్‌డీ డాక్టర్ కిషోర్ నాయక్ మూడే మాట్లాడుతూ వైర్‌లెస్ విద్యుత్ వ్యవస్థలో ట్రాన్స్‌మీటరు, రిసివర్ల మధ్య విద్యుత్ అయస్కాంత క్షేత్రం ద్వారా విద్యుత్ శక్తిని ప్రసారం చేసేందుకు వివిధ పద్ధతులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


స్వాగతం పలుకుతున్న విద్యార్థిని

కేన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

గూడూరు: మహిళలు కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు రెడ్ క్రాస్ కేన్సర్ ఆసుపత్రి వైద్యురాలు లక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక సునీతా సేవా సంస్థ కార్యాలయంలో మహిళలకు కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహార అలవాట్లు ప్రధానంగా కేన్సర్‌కు దారి తీస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ ప్యాకెట్లలో నిల్వ చేసిన ఆహారాన్ని తీసుకోవడం వలన చిన్న వయసులోనే కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. కూరగాయలను ఒక గంటపాటు నీటిలో నాన బెట్టి అనంతరం వండాలన్నారు. దీంతో కూరగాయలపై పేర్కొని ఉండిన క్రిమిసంహారక అవశేషాలు చాలా వరకు తొలగిపోతాయన్నారు. మార్కెట్‌లో దొరుకుతున్న పండ్లు సైతం సరిగా లేవన్నారు. మహిళలు అవగాహన పెంచుకుని కేన్సర్ బారిన పడకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్యకుమారి, సంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జోసిలా

చిల్లకూరు: ఎమ్మార్ వ్యాక్సిన్ వేసే అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఐసీడీఎస్ అధికారిణి జోసిలా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎమ్మార్ వ్యాక్సిన్‌పై అవగాహన పెంచాలన్నారు. వ్యాక్సిన్ వేసిన తరువాత ఆయా కేంద్రాల్లో వారిని 20 నిమషాలు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉంచాలన్నారు. చిల్లకూరు పీహెచ్‌సీ పరిధిలో 3180 మంది చిన్నారులు ఉండగా 2,487 మందికి వ్యాక్సిన్ వేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమేష్, బ్రిజిత, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాగైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	నేనే రాజు నేనే మంత్రి
సుందరమహల్:	జయ జానకి నాయక
సీవీ :	ఫిదా
సంగం:	లై

కోట

ఆర్ఆర్‌టి :	ఫిదా
రామ్‌రాజ్:	జయ జానకి నాయక
అరుణ:	నేనే రాజు నేనే మంత్రి

సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్ఈ

వాకాడు: మండలంలోని కొండూరు వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ట్రాన్స్‌కో ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆయనను కలిసి విద్యుత్ సరఫరా సమస్యపై నివేదించారు. 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారి వద్దకే విద్యుత్ సేవలు అందించే విధంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు.

వెంటాడుతున్న కార్యదర్శుల కొరత!

గ్రామాల్లో కార్యదర్శుల కొరత వెంటాడుతోంది. దీంతో పలు గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. దేశాభివృద్ధిలో గ్రామాలదే కీలకపాత్ర అంటూ పాలకులు ఉపన్యాసాలు ఇస్తున్నారే తప్ప గ్రామాభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. పల్లెల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర. అయినప్పటికీ పూర్తి స్థాయిలో కార్యదర్శులను నియమించకపోవడంతో గ్రామాల అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందాగా తయారైంది.

\- వాకాడు

వాకాడు మండలంలో 67 మజరా గ్రామాలను కలుపుకుని 19 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పాలన నిమిత్తం ఒక్కో పంచాయతీకి ఒక్కో కార్యదర్శిని ప్రభుత్వం నియమించాలి. అయితే మండలంలోని 19 పంచాయతీలకు గాను ఆరుగురు కార్యదర్శులను మాత్రమే నియమించారు. అంటే 50 శాతం మంది కూడా కార్యదర్శులు లేరంటే పరిస్థితి ఏరకంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పూర్తి స్థాయిలో కార్యదర్శులు లేకపోవడంతో ఒక్కో కార్యదర్శి రెండు నుంచి నాలుగు పంచాయతీల బాధ్యతలను చూడాల్సి వస్తోంది. పని భారం పెరగడంతో వారు ఇబ్బందులు పడుతుండగా పనుల్లో జాప్యం నెలకొంటుందన్న ఆరోపనలు వినిపిస్తున్నాయి. కార్యదర్శులకు ప్రభుత్వం అనేక బాధ్యతలు అప్పగించడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పింఛన్ల పంపిణీ, గ్రామసభల పర్యవేక్షణ, పన్ను వసూళ్లు, పారిశుధ్య పనులు, గ్యాస్ కనెక్షన్‌లు, విద్యుద్దీపాల ఏర్పాటు, జనన మరణాల నమోదు, ఎంపీడీవోలతో సమావేశాలు, ఓడీఎఫ్ తదితర కార్యక్రమాలను పర్యవేక్షించడం కార్యదర్శుల బాధ్యత. దీంతో పాటు అదనపు బాధ్యతలతో నా నా అవస్థలకు గురవుతున్నారు. అదే విధంగా పని భారం కంటే వీరిపై రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువవడం తో ఇక్కడ పని చేయలేకున్నామని వాపోతున్నా రు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తి స్థాయిలో కార్యదర్శులను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. అధిక పని భారంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెంతుతున్నారు. మండల స్థాయిలో జరిగే ప్రతి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమంలో కార్యదర్శులను భాగస్వామ్యులు గా చేర్చుతున్నారు. గతంలో కొత్త పింఛన్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలలో కార్యదర్శులదే పూర్తి బాధ్యత. ప్రస్తుతం అన్ని అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక నాయకుల ఆదేశాలతోనే, వారు చెప్పిన మేరకే పనులు చేయాల్సివ స్తోంది. దీంతో సొంతం గా పనులు చేయలేని పరిస్థితుల్లో కార్యదర్శు లు మౌనంగా ఉండాల్సి వస్తోంది. ప్రతి పనిలోనూ రాజకీయ నాయకులు ప్రమేయం తప్పని సరిగా పాటించాల్సి ఉంది. కాదంటే అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇక్కడ పనిచేయలేకున్నామని కొందరు కార్యదర్శులు వాపోతున్నారు.


వాకాడులో గుంతలమయంగా వీధులు


దుగ్గవరంలో వెలగని వీధిలైటు

ప్రతిష్ఠాత్మకంగా సంకల్ప 'సిద్ధి'


ఎంపీడీవో బ్రహ్మయ్యతో చర్చిస్తున్న తారక ప్రసాద్

కోట: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంకల్ప సిద్ధి యాత్ర ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆ పథకం ఫీల్డ్‌పబ్లిసిటీ ఆఫీసర్ తారక్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమంపై శుక్రవారం ఎంపీడీవో బ్రహ్మయ్యతో ఆయన చర్చించారు. ఈ నెల 31న మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలోని స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించి ప్రధాని నరేంద్రమోదీ సందేశాన్ని వినిపిస్తామన్నారు. ఇందు కోసం అధికారులను అప్రమత్తం చేశామన్నారు.

పక్కాగా వయోజనుల పరీక్షలు


సామాగ్రిని పంపిణీ చేస్తున్న ఈఓపీఆర్‌డీ తదితరులు

కోట : సాక్షర భారత్ కేంద్రాల్లో వయోజనులకు అర్హత పరీక్షలు పక్కాగా నిర్వహించాలని పంచాయతీ విస్తరణ అధికారి కల్పన, మండల సాక్షర భారత్ కోఆర్డినేటర్ సుజనప్రియ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాక్షర భారత్ గ్రామ కోఆర్డినేటర్లకు పరీక్ష సమగ్రిని అందజేశారు. ఈ నెల 19వ తేదీన మండలంలోని 21 పంచాయతీల్లోని సాక్షర భారత్ కేంద్రాల్లో 820 మంది వియోజనులకు అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వయోజనులకు అర్హత పత్రాలు అందజేస్తామన్నారు. ఈ పరీక్షలు ఎలాంటి లోపాలు జరుగకుండా అన్ని చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఎక్కడైనా లోపాలు జరిగితే సంబంధిత కోఆర్డినేటర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

● మూడు సిలికా లారీల స్వాధీనం

కోట: మండలంలోని సిద్ధవరం, గోవిందపల్లి గ్రామాల నుంచి సిలికాను అక్రమంగా తరలిస్తున్న లారీలపై శుక్రవారం తెల్లవారుజామున విజిలెన్స్ అధికారి రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెన్నై, బెంగళూరుకు సిలికాను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు.


పట్టుబడిన సిలికా లారీలు

విద్యార్థులకు బస్సు పాస్‌ల పంపిణీ

గూడూరు(రూరల్): మండలంలోని నెల్లటూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యుత్ శాఖలో పనిచేసే శ్రీనివాసరావు దాతృత్వంతో డిప్యూటీ ఈవో ఇస్మాయిల్, ఆర్టీసీ డీఎం అనిల్‌కుమార్‌లు విద్యార్థులకు బస్సు పాసులను అందజేశారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నామమాత్రపు ధరతో బస్సు పాసులను అందజేస్తున్నారన్నారు. విద్యార్థులలో బస్సు పాసులు పొందే విధానం పట్ల అవగాహన లేకపోవడంతో కొంతమంది బస్సు పాసులను పొందలేక అవస్థలు పడుతున్నారన్నారు. విద్యార్థులకు నేరుగా పాఠశాలలోనే దాతల దాతృత్వంతో బస్సు పాసులను అందజేసేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విద్యార్థులకు బస్‌పాసులు అందిస్తున్న డిప్యూటీ ఈవో, ఆర్టీసీ డీఎం

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

చిల్లకూరు: కలువకొండ తిప్పపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహిచారు. భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. ఉదయం సుప్రభాతం, విశ్వేక్సేరాధనం, పుణ్యాహవాచనం, భేరిపూజ, దేవతాహ్వానం, ద్వారతురకా పూజ, నిత్యహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంనంతరం స్వామివారిని పురవీధులలో గజవాహనంపై ఊరేగించారు. ఉభయదాతలుగా వరిదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి గిరిజ, యల్లంటి ప్రభాకర్‌రెడ్డి సులోచనలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

● ఇంటర్వ్యూ



అవగాహన లోపంతోనే ఆసుపత్రి పాలు

● డాక్టర్ రవికుమార్, ప్రభుత్వ వైద్యాధికారి

? రోగులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు.

! రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. అవగాహన లోపంతో కొంత మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

? డెంగ్యూ ప్రభావం ఎలా ఉంది.

! కోట ప్రాంతంలో డెంగ్యూ ఉన్నట్లు తెలిసింది. అయితే రోగులు కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి రాకుండా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడం బాధకరం.

? డెంగ్యూ ఎలా వ్యాపిస్తోంది, దాని లక్షణాలు ఏమిటి.

! ఏడీస్ అనే ఆడ దోమవల్ల డెంగ్యూ వస్తుంది. ఈ దోమ పగటిపూటే కుడుతుంది. దీని ప్రభావం వల్ల చలితోకూడిన జ్వరం, వెన్నుముక నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉంటాయి. వాంతులు, విరోచనాలు కూడా వస్తాయి. శరీరంలో రక్తకణాల శాతం పూర్తిగా తగ్గిపోతుంది.

? దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా చర్యలు తీసుకుంటున్నాం. డెంగ్యూకు సంబంధించిన అన్ని మందులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాయి. ఎలాంటి డోకా లేదు. డెంగ్యూకి 24 గంటలు చికిత్స చేస్తున్నాం.

\- కోట

విద్యార్థి గణనపై నిర్లక్ష్యం వద్దు

తడ : విద్యార్థి గణనపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ ఓఎస్‌టీ కన్సల్టెంట్ డాక్టర్ కే పెంచలయ్య తెలిపారు. శుక్రవారం తడకు వచ్చిన ఆయన స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు, సీఆర్‌పీలు, కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యార్థి గణన 9.16 శాతంతో చివరిస్థానంలో ఉందన్నారు. సక్రమంగా పనిచేయని ఎన్యుమరేటర్లపై చర్యలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో పూర్ణచంద్రరావు, సర్వశిక్ష అభియాన్ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

ఇసుక తరలింపుపై నిఘా పెట్టాలి

● ఆర్డీవో శీనానాయక్



మాట్లాడుతున్న ఆర్డీవో శీనానాయక్

ఓజిలి : ప్రభుత్వ నిర్మాణాలు, ఇతర అవసరాల కోసం తరలించే ఇసుకపై నిరంతరం నిఘా పెట్టాలని నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన తహసీల్దార్ సత్యవతితో సమావేశమయ్యారు. రెవెన్యూ రికార్డుల ప్యూరిఫికేషన్ కార్యక్రమ వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాల పేరుతో ఇసుక అక్రమ తరలింపువంటి వాటిపై నిఘా ఉంచాలన్నారు. రికార్డుల ప్యూరిఫికేషన్ పురస్కరించుకొని లోతైన సమాచారాన్ని విచారించాల్సి ఉందన్నారు. అన్ని వివరాలను పరిగణలోకి తీసుకొని రెవెన్యూ రికార్డులను రూపొందించాలని ఆయన తహసీల్దార్‌కు సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శివయ్య, తహసీల్దారు మైత్రేయ, ఎస్సై రవినాయక్

నాయుడుపేటరూరల్: ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌ల వద్ద నియమించిన సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో శివయ్య అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక నియంత్రణలో భాగంగా జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలను తప్పకుండా అమలు చేయాలని ఆయన సూచించారు. ఈమేరకు ఇసుక రీచ్‌ల వద్ద వీఆర్‌వో, కార్యదర్శులు పర్యవేక్షకులుగా ఉంటారని వారి సహాయకులుగా వీఆర్‌ఏ, ఒక పోలీసు ఉంటున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాలలో మరుగుదొడ్లు, ఎన్టీఆర్ పక్కా గృహాలకు కార్యదర్శులు ఇచ్చిన నివేదిక మేరకు ఇసుకను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రీచ్‌నుంచి తరలించుకెళ్లిన ఇసుక సంబంధిత వ్యక్తులకు చేరుతుందాలేదా అన్న విషయాన్ని కూడా విధులలో ఉన్నవారు పర్యవేక్షణ చేయాల్సివుందన్నారు. రీచ్‌లలో యంత్రాల సాయంతో ఇసుక లోడింగ్ చేయకూడదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మైత్రేయ, ఎస్సై రవినాయక్, డీటీ చంద్రశేఖర్, ఆర్‌ఐలు సిరాజ్, శిరీషా, వీఆర్‌వోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రీచ్‌ల ఇసుక పనికిరాదు

తడ : జిల్లా అధికారులు గుర్తించిన రీచ్‌లలో ఇసుక వాడకానికి పనికిరాదని దీనిపై ఉన్నతాధికారులకు సమాచారమిస్తామని తహసీల్దార్ ఏడుకొండలు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఇసుక రవాణాపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా అధికారులు గుర్తించిన వాటంబేడు, గొల్లలమలుగు, వెలగలవాడు రీచ్‌లలో ఇసుక ఉప్పు స్వరూపంతో కలిగి ఉంటుందని కావున నిర్మాణాలకు పనికిరాదని నిర్ణయించారు. జిల్లా అధికారులకు ఈ రీచ్‌లపై ఉన్న అభ్యంతరాలను తెలియజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్‌తోపాటు ఎస్సై వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రమణయ్య, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మండల అధికారులు

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



16 కలశాలతో శ్రావణశుక్రవారం ప్రత్యేక పూజలు

నాయుడుపేట : శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి విశేష పుష్పాలంకరణ చేశారు. 16 కలశాలతో శ్రావణశుక్రవార విశిష్ట పూజలను వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శ్రావణ శుక్రవార ప్రత్యేక పూజల్లో పాల్గొని వ్రతాలు నిర్వహించారు. ఉభయకర్తలుగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు పెసల జయబాబు, పెసల కిషోర్, పెసల రమేష్ వ్యవహరించారు.

దంతాలను కాపాడుకోండి : జేవీవీ



మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి

చిట్టమూరు : దంతాలను కాపాడుకోవడంలో జాగ్రత్తలు పాటించాలని జనవిజ్ఞాన వేదిక సభ్యుడు బాలకృష్ణారెడ్డి అన్నారు. మల్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన దంత సమస్యలపై అవగాహన సదస్సులో మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆర్ఎంపీ వైద్యుడు అన్వర్‌బాషా సదస్సు నిర్వహించారు. విద్యార్థులు దంతాలను జాగ్రత్తగా చూసుకోవాలని, ఎక్కువగా శీతలపానీయాలను తీసుకోరాదని తెలిపారు. అంతేకాక పళ్ల దెబ్బతింటే కంటి చూపు తగ్గిపోతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, పంటి వైద్యులు కళ్యాణి, తదితరులు ఉన్నారు.

రజకులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

దొరవారిసత్రం : వృత్తిపరమైన కులాల్లో వెనుకబడిపోయిన రజకుల కులానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని రజకుల సంఘం ఉపాధ్యక్షుడు కత్తూరు రమణయ్య కోరారు. శుక్రవారం దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లి గ్రామంలో రజక సంఘ నేతలు పర్యటించారు. ఈ నెల 21వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే రజక హక్కుల పోరాట ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలంటూ స్థానిక రజకసంఘ నాయకుడు పెరత్తూరు సుధాకర్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట డివిజన్ రజకసంఘ నాయకులు అక్కరపాక పొట్టెయ్య తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న రజక సంఘ నేతలు

కన్యకా పరమేశ్వరికి కాసుల అలంకారం

సూళ్లూరుపేట : చిత్రకూటమిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మణ్ణికి కాసుల అలంకారం చేశారు. కన్యకాపరమేశ్వరి వలంటరీ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



దివ్యాంగురాలికి దారిచూపండి

● ఆర్డీవోకు వినతి



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న మస్తానమ్మ

నాయుడుపేటరూరల్: దివ్యాంగురాలిని అయిన నాకు దారి చూపండి... లీజుకి పొలం ఇచ్చి మళ్లీ అదే పొలాన్ని వేరే ఎవరికో విక్రయించారు... నాకు అది తప్ప వేరే జీవనాధారం లేదు.. నాతండ్రి నుంచి ఆ పొలం సంక్రమించిందంటూ ఓజిలి మండలం సగుటూరుకు చెందిన కొట్టు మస్తానమ్మ అనే దివ్యాంగురాలు శుక్రవారం నాయుడుపేట ఆర్డీవోను వేడుకుంది. ఈమేరకు ఆమె వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆర్డీవోకు వినతి పత్రం అందజేసింది. వివరాలు ఇలావున్నాయి... మండలంలోని గ్రద్దగుంట పంచాయతీ పరిధిలోవున్న జోస్యులవారి కండ్రిగ గ్రామానికి చెందిన రాజమ్మ అనే మహిళ వద్ద నుంచి సగుటూరుకు చెందిన కొట్టు వెంకటసుబ్బయ్య 99 సంవత్సరాలకు 2.45 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నారు. అదే భూమిని అనంతర కాలంలో రాజమ్మ వేరే వ్యక్తులకు విక్రయం చేశారు. దీంతో వెంకటసుబ్బయ్య న్యాయం కోసం ఎందరిని ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఈక్రమంలో ఆయన 2014లో మృతి చెందగా ఆయన కుమార్తె అయిన దివ్యాంగురాలు మస్తానమ్మ అప్పటినుంచి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తోంది. శుక్రవారం ఆర్డీవోను కలసిన ఆమె తన గోడును వెళ్లబోసుకుని అన్ని విషయాలు వినతి పత్రంలో పేర్కొనింది. దివ్యాంగురాలికి మద్దతుగా ఏపీ ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ దాసరి, యానాది సమాఖ్య జిల్లా కన్వీనర్ కుడుమల గోపాల్, రెడ్డి సంక్షేమ సంఘ డివిజన్ కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

'వనిత' కార్డులపై ఆర్టీసీ ప్రచారం



ఆర్టీసీ బస్సుపై వనిత కార్డుల ప్రచారం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో అధికారులు వనిత ఫ్యామిలీ కార్డుల ప్రాధాన్యం, పక్షోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఓ ఆర్టీసీ బస్సుచుట్టూ వనిత కార్డులు ఇతర పథకాల వివరిస్తూ బోర్డులుపెట్టి ప్రచారరథంగా గ్రామ గ్రామాన తిప్పుతున్నారు. మైక్ ద్వారా వనితకార్డుల విశిష్టతను తెలుపుతూ అక్కడిక్కడే వనిత కార్డులను విక్రయిస్తున్నారు. ఆర్టీసీ డీఎం ప్రసాద్, ఇతర అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించేస్తున్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగించనున్నట్లు వెల్లడించారు.

సినిమా గైడ్

నాయుడుపేట

సీఎస్‌తేజ	: జయ జానకి నాయక
మురారి :	లై
శ్రీవెంకటేశ్వర	: నేనే రాజు..నేనే మంత్రి

సూళ్లూరుపేట

శ్రీలక్ష్మి :	ఫిదా
ఎస్‌వీఆర్ :	నేనే రాజు..నేనే మంత్రి

నేడు పేటలో కావ్యావిష్కరణ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలో శనివారం డాక్టర్ జనార్దన్‌రావు రచించిన అక్షయ ప్రణుతాక్షరి కవితా ప్రవళిక, అక్షర స్తోత్రాంజలి రచనల ఆవిష్కరణ జరగనుంది. స్థానిక రోటరీ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కావ్యవిష్కరణలో షార్ కంట్రోలర్ రాజారెడ్డి, తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ వై. సుభాషిణి, స్థానిక ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ఆత్రేయ స్మారక కళా పీఠం ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ మహోత్సవం జరగనుంది.

బదిలీ ఉపాధ్యాయులకు ఘనసత్కారం

తడ : బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఘన సన్మానం జరిగింది. మండల పరిధిలోని చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు షేక్ అక్బర్, కేవీ రమణ, పీ శ్రీనివాసులు, జనార్దన్, హైజాక్ సాధు, విజయలక్ష్మి, హరితకు వివిధ ప్రాంతాలకు బదిలీ జరిగింది. ఈసందర్భంగా వారికి పాఠశాల సిబ్బంది ఘనసన్మానం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి సర్పంచ్ రాజారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ వేనాటి జనార్దన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, గ్రామపెద్ద కామిరెడ్డి, పాండురంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ అడిగాడు.. బైక్ కొట్టేశాడు..!

తడ : తను వెళుతున్న బైక్‌పై లిఫ్ట్ అడిగాడనే మానవతా ధృక్పదంతో ఎక్కించుకుంటే మాయమాటలు చెప్పి బైక్ ఎత్తుకెళ్లిన ఘటన తడలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన పవన్‌కుమార్ ఆసుపత్రిలో పని నిమిత్తం తన బుల్లెట్ వాహనంపై గురువారం చెన్నైకి వెళ్లాడు. పని ముగించుకుని అర్ధరాత్రి ఒంగోలు తిరుగుప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో పన్నంగాడు వద్ద ఓ వ్యక్తి లిఫ్ట్‌కావాలంటూ కోరడంతో అతడిని ఎక్కించుకున్నాడు. కొద్దిసేపటి తరువాత అతడినే బైక్ నడపాల్సిందిగా చెప్పి పవన్‌కుమార్ వెనుక కూర్చొని ప్రయాణించసాగాడు. పూడి గ్రామ జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి బైక్ యజమానిని కిందకుదింపి మాటల్లో పెట్టి చూపు మరల్చి నిందితుడు బైక్‌తో పరారయ్యాడు. దీంతో ఖంగుతిన్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కశ్యప పథకం ద్వారా పింఛన్లు



మాట్లాడుతున్న సుధీర్

నాయుడుపేట : రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ కశ్యప పథకం ద్వారా 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెల పింఛన్లు అందుతాయని నాయుడుపేట కోఆర్డినేటర్ అవధానం సుధీర్ తెలిపారు. నాయుడుపేటలో శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ లబ్ధిదారులు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా వృద్ధులు 60ఏళ్లు నిండినట్లు ధ్రువీకరణ పత్రాలు ఆధార్‌కార్డుతో apbrahmin.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకం పేద బ్రాహ్మణులకు మాత్రమేనని ఎన్టీఆర్ భరోసా, పింఛన్ దారులకు, ప్రభుత్వ పింఛన్ దారులకు ఈ పథకం వర్తించదన్నారు.



ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు?

- మంత్రి వరమిచ్చినా అభివృద్ధి శూన్యం
- సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి మార్గం దుస్థితి

సూళ్లూరుపేట : సాక్షాత్తు ఆర్‌అండ్‌బీ మంత్రి వరమిచ్చారు.. ఆ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయమని ఆదేశించారు. అయినా ఆ రోడ్డు తీరు మారనేలేదు... మరింత అధ్వానమైపోయింది. సూళ్లూరుపేట నుంచి శ్రీకాళహస్తికి మన్నారుపోలూరు మీదుగా ఓ ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. జిల్లా పరిధిలో 6.5 కిలో మీటర్లు ఉన్న ఈరోడ్డు గతుకులమయమై సైడు బర్మలు లేక అధ్వానస్థితిలో ఉంటోంది. కొణ్ణంబట్టు నుంచి చిత్తూరుజిల్లా పరిధిలో ఉన్న రోడ్డు సక్రమంగా ఉన్నా నెల్లూరుజిల్లా పరిధిలో ఉన్న రోడ్డు అస్తవ్యస్తంగా ఉంటుంది. ఈ విషయాన్ని గత ఫ్లెమింగో పండుగకు విచ్చేసిన ఆర్‌అండ్‌బీ మంత్రికి ఎమ్మెల్సీ వాకాటి విన్నవించారు. దీంతో ఆయన తక్షణం డబుల్‌రోడ్డు మంజూరు చేస్తున్నానంటూ ప్రకటించేశారు. కానీ ఈ రోడ్డు తీరుమాత్రం మారనేలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు 11 కోట్ల రూపాయలకు అంచనాలు రూపొందించి పంపినా ఎక్కడ గొంగలి అక్కడే అన్న చందంగా ఆ ఫైల్ ఉండిపోయింది. స్థానిక టీడీపీ నేతలు నిధులు మంజూరు చేయించి రోడ్డు బాగుచేయించాలన్నా విషయాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఈ రోడ్డుతో అవస్థలు పడాల్సి వస్తుంది.

సిమెంట్‌రోడ్డుకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ నూలేటి, తదితరులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట 5వ వార్డులో 10 లక్షల రూపాయల సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఛైర్ పర్సన్ నూలేటి విజయలక్ష్మి భూమిపూజ చేశారు. 13వ ఆర్థికసంఘం నిధులతో ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజగోపాలరావు, డీఈ నాగేశ్వరరావు, కౌన్సిలర్ కాటయ్య పాల్గొన్నారు.

మొక్కుబడిగా టీడీపీ సమావేశం

- పలువురు నేతల గైర్హాజరు
- రెండు తీర్మానాలతో సమావేశం ముగింపు



టీడీపీ సమన్వయ కమిటీ సమావేశానికి హాజరైన నేతలు

సూళ్లూరుపేట : తెలుగుదేశంపార్టీ అధికారంలో ఉన్నా... ఆ పార్టీ సమావేశాలు మాత్రం సూళ్లూరుపేటలో మొక్కుబడిగా జరుగుతున్నాయి. నియోజకవర్గస్థాయి సమన్వయకమిటీ సమావేశాన్ని సైతం శుక్రవారం ఆపార్టీ నేతలు మమా అంటూ నిర్వహించారు. నేతలు సైతం మొక్కుబడిగా పాల్గొన్నారు. పలువురు నేతలు గైర్హాజరయ్యారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరసారత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తీర్మానాలు సైతం మొక్కుబడిగా చేశారు. సెప్టెంబరు 3నుంచి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించారు. అలాగే కాళంగి, స్వర్ణముఖి నదుల్లో చెక్‌డ్యామ్‌లు కట్టాలని తీర్మానించారు. అంతే పార్టీ సమావేశం ముగించివేశారు. వేనాటి రామచంద్రారెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, నూలేటి విజయలక్ష్మి, కలికి మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఆ పార్టీలో ముఖ్య నేతలైన హర్షవర్ధన్‌రెడ్డి, గూడూరు రఘునాథరెడ్డిగాని, గంగాప్రసాద్ వంటి నేతలుకాని, వారి అనుచర వర్గం కాని హాజరు కాకపోవడం ఈ సమావేశం కొంతమేర వెలవెలబోయింది.

ఓజిలిలో ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడతున్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సురేష్‌బాబు

ఓజిలి: ఓజిలి మండలం రాచపాళెంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ (ఎన్‌ఆర్‌ఈజీఎస్) పనులను శుక్రవారం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సురేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఫామ్ పాండ్ పనులు, మైనర్ ఇరిగేషన్ పనులను కూడా పరిశీలించారు. కూలీలకు అందుతున్న వేతనం, ఇతర సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఖచ్చితమైన ప్రమాణాలతో ఉపాధి పనులను కొనసాగించాలని క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులకు సూచించారు. మండలంలో జరుగుతున్న పనుల వివరాలు, అంచనా వ్యయం వంటి విషయాలను ఏపీవో చిన్నయ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వలసలను నివారించి వారికి ఉపాధి చూపేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని దీనిని దుర్వినియోగం చేయరాదని సూచించారు. కూలీలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా యంత్రాంగా పనిచేయాలన్నారు. ఎక్కడా యంత్రాలను ఉపయోగించడం వంటి చర్యలు తీసుకోరాదని తెలిపారు. ఆయన వెంట ఉపాధిహామీ సిబ్బంది ఖలీల్ తదిరులున్నారు.

వయోజనుల పరీక్ష నిర్వహణపై సమావేశం

చిట్టమూరు : మండలంలోని సాక్షర్ భారత్ వయోజనులకు నిర్వహించే ఎన్ఐడీఎస్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీడీవో ఎంఎల్ నారాయణమ్మ ఈ సమావేశంలో పాల్గొని పరీక్షల నిర్వహణపై పలు సూచనలు అందజేశారు. సాక్షరభారత్ కేంద్రాల్లోని 802 మంది వయోజనులు ఆదివారం పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరితో పాటు గత ఏడాది పరీక్షల్లో సీ గ్రేడ్‌లో వచ్చిన వయోజనులకు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం సురేష్‌బాబు, సూపర్‌వైజర్ తదితరులు ఉన్నారు.

దేవాలయాలను పునర్నిర్మించాలి

- ఆర్డీవోకు విశ్వహిందూ పరిషత్ సభ్యుల వినతి



ఆరీవోకు వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నేతలు

నాయుడుపేట: పవిత్ర పుష్కరాల సందర్భంగా విజయవాడ నగర పరిధిలో రహదారుల విస్తరణ పేరుతో కూల్చివేసిన హిందూ దేవాలయాలను వెంటనే పునఃనిర్మించాలని నాయుడుపేట విశ్వహిందూపరిషత్ సభ్యులు శుక్రవారం ఆర్డీవో శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఏడాది క్రితం కూల్చివేసిన దేవాలయాలను పునఃనిర్మించని కారణంగా విజయవాడలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారికి మద్దతుగా నాయుడుపేట విశ్వహిందూ పరిషత్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కూల్చివేసిన దేవాలయాల స్థానంలో వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుని దేవాలయాల నిర్మాణం చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీహెచ్‌పీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఎమ్మార్ టీకాలు

ఓజిలి: ఓజిలి మండలం పెద్దపరియ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరిమేనిపాడు గిరిజన కాలనీలో శుక్రవారం ఎమ్మార్ టీకాలపై అవగాహన, పారిశుధ్యం వంటి విషయాలను వైద్యసిబ్బంది తెలిపారు. అనంతరం పెద్దపరియలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు టీకాలు వేశారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎన్ఎం సంపూర్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్ కేవీ రమణయ్య, ఆశ వలంటీరు ప్రసూన్న, అంగన్‌వాడీ వర్కర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

కాగితాలపూరులో ఎన్ఎస్ఎస్ శిబిరం

మనుబోలు : మండలంలోని కాగితాలపూరు గ్రామంలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) శిబిరంను శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మౌలాలి మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్రామంలో శిబిరం నిర్వహిస్తామన్నారు. గ్రామంలోని జనాభా సర్వే, కాలువలు, వీధుల శుభ్రత, పచ్చదనం పెంపు తదితర సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే విద్యార్థులకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. ప్రతి ఏటా మండలంలోని ఒక ఊరులో జాతీయ సేవా పథకం కింద శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూ



పచ్చిరొట్ట విత్తనాలు

వినియోగించు కోండి

జ్యోత్స్న, మండల ఏవో

?: రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నారా

!: రైతులకు బయోమెట్రిక్ యంత్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నాం. అవసరమైన రైతులు వారి పట్టాదారు పాస్‌పుస్తకాలు, అడంగళ్, 1బి, ఆధార్‌కార్డు జెరాక్స్‌లు తీసుకొని రావాల్సి ఉంది. వేలిముద్రలు సేకరించి విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నాం.

?: ఎన్ని టన్నుల పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు

!: మండలానికి మంజూరైన రెండు క్వింటాళ్ల జీలగలు, 6 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలను దాదాపు 50శాతానికి పైగా పంపిణీ చేశాం.

?: బయోమెట్రిక్ యంత్రంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా

!: గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నిర్వహించే సభల్లో రైతులకు బమోమెట్రిక్ యంత్రాల పనితీరుపై అవగాహన కల్పిస్తున్నాం.

?: వర్షాకాల నేపథ్యంలో పంటలు సాగుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నారా

!: మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో డెల్టా రైతులకు నీటి యాజమాన్య పద్ధతిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. నీటిని పొదుపుగా వాడుకోవడం వలన పంటలు అధిక దిగుబడి సాధించవచ్చని తెలియచేస్తున్నాం.

- **తోటపల్లిగూడూరు**

నోళ్లు తెరుచుకున్న బోర్లను మూసేయండి

ఉపాధ్యాయుల ప్రచారం

పొదలకూరు: నోళ్లు తెరుచుకొని చిన్నారులను కబలిస్తున్న బోర్లను వెంటనే పూడ్చి వేయాలని కోరుతూ మండలంలోని అమ్మవారిపాళెంలో ఉపాధ్యాయులు శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఇటీవల కాలంలో తెరిచి ఉన్న బోరు బావుల్లో పడి చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై అమ్మవారిపాళెం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గిరిబాబాబు తన కర్తవ్యంగా పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. తెరుచుకొని ఉన్న బోరు బావుల కలిగే ప్రమాదాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో తెరచి ఉన్న బోర్లను మూసివేయండి, చిన్నారుల ప్రాణాలను కాపాడండి అంటూ నినాదాలు చేశారు. ప్రతి ఇంటికీ కరపత్రాలు పంపిణీ చేసి, రైతు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇంటి గోడల మీద పోస్టర్లు అంటించారు. ఉపాధ్యాయుడు గిరిబాబు తనసొంత నిధులతో కరపత్రాలు, గోడపత్రికలను అచ్చేవేయించి గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన పొదలకూరు మండలంలో తీవ్ర వర్షాభావం కారణంగా ఎండి పోతున్న పంటలను కాపాడుకోవాలని పెద్ద సంఖ్యలో బోర్లు వేశారని అన్నారు. వాటిలో ఎక్కువ వాతం నీరు లభ్యత కాకపోవడంతో మూసివేయకుండా అలాగే వదలివేయడంతో చిన్నారులు అందులో పడి ప్రాణాలమీదకు తెచ్చుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల బోర్లు వేసిన రైతులే వాటిని మూత వేసే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కే శ్రీనివాసులు, గ్రామ నాయకులు కోదండరామనాయుడు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు, విద్యార్థులు

వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ



పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న అంజయ్య, సేవా సంఘం సభ్యులు

పొదలకూరు: మదర్ మహిళా సేవా సంఘం మొదటి వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని తాటిపర్తి ఉద్ద నున్న వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికారప్రతినిధి పీ అంజయ్య చేతులు మీదుగా పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సేవా సంఘం అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ మాట్లాడుతూ భవిష్యత్తులో తమ సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళాభ్యున్నతితోపాటు, సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మండల ఉపాధ్యక్షుడు మన్నవరపు రవికుమార్ యాదవ్, వైసీపీ విద్యార్థి విభాగం సర్వేపల్లి నియోజకవర్గ అద్యక్షుడు అమరా శివకుమార్, మహిళా మండల సభ్యులు తాటిపర్తి శేషమ్మ, అడపాల రాధిక, అంకమ్మ, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్రను రద్దుచేయాలి

మనుబోలు : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు భోజనం అందించే అక్షయపాత్ర సంస్థను ప్రభుత్వం రద్దుచేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం. సునీల్ మాట్లాడుతూ నాలుగు మండలాలకు భోజనం అందించే అక్షయపాత్ర సంస్థ నాసిరకం భాజనం పిల్లలకు తెచ్చి పెడుతోందన్నారు. రాత్రి 2గంటలకు వండిన అన్నం తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ బోజనంను చాలామంది తినడం లేదన్నారు. పాత పద్ధతిలోనే మధ్యాహ్న భోజన బాధ్యతను ఏజెన్సీలకు ఇవ్వాలన్నారు. దీని ద్వారా చాలా మంది పొదుపు మహిళలు ఉపాదిపొందేవారన్నారు. అక్షయపాత్ర సంస్థను రద్దు చేయకపోతే వెంకటాచలంలోని సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ సర్వేపల్లి ఇన్‌చార్జి శ్రీకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడు దిలీప్‌గా గుర్తింపు

వెంకటాచలం: వెంకటాచలం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై మృతిచెందినది వెంకటాచలం ఇందిరమ్మ కాలనీకి చెందిన వావిళ్ల దిలీప్(20) గా గుర్తించారు. బుధవారం వెంకటాచలం వద్ద రైలు పట్టాలపై 20 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి పోస్టువర్టం కోసం నెల్లూరుకు తరలించారు. రైల్వే పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మృతుడు దిలీప్‌గా స్థానికులు గుర్తించారు. దిలీప్ తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉండగా మృతుడు నెల్లూరు ఆర్టీసీలో గ్యారేజీలో మెకానికల్ విభాగంలో అప్రెంటీస్‌షిప్ చేస్తున్నాడు. తమ బంధువు వెంకటాచలంలో ఉండడంతో యువకుడు అక్కడే ఉంటూ విధులకు హాజరవుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నాడు.

మృతిపై అనుమానాలు

యువకుడి మృతిపై యువకుడి తల్లిదండ్రులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యువకుడా స్థానికంగా ఉండే ఒక యువతిని ప్రేమించాడు. ఇది తెలిసిన యువతి కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి అతడిని మందలించినట్లు సమచారం. కాగా అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో అదే కాలనీకి చెందిన ఒక యువకుడు తన మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని వెళ్లడాన్ని కొందరు చూశారు. మరుసటి రోజు ఉదయం శవమై కనిపించడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు సమగ్ర విచారణ జరిపితే యువకుడిది హత్యా,ఆత్మహత్యా అనేది తేలుతుంది.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మనుబోలు : స్థానిక పెద్దచెరువు వద్ద వెలసిఉన్న గంగమ్మ ఆలయంలో శ్రావణ మాస చివరి శుక్రవారం కావడంతో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచావృతాభిషేకాలు, కుంకుమ పూజలను అర్చకులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. ఈ పూజా కార్యక్రమాలకు పడిగినేని శివయ్య, మాధవి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టారు. భక్తులకు ఉభయకర్తలు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

నాగార్జున విద్యార్థులకు

ఎమ్మార్ వ్యాక్సిన్

పొదలకూరు: పట్టణంలోని నాగార్జున స్కూల్ విద్యార్థులకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం ఎమ్మార్ టీకాలు వేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే పిల్లలందరికీ ఈ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి రామేశ్వరమ్మ మాట్లాడుతూ ఒకే టీకాతో మీజల్స్, రుబెల్లా అనే రెండు వ్యాధులను నివారించవచ్చని అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే చిన్నారులకు ఈ టీకాలు వేశామన్నారు. ఇంకా కొన్ని ప్రయివేట్ పాఠశాలల్లో వేయాల్సి ఉందని అన్నారు. ఈ టీకాల కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ లక్ష్మీదుర్గ, హెల్త్ సూపర్‌వైజర్ ఉరూజ్, ఆరోగ్య కార్యకర్తలు ఎం వెంకటేశ్వర్లు, కే కామక్షమ్మ, రమణమ్మ, సుగుణ, ఆశ వర్కర్లు రమణమ్మ, లత, అంగన్‌వాడీ కార్యకర్తలు సుమతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మనుబోలు క్రీడాకారులు

మనుబోలు : త్వరలో ప్రొద్దుటూరులో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మనుబోలు నుంచి శ్రీపతి శ్రీనువాసులు, పిడూరుకు చెందిన వైష్ణవి ఎంపికైనట్లు పీడీ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. అండర్ -16 విభాగంలో 400 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో, అండర్ -14 విభాగంలో 600 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ, 100మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో జిల్లా స్థాయి పోటీలలో విజయం సాధించడంతో శ్రీనువాసులు, వైష్ణవి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారని పీడీ వివరించారు. వీరిని ఎంపీపీ, ఇన్‌చార్జి ఎంపీడీవో, హెచ్‌ఎం అభినందించారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలని ఆకాంక్షించారు.



ఎంపికైన విద్యార్థులు

రేపు గౌడ విద్యార్థులకు

ప్రతిభా పురస్కారాల ప్రదానం

పొదలకూరు: పదో తరగతిలో ప్రతిభ కనబరచిన గౌడ విద్యార్థులకు ఆదివారం ఉదయం 9గంటలకు నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగే అభినందనసభలో ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు జిల్లా గౌడ సేవాసమితి అధ్యక్షులు కోసూరు గోవిందయ్యగౌడ్ శుక్రవారం తెలిపారు. ఐదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదవ తరగతి పరీక్షల్లో 8.5జీపీఏ పైన సాధించిన గౌడ విద్యార్థులందరికీ రూ.5వేలు నగదు, నోటుపుస్తకాలు, క్యాలిక్యులేటర్‌తో పాటు జ్ఞాపికలను ప్రోత్సహకంగా అందజేస్తున్నామని గుర్తుచేశారు. గౌడ సేవా సమతి, కల్లుగీత పారిశ్రామికుల సంఘం ఆధ్వర్యంలో జరిగే అభినంద సభలో ఏపీ కార్మికశాఖా మంత్రి పితాని సత్యనారాయణ, కలెక్టర్ రేవు ముత్యాలరాజు, ఏపీ కల్లుగీత కార్మికులు కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ, ప్రకాశం జిల్లా ఏసీబీ డీఎస్పీ తోట ప్రభాకర్ పాల్గొని ప్రతిభా పురస్కారాలను అందజేస్తారని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యాపారి మృతి

మనుబోలు : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఎస్‌కే. ఖాలేషా (40) శుక్రవారం తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఓజిలి మండలం రాచవారిపాళెంకు చెందిన ఎస్‌కే ఖాలేషా కూరగాయల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తుంటాడు. నిత్యం నెల్లూరుకు ఆటోలో వెళ్లి కూరగాయాలు తీసుకువచ్చి దుకాణం నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ మస్తాన్‌తో నెల్లూరుకు వెళుతుండగా వీరంపల్లి క్రాస్ రోడ్డు వద్ద కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మస్తాన్, ఖాలేషా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఖాలేషా మృతిచెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీపీ అనితమ్మ

మనుబోలు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఎనిమిది మంది ఉపాధ్యాయులకు శుక్రవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని పీడీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఐఎస్ఆర్ రాజేశ్వరి, ఏ.వెంకటేశ్వర్లు,, ఏ.ప్రసాద్ ఎస్.శైలజ, సి.మల్లిఖార్జున, బీ.రాజేశ్వరి, వీజేజే. జయరాజ్‌లను ఎంపీపీ చిట్టమూరు అనితమ్మ శాలువాలు కప్పి, ప్రోత్సాహకాలు ఇచ్చి సత్కరించారు. ఎనిమిదేళ్ల పాటు మండలంలో పనిచేసి విశిష్టసేవలందించిన ఉపాధ్యాయులను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ముజిబున్నీసా, ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భ జలాల పెంపు

డక్కిలి: చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య, ఎంపీపీ పోలంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆల్తూరుపాడు గ్రామ సమీపంలో రూ 10 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తిచేసుకొన్న చెక్ డ్యాంను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ చెక్‌డ్యాంల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు వివరించారు. వెలుగొండ కొండల్లో పడ్డ వర్షపు నీటిని భూమిలో ఇంకించుదుకు ఈ చెక్‌డ్యాంలు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పెద్ద ఎత్తున చెక్‌డ్యాంలను నిర్మిస్తుందన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

వెంకటగిరి(టౌన్): స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బదిలీపై వెళుతుండటంతో వారిని శుక్రవారం హెచ్ఎం శ్రీలక్ష్మి సన్మానించారు. అలాగే చెలికంపాడు ఉపాధ్యాయిని సుమతిని హెచ్ఎం వెంకటేశ్వర్లు సన్మానించారు.

కలువాయి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన 20 మంది ఉపాధ్యాయులను హెచ్ఎం ఎస్.జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలతో సన్మానించారు. అలాగే కనుపూరుపల్లిలో హెచ్ఎం బి.కోటేశ్వరావును సన్మానించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థి ఎంపిక

డక్కిలి: ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో డక్కిలి హైస్కూలు విద్యార్థి వెంకటప్రసాద్ ఫుట్‌బాల్ విభాగంలో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో ఆ విద్యార్థిని మండల ఫిజికల్ డైరెక్టరు జగదీష్‌బాబు అభినందించారు.

దుస్తుల పంపిణీ

వెంకటగిరి(టౌన్): సినీనటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని పట్టణంలోని అయ్యప్పగుడి వీధిలో వృద్ధులకు శుక్రవారం చిరంజీవి అభిమానులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు రాజా, మోహన్, పేచీరాజ్, దొర, శేషు, మణి, సాయి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మంచినీటి కూలర్ వితరణ

రాపూరు: స్థానిక ఉన్నత పాఠశాలకు రూ.25 వేల వాటర్ కూలర్‌ను బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ఆదమ్‌షరీఫ్ వితరణగా అందజేశారు. హెచ్ఎం భాస్కర్‌రావు దానిని అనంతరం పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రారంభించారు. తన తల్లి శిలార్బి గుర్తుగా కూలర్‌ను ఇచ్చానని షరీఫ్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



విచారిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్

సైదాపురం: మండలంలోని సైదాపురం, తిప్పిరెడ్డిపల్లి, చాగణం, కృష్ణారెడ్డిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో శంషాద్ శుక్రవారం తనిఖీ చేశారు. సైదాపురం దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో రెండు రోజులుగా గర్భిణులకు, బాలింతలకు భోజనం, కోడిగుడ్లు పెట్టడంలేదని స్థానికులు సీడీపీవో దృష్టికి తీసుకుపోవడంతో విచారణ చేపట్టారు. ఆమె వెంట సూపర్‌వైజర్ పద్మ, సిబ్బంది ఉన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

వెంకటగిరి(టౌన్): యాజమాన్య పద్ధతులలో సేద్యం చేసే విధానంపై శుక్రవారం వ్యవసాయ శాఖ ఏడీ ఉషారాణి స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నిమ్మ, చీని పరిశోధనా శాస్త్రవేత్త డీ గోవిందరాజులు, ఏవో శిరీష, ప్రవీణ, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్

డక్కిలి: వెంబులూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దూడల పెంచలయ్య, ఆరోగ్య సిబ్బంది వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

'కోన'లో ఆదిలక్ష్మికి ఆస్థాన సేవ



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



విశేష అలంకరణలో ఆదిలక్ష్మి

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలోని ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ఆస్థాన సేవ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం 5గంటలకు అమ్మవారికి అభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు అమ్మవారిని తిరుచ్చిపై ఉంచి కోన వీధుల్లో క్షేత్రోత్సవం చేశారు. సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారికి ప్రత్యేక మండపంలో ఆస్థాన సేవ నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో కోనకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పర్వత వర్ధినికి కుంకుమార్చన

శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా రాపూరులోని పర్వత వర్ధిని అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో అమ్మవారిని ఉంచి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద

వెంకటగిరి: పేదరికం నిర్మూలనకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద సూచించారు. శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్‌లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం 3 నెలల పాటు ప్లంబింగ్, నర్సింగ్‌పై మహిళలకు శిక్షణ ఇస్తుందన్నారు. శిక్షణ పూర్తయిన వారికి ప్రభుత్వం ధ్రువీకరణ పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూచించారు. అదేవిధంగా త్వరలో కంప్యూటర్ శిక్షణ కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు

పట్టణ పరిధిలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోని శ్మశాన వాటిక అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 32 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ నిధులతో కాంపౌండ్ వాల్, రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

పారిశుధ్యం మెరుగుపై శ్రద్ధ చూపండి

వెంకటగిరి(టౌన్): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు శ్రద్ధ చూపాలని ఎంపీడీవో నాగమణి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించి శుభ్రం చేయాలన్నారు. దోమలు నివారించేందుకు ఫాగింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, ఎంపీపీ మునెమ్మ, జడ్పీటీసీ గురునాథం, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐవోఎస్ ప్రశ్న పత్రాల పంపిణీ

కలువాయి: సాక్షరభారత్ కేంద్రాల్లో విద్యను అభ్యసించిన వారికి ఈనెల 20వ తేదీ నిర్వహించనున్న ఎన్ఐవోఎస్ పరీక్షకు సంబంధించి శుక్రవారం ప్రశ్న పత్రాలు పంపిణీ గ్రామ కోర్డినేటర్లకు ఎంపీడీవో అందజేశారు. ఈ కార్యక్రమంలో సాక్షరభారత్ మండల కోర్డినేటర్ పి.సునీల్ పాల్గొన్నారు.

ఎర్రచందనంపై అవగాహన

కలువాయి: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ అధికారులు పేర్కొన్నారు. వెంకటరామరాజుపేటలో శుక్రవారం ఎర్రచందనం అక్రమ రవాణాపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అశోక్ కుమార్, టాస్క్‌పోర్స్ డీఆర్వో వై.రామకృష్ణారావు, కలువాయి డీఆర్వో వెంకటేశ్వర్లు, సిబ్బంది ఎం.శ్రీనివాసరావు, సీహెచ్. రమేష్, పాపారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మునీశ్వరుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు



మునీశ్వరుడిని దర్శించుకుంటున్న ఎంపీపీ, జడ్పీటీసీ

డక్కిలి: అత్తలసిద్ధవరంలోని మునీశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. మరికొందరు పొట్టేళ్లు, మేకలు బలిచ్చారు. అనంతరం తలనీలాలు సమర్పించారు. అలాగే జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, లింగసముద్రం సర్పంచు వేముల నాగభూషణం నాయుడు, లింగసముద్రం సొసైటీ అధ్యక్షుడు వేముల రాజమోహన్ నాయుడు, వైసీపీ మండల కన్వీనర్ రాజా తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రామచంద్రయ్యనాయుడు మాట్లాడుతూ వెలుగొండ కొండలకు ఆనుకొని ఉన్న అత్తలసిద్ధవరంలోని మునీశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ సహకారం, జడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం, ఆలయ పరిసరాల్లో చదును చేసి భక్తులకు వసతులు కల్పించామన్నారు.

నీటి శుద్ధి యంత్రం వితరణ

కలువాయి : మండలంలోని వెరుబొట్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన వంగా వీరరాఘవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పెంచలనరసారెడ్డి శుక్రవారం నీటి శుద్ధి యంత్రం విరాళంగా ఇచ్చారు. అదే విధంగా వాటర్ కూలింగ్ పరికరాన్ని కలువాయికి చెందిన కామిశెట్టి రమణయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జీ.సుధీర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు



అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో విజయలక్ష్మి

కలువాయి: కలువాయి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయలేదని కలువాయి, కుల్లూరు వైద్య సిబ్బంది తీరుపై డీఎంహెచ్‌వో వరసుందరంకు స్త్రీశిశు సంక్షేమశాఖ పొదలకూరు సీడీపీవో విజయలక్ష్మి శుక్రవారం ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ నిమిత్తం కలువాయికి వచ్చిన ఆమె కలువాయి మెయిన్ ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ వర్కర్ ఇక్కడ పిల్లలకు కలువాయి, కుల్లూరు వైద్య సిబ్బంది మా పరిధిలో లేదంటూ పిల్లలకు టీకాలు వేయలేదని సీడీపీవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై సీడీపీవో డీఎంహెచ్‌వోకు ఫోన్‌లో విషయం తెలియజేశారు. స్థానిక ముస్లింపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10 మంది కంటే తక్కువగా ఉన్న కేంద్రాలను క్లబ్ చేశామని తెలిపారు. కలువాయి, కుల్లూరు, తెలురాయపురం, వెరుబొట్లపల్లి, కేశమనేనిపల్లిలోని కేంద్రాలను క్లబ్ చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కూరగాయల మొక్కలు పెంచాలన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ రాజేశ్వరమ్మ ఉన్నారు.